www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 9-10-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 193 | వరంగల్

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి మ. 12.15 తదుపరి సప్తమి; నక్షత్రం: మూల తె. 5.15 తదుపరి పూర్వాషాఢ వర్జ్యం: మ. 12.30-2.10, తె. 3.34-5.15, దుర్ముహూర్తం: ఉ. 11.38-12.25, అమృతఘడియలు: రా. 10.33-12.13, రాహుకాలం: మ. 12.00-1.30, సూర్యోదయం: 6.10, సూర్యాస్తమయం: 5.53

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గెలవాలి.. అదిరేలా!

లంకతో భారత్ కీలక పోరు నేడు

మహిళల వరల్డ్ కప్

స్కాట్లాండ్ X దక్షిణాఫ్రికా
మ. 3.30 నుంచి

భారత్ X శ్రీలంక
రా.7.30 నుంచి

స్టార్ నెట్‌వర్క్, డిస్నీ హాట్‌స్టార్‌లో



జట్లు (అంచనా)

భారత్: షఫాలీ వర్మ, స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), జెమీమా, రిచా ఘోష్, సజన, దీప్తి, అరుంధతి, శ్రేయాంక, శోభన, రేణుక.

శ్రీలంక: విష్మి గుణరత్నె, చమరి ఆటపట్టు (కెప్టెన్), హర్షిత, కవిష, నీలాక్షి, హాసిని, అనుష్క, సుగంధిక, ప్రియదర్శిని, ఇనోక రణవీర, ప్రబోధిని.

దుబాయ్: మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో మిశ్రమ ఫలితాలను చవిచూసిన భారత్.. సెమీస్ రేసులో నిలవాలంటే భారీ విజయాలతో నెట్ రన్‌రేట్‌ను మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. ఈ క్రమంలో బుధవారం గ్రూప్-ఎలో శ్రీలంకతో జరిగే మ్యాచ్‌లో గెలుపే లక్ష్యంగా హర్మన్‌ప్రీత్ సేన బరిలోకి దిగనుంది. భారీ అంచనాలతో పొట్టి కప్ బరిలోకి దిగిన భారత్.. తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో 58 పరుగుల తేడాతో ఘోరంగా ఓడడంతో నెట్ రన్‌రేట్ దారుణంగా పడిపోయింది. ఆ తర్వాతి మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై 105 పరుగుల స్వల్ప స్కోరును కూడా కష్టంగా ఛేదించింది. టీమిండియా ప్రస్తుత పరిస్థితికి బ్యాటర్ల వైఫల్యమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. డాషింగ్ ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధాన ధనాధన్ ఆరంభాన్ని అందించలేకపోతున్నారు. ఆడిన రెండు మ్యాచ్‌ల్లో వర్మ 2, 32 పరుగులు చేయగా.. మంధాన 12, 7 రన్స్ మాత్రమే స్కోరు చేసింది. పాక్‌తో మ్యాచ్‌లో మెడ నొప్పితో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన కెప్టెన్ హర్మన్ ఫిట్‌గా ఉన్నట్టు సమాచారం. మందకొడి వికెట్లపై జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా ఘోష్ ధాటిగా ఆడలేకపోవడం మైనస్‌గా మారింది. గత మ్యాచ్‌లో మూడు వికెట్లతో రాణించిన పేసర్ అరుంధతి నుంచి జట్టు అదే తరహా ప్రదర్శనను ఆశిస్తుండగా.. రేణుక నుంచి తగిన సహకారం అవసరం. కాగా, స్పిన్ విభాగానికి ఎంతో కీలకమైన దీప్తి అంతగా ప్రభావం చూపలేక పోవడం ఆందోళన కలిగించే విషయం. గ్రూప్‌లో ఆఖరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో ఆడాల్సి ఉండడంతో అన్ని రంగాల్లోనూ భారత్ మెరుగైన ప్రదర్శన చేయాల్సిందే. మరోవైపు రెండు వరుస ఓటములతో సెమీస్ అవకాశాలను సంక్లిష్టం చేసుకొన్న లంక గెలుపు బోణీ చేయాలనే కసితో ఉంది. బ్యాటింగ్‌లో ఆటపట్టుతోపాటు గుణరత్నె, హర్షిత, నీలాక్షిక అండగా నిలుస్తున్నారు. ఇరుజట్లకూ గెలుపు కీలకం కావడంతో.. మ్యాచ్ రసవత్తరంగా సాగే అవకాశం ఉంది.

బంగ్లా పోటీనిచ్చేనా?

సిరీస్‌పై భారత్ గురి
నేడు రెండో టీ20
రాత్రి 7 గంటల నుంచి స్పోర్ట్స్18లో



న్యూఢిల్లీ: భారత పర్యటనలో ఉన్న బంగ్లాదేశ్ జట్టు ఇప్పటి వరకు పెద్దగా పోటీ ఇచ్చింది లేదు. టెస్టు సిరీస్‌ను కోల్పోవడంతో పాటు పొట్టి ఫార్మాట్‌ను కూడా పేలవంగా ఆరంభించింది. అటు ఆతిథ్య టీమిండియా మాత్రం రెట్టించిన ఉత్సాహంతో మరో సిరీస్‌పై కన్నేసింది. సీనియర్లకు విశ్రాంతినిచ్చి యువ ఆటగాళ్లతో జట్టును ఎంపిక చేసినా.. బంగ్లాపై తొలి టీ20లో అన్ని విభాగాల్లోనూ పైచేయి సాధించింది. ఈనేపథ్యంలో ఇరు జట్ల మధ్య నేడు కీలక రెండో టీ20 జరుగనుంది. కోచ్ గంభీర్ సొంత మైదానంలో మరో మ్యాచ్ ఉండగానే చక్కటివిజయంతో సిరీస్ అందుకోవాలని సూర్యకుమార్ సేన తాపత్రయపడుతోంది. పర్యాటక జట్టు మాత్రం గెలుపే ధ్యేయంగా బరిలోకి దిగనుంది. ఎందుకంటే ఇక్కడ గెలిస్తేనే సిరీస్‌లో సజీవంగా ఉంటుంది.

అన్ని విభాగాల్లోనూ పటిష్ఠంగా..: ఈ సిరీస్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన సంజూ శాంసన్ ఆకట్టుకున్నాడు. 2015లో అరంగేట్రం చేసినా నిలకడలేమితో జట్టులోకి వస్తూపోతూ ఉన్న సంజూ చక్కటి స్ట్రోక్‌ప్లేతో పవర్‌ప్లేలో చెలరేగాడు. మరో ఓపెనర్ అభిషేక్‌తో కలిసి నేటి మ్యాచ్‌లో మరింత మెరుగైన ప్రదర్శన కనబర్చాలనుకుంటున్నాడు. కెప్టెన్ సూర్యకుమార్ ధనాధన్ బ్యాటింగ్‌తో చెలరేగుతుండగా.. హార్దిక్ అటు బంతితో ఇటు బ్యాటుతో రాణిస్తున్నాడు. యువ పేసర్ మయాంక్ యాదవ్ అరంగేట్రంలోనే అదుర్స్ అనిపించుకున్నాడు. అర్ష్‌దీప్ ఆరంభం.. చివర్లో వికెట్లు నేలకూల్చడంతో బంగ్లా స్వల్ప స్కోరుకే పరిమితమైంది. ఇక మూడేళ్ల తర్వాత రీఎంట్రీ ఇచ్చిన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి మూడు వికెట్లతో వెన్నువిరిచాడు. ఈ మ్యాచ్‌లోనూ అతడు రాణిస్తే బంగ్లా బ్యాటర్లకు తిప్పలు తప్పవు.

ఒత్తిడిలో బంగ్లా: ఇక్కడి బ్యాటింగ్ పిచ్‌పై సూపర్ ఫామ్‌లో ఉన్న భారత బ్యాటర్లను నిలువరించాలంటే బంగ్లా బౌలర్లు చెమటోడ్చాల్సిందే. వెటరన్ ప్లేయర్ మహ్మదుల్లాకు పొట్టి ఫార్మాట్‌లో ఇదే చివరి సిరీస్ కానుంది. దీంతో అతడికి ఘనంగా ఫేర్‌వెల్ ఇవ్వాలనుకుంటే జట్టు ఈ మ్యాచ్ గెలవాల్సి ఉంటుంది. అదీగాకుండా గతంలో అరుణ్ జైట్లీ స్టేడియంలోనే భారత్‌పై ఏకైక టీ20 విజయాన్ని బంగ్లా సాధించింది. ఆ ఉత్సాహంతో మరోసారి గెలుపు రుచి చూడాలనుకుంటోంది. బ్యాటింగ్‌లో మిరాజ్, షంటో మాత్రమే రాణిస్తుండగా, లిట్టన్ జట్టుకు శుభారంభాన్ని అందివ్వాల్సి ఉంది. ఇక బౌలర్లంతా తొలి టీ20లో ధారాళంగా పరుగులిచ్చుకున్నారు.

సూర్యకుమార్ మరో 39 పరుగులు సాధిస్తే టీ20ల్లో అత్యంత వేగం (73 మ్యాచ్‌లు)గా 2500 రన్స్ పూర్తి చేసిన రెండో బ్యాటర్‌గా కోహ్లి రికార్డును సమం చేస్తాడు. బాబర్ ఆజమ్ (67) టాప్‌లో ఉన్నాడు.

పిచ్
అరుణ్ జైట్లీ స్టేడియం సహజంగా బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంటుంది. ఈ ఏడాది ఐపీఎల్‌లో ఇక్కడ జరిగిన ఐదు మ్యాచ్‌ల్లోనూ 200+ పరుగులు నమోదయ్యాయి.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, శాంసన్, సూర్యకుమార్ (కెప్టెన్), నితీశ్ కుమార్, హార్దిక్, రియాన్, రింకూ సింగ్, వాషింగ్టన్,వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్, మయాంక్ యాదవ్.

బంగ్లాదేశ్: లిట్టన్ దాస్, పర్వేజ్ హొస్సేన్, షంటో (కెప్టెన్), తౌహిద్, మహ్మదుల్లా, జకీర్ అలీ, మిరాజ్, రిషాద్, తన్జీమ్ హసన్, టస్కిన్, ముస్తాఫిజుర్, షోరిఫుల్.

సల్మాన్ ఆగా శతకం

పాక్ తొలి ఇన్నింగ్స్ 556


సల్మాన్ ఆగా (104 నాటౌట్)

ముల్తాన్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో పాకిస్తాన్ తరఫున మూడో శతకం నమోదైంది. రెండో రోజు మంగళవారం ఆటలో సల్మాన్ ఆగా (104 నాటౌట్) రాణించాడు. దీంతో పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 556 పరుగులు చేసింది. లీచ్‌కు మూడు.. కార్స్, అట్కిన్సన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ ఆట ముగిసే సమయానికి 96/1 స్కోరుతో ఉంది. ఓపెనర్ క్రాలే (64 బ్యాటింగ్), రూట్ (32 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

సఫారీలకు ఐర్లాండ్ షాక్

అబుధాబి: దక్షిణాఫ్రికాకు ఐర్లాండ్ మరోసారి షాకిచ్చింది. ఇప్పటికే రెండో టీ20లో సఫారీలను ఓడించిన ఐర్లాండ్ సోమవారం రాత్రి జరిగిన మూడో వన్డేలో 69 పరుగుల తేడాతో చిత్తుచేసింది. అయితే ఈ సిరీస్‌ను మాత్రం 2-1తో సఫారీలు గెలుచుకున్నారు. ముందుగా బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ 50 ఓవర్లలో 284/5 స్కోరు చేసింది. కెప్టెన్ స్టిర్లింగ్ (88), టెక్టర్ (60) రాణించారు. విలియమ్స్‌కు 4 వికెట్లు దక్కాయి. ఛేదనలో దక్షిణాఫ్రికా 46.1 ఓవర్లలో 215 పరుగులకు కుదేలైంది. జేసన్ స్మిత్ (91) ఒక్కడే రాణించాడు. హ్యూమ్, యంగ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి.

ఫుట్‌బాల్‌కు ఇనియెస్టా వీడ్కోలు



న్యూఢిల్లీ: స్పెయిన్ ఫుట్‌బాల్ దిగ్గజం ఆండ్రెస్ ఇనియెస్టా (40) రిటైర్మెంట్ ప్రకటించాడు. 2010 వరల్డ్‌కప్‌లో ఇనియెస్టా విన్నింగ్ గోల్‌తో స్పెయిన్ విశ్వవిజేతగా నిలిచింది. 22 ఏళ్ల కెరీర్‌లో 2 యూరోపియన్ చాంపియన్‌షిప్ టైటిళ్లు, 4 చాంపియన్స్ లీగ్ ట్రోఫీలు గెలిచాడు. బార్సిలోనా తరఫున కూడా ఆడాడు.

టీ20లకు మహ్మదుల్లా గుడ్‌బై

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మహ్మదుల్లా (38) టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. భారత్‌తో జరుగుతున్న సిరీస్‌లో మిగిలిన రెండు మ్యాచ్‌లు తన కెరీర్‌లో చివరివని తెలిపాడు. 2021లోనే టెస్ట్‌లకు గుడ్‌బై చెప్పిన మహ్మదుల్లా.. వన్డేల్లో మాత్రమే కొనసాగనున్నట్టు చెప్పాడు. బంగ్లా తరఫున 139 టీ20లు ఆడిన మహ్మదుల్లా 2395 పరుగులు చేయగా.. 40 వికెట్లు పడగొట్టాడు.



ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్ పోటీల ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం ముంబైలో జరిగింది. భారత్, ఇంగ్లండ్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, ఆస్ట్రేలియా జట్లు తలపడే ఈ లీగ్ నవంబరు 17 నుంచి భారత్‌లో జరగనుంది. ఈ వేడుకలో సచిన్, మోర్గాన్, లారా, రోడ్స్, కలువితరణ, వాట్సన్ పాల్గొన్నారు.

పంగాలియా శతకం

చెన్నై: హర్వాంశ్ పంగాలియా (117) సెంచరీతో అదరగొట్టడంతో.. ఆస్ట్రేలియా అండర్-19తో అనధికార టెస్ట్‌లో భారత్ భారీ స్కోరు చేసింది. ఆటకు రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 316/5తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 492 పరుగులకు ఆలౌటైంది. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన ఆసీస్ 142/3 స్కోరు చేసింది.

గ్యాంజీస్‌కు మరో ఓటమి

లండన్: గ్లోబల్ చెస్ లీగ్‌లో గ్యాంజీస్ గ్రాండ్ మాస్టర్స్‌కు మరో ఓటమి ఎదురైంది. ఏడో రౌండ్‌లో గ్యాంజీస్ గ్రాండ్ మాస్టర్స్ 5-14తో అలాస్కన్ నైట్స్ చేతిలో పరాజయం పాలైంది. కాగా, అప్‌గ్రాడ్ ముంబా మాస్టర్స్ 11-5తో ఆల్పైన్ ఎస్‌జీ పైపర్స్‌పై గెలిచింది. అమెరికన్ గాంబిట్స్.. త్రివేణి కాంటినెంటల్‌పై నెగ్గింది. 7 రౌండ్లు ముగిసేసరికి 18 పాయింట్లతో నైట్స్ టాప్‌లో ఉంది.

సింధు పరాజయం

వంటా (ఫిన్లాండ్): భారత స్టార్ క్రీడాకారిణి పి.వి. సింధు ఆర్కిటిక్ ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్‌లో పరాజయం పాలైంది. మంగళవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో సింధు 16-21, 10-21తో మిచెల్ లీ (కెనడా) చేతిలో ఓటమి పాలైంది. మరో మ్యాచ్‌లో వరల్డ్ నెంబర్ 23 సుంగ్ షు యున్ (చైనీస్ తైపీ)కి మాళవిక షాకిచ్చింది. పురుషుల సింగిల్స్‌లో కిరణ్ జార్జ్ ముందంజ వేయగా, సతీష్ కుమార్ ఇంటిముఖం పట్టాడు.


షుట్ (3/3)

ఆస్ట్రేలియా ఘనవిజయం

మహిళల టీ20 వరల్డ్‌కప్

షార్జా: న్యూజిలాండ్‌తో మంగళవారం జరిగిన మహిళల టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 60 రన్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 148 పరుగులు చేసింది. బెత్ మూనీ (40), ఎలిస్ పెర్రీ (30), హీలీ (26) రాణించారు. అమెలియా కెర్‌కు నాలుగు.. హల్లీడే, మెయిర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో కివీస్‌ను పేసర్ మెగాన్ షుట్ (3/3) వణికించింది. దీంతో ఈ జట్టు 19.2 ఓవర్లలో 88 పరుగులకు కుప్పకూలింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా మెగాన్ షుట్ నిలిచింది.

బిజినెస్

రూ.7.51 లక్షల కోట్ల లాభం



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్‌లో ఆరు రోజుల వరుస నష్టాలకు అడ్డుకట్ట పడింది. వేల్యూ బైయింగ్‌తో ప్రామాణిక సూచీలు మంగళవారం మెరుగైన లాభాలు నమోదు చేశాయి. సెన్సెక్స్ ఒక దశలో 713.28 పాయింట్ల వరకు ఎగబాకినప్పటికీ, చివరికి 584.81 పాయింట్ల వృద్ధితో 81,634.81 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 217.40 పాయింట్లు పెరిగి 25,013.15 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 18 లాభపడ్డాయి. అదానీ పోర్ట్స్ 4.76 శాతం రాణించి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఎం అండ్ ఎం 3.42 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.01, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.95 శాతం బలపడ్డాయి. టాటా స్టీల్, టైటాన్, బజాజ్ ఫిన్‌సర్వ్ మాత్రం రెండు శాతానికి పైగా క్షీణించాయి. కాగా, బీఎస్ఈలోని మిడ్‌క్యాప్ సూచీ 1.86 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.44 శాతం పుంజుకున్నాయి. రంగాలవారీ సూచీల్లో మెటల్ మినహా అన్నీ పెరిగాయి. సర్వీసెస్ 3.25 శాతం ఎగబాకగా.. క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రియల్స్, పవర్, టెలికాం రెండు శాతానికి పైగా పుంజుకున్నాయి. కొనుగోళ్ల జోరుతో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.7.51 లక్షల కోట్ల పెరుగుదలతో రూ.459.50 లక్షల కోట్లకు (5.47 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 3 పైసలు పెరిగి 83.97 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా డాలర్ బలహీనపడటంతో పాటు ఈక్విటీ మార్కెట్లో లాభాలు రూపాయి బలోపేతానికి దోహదపడ్డాయి.
- ఇంటర్నేషనల్ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు ధర ఒక దశలో 1.84 శాతం తగ్గి 79.44 డాలర్ల వద్ద ట్రేడైంది.
- ఢిల్లీ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.400 తగ్గి రూ.78,300కు దిగివచ్చింది. కిలో వెండి ఏ మార్పు లేకుండా రూ.94,000 ధర పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒక దశలో 2,655.80 డాలర్లు, సిల్వర్ 31.43 డాలర్ల వద్ద ట్రేడైంది.

హ్యుండయ్ ఐపీఓ ధరల శ్రేణి రూ.1,865-1,960 !?

దక్షిణ కొరియా వాహన దిగ్గజం హ్యుండయ్‌కి భారత అనుబంధ విభాగమైన హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ రూ.25,000 కోట్ల మెగా ఐపీఓ ధరల శ్రేణిని రూ.1,865-1,960 శ్రేణిలో నిర్ణయించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ పబ్లిక్ ఇష్యూ 14 నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ నెల 22న కంపెనీ షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేయనుందని రాయిటర్స్ కథనం పేర్కొంది.

పడి లేచిన ఓలా షేరు

ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ షేరు మంగళవారం భారీగా ఊగిసలాడింది. వినియోగదారుల హక్కుల పరిరక్షణ ప్రాధికార సంస్థ సీసీపీఏ షోకాజ్ నోటీసు జారీ చేసిన నేపథ్యంలో కంపెనీ షేరు ఉదయం ట్రేడింగ్‌లో 6.17 శాతం వరకు క్షీణించి రూ.85.21 వద్దకు జారుకుంది. మళ్లీ కాసేపటికే తేరుకుని క్రమంగా పుంజుకుంది. చివరికి 5.15 శాతం లాభంతో రూ.95.50 వద్దకు చేరుకుంది.

ఎన్ఎస్‌డీఎల్ ఐపీఓకు సెబీ ఆమోదం

ప్రముఖ డిపాజిటరీ సేవల సంస్థ నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ప్రతిపాదనకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ఆమోదం తెలిపింది. ఎన్ఎస్‌డీఎల్‌తో పాటు తెలంగాణకు చెందిన స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ, జింకా లాజిస్టిక్స్ ఐపీఓలకూ పచ్చ జెండా ఊపింది. సెబీకి సమర్పించిన డీఆర్‌హెచ్‌పీ ప్రకారం.. ఐపీఓలో భాగంగా ఎన్ఎస్‌డీఎల్ తన వాటాదారులైన ఎస్‌బీఐ, ఎన్ఎస్ఈ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ వాటాకు చెందిన 5.72 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది.

గ్రీన్‌కో ఎనర్జీకి జీఐసీ గుడ్‌బై!

50% వాటా విక్రయ యోచనలో సింగపూర్ ప్రభుత్వ వెల్త్ ఫండ్

న్యూఢిల్లీ: హైదరాబాద్‌కు చెందిన పునరుత్పాదక ఇంధన సంస్థ గ్రీన్‌కో ఎనర్జీ హోల్డింగ్స్‌లో తనకున్న 50 శాతం వాటాను విక్రయించాలని సింగపూర్ ప్రభుత్వ వెల్త్ ఫండ్ జీఐసీ పీటీఈ భావిస్తున్నట్లు సమాచారం. ఈ వాటా విలువ 500 కోట్ల డాలర్ల (రూ.42,000 కోట్లు) స్థాయిలో ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అంటే, ఈ లెక్కన మార్కెట్లో గ్రీన్‌కో 1,000 కోట్ల డాలర్ల (రూ.84,000 కోట్లు) విలువ చేయనుంది.. గ్రీన్‌కో ఎనర్జీలో తన వాటాను పూర్తిగా లేదా పాక్షికంగా విక్రయించే విషయంపై జీఐసీ ఇప్పటికే ఫైనాన్షియల్ అడ్వైజర్లతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది. గ్రీన్‌కో ఎనర్జీ ప్రస్తుతం దేశంలోని 15 రాష్ట్రాల్లో 7.5 గిగావాట్ల పవన విద్యుత్, సోలార్, హైడ్రో పవర్ ప్రాజెక్టులను కలిగి ఉంది. సంస్థలో జీఐసీతో పాటు అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ), జపాన్‌కు చెందిన ఓరిక్స్ గ్రూప్ కూడా పెట్టుబడులు కలిగి ఉన్నాయి.

హైదరాబాద్‌లో వికీమీడియా టెక్నాలజీ సదస్సు

హాజరైన 130 మంది డెవలపర్లు, రీసెర్చర్లు

హైదరాబాద్: ఇండిక్‌మీడియా వికీ డెవలపర్స్ యూజర్ గ్రూప్, వికీమీడియా ఫౌండేషన్ మద్దతుతో ట్రిపుల్ ఐటీ, హైదరాబాద్ నిర్వహించిన 'వికీమీడియా టెక్నాలజీ సదస్సు 2024' ముగిసింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ సదస్సుకి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 130 మంది డెవలపర్లు, రీసెర్చర్లు, కమ్యూనిటీ లీడర్లు, వివిధ కాలేజీలకు చెందిన వికీక్లబ్ విద్యార్థులు హాజరయ్యారు. ఓపెన్‌సోర్స్ టెక్నాలజీలో ఇటీవలి నవకల్పనలు, వికీమీడియా ప్రాజెక్టుల గురించి ఈ సదస్సులో చర్చించారు. మూడు రోజుల సదస్సులో ఒక రోజు ట్రిపుల్ ఐటీ, హైదరాబాద్ క్యాంపస్‌లో 'హ్యాకథాన్' జరిగింది. ఇండిక్ లాంగ్వేజీ కమ్యూనిటీలకు అందుబాటులో ఉన్న వివిధ టెక్నాలజీల గురించి మిగతా రెండు రోజుల సదస్సులో చర్చించినట్లు ట్రిపుల్ ఐటీ, హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ రాధికా మామిడి తెలిపారు. ఇండిక్ లాంగ్వేజి వికీమీడియా తయారీలో కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావంపైనా ఈ మూడు రోజుల సదస్సులో చర్చ జరిగింది.

స్పైస్‌జెట్‌కు మరో 10 విమానాలు

న్యూఢిల్లీ: వచ్చే నెలకల్లా మరో 10 కొత్త విమానాలు తమ ఫ్లీట్‌లో చేరనున్నాయని స్పైస్‌జెట్ ప్రకటించింది. వాటిలో తొలి విమానం గురువారం అందుబాటులోకి రానుంది. వీటిలో 7 విమానాలను లీజుకి తీసుకుంటుండగా గతంలో వివిధ కారణాల వల్ల గ్రౌండ్‌కే పరిమితం చేసిన మూడు విమానాలను తిరిగి ప్రవేశపెట్టనున్నట్లు స్పైస్‌జెట్ తెలిపింది.



న్యూఢిల్లీ: చైనాకు చెందిన విద్యుత్ కార్ల తయారీ కంపెనీ బీవైడీ కొత్త కారు ఈ-మాక్స్ 7ను దేశీయ మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఈ మల్టీపర్పస్ వెహికల్ (ఎంపీవీ) ధర రూ.26.9 లక్షల నుంచి రూ.29.9 లక్షల మధ్యన ఉంటుంది. దీన్ని ఎకనామిక్ కమిషన్ ఫర్ యూరోప్ (ఈసీఈ) సర్టిఫికేషన్‌తో మార్కెట్లోకి తెచ్చారు. ఇది ఆరు సీట్లు, ఏడు సీట్ల వేరియెంట్లలో అందుబాటులో ఉంటుంది. భారత కస్టమర్లకు నవ్యత, సుస్థిరతతో కూడిన అత్యంత అధునాతనమైన వాహనాలు అందించాలన్న కట్టుబాటుకు ఇది నిదర్శనమని బీవైడీ ఇండియా హెడ్ రాజీవ్ చౌహాన్ చెప్పారు. విద్యుత్ వాహనాల తయారీలోకి టెస్లా వంటి ప్రపంచ శ్రేణి కంపెనీలను ఆకర్షించే లక్ష్యంతో గత మార్చిలో ప్రభుత్వం ప్రకటించిన కొత్త ఈవీ విధానం కింద ప్రయోజనాలకు తాము దరఖాస్తు చేసుకోబోవడంలేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చౌహాన్ స్పష్టం చేశారు.

ఇళ్ల అమ్మకాలు ధమాల్

హైదరాబాద్‌లో 19% డౌన్: ప్రాప్‌టైగర్

న్యూఢిల్లీ: సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికం నివాస గృహాల మార్కెట్‌కు పెద్దగా కలిసి రాలేదు. గత ఏడాది సెప్టెంబరు త్రైమాసికంలో దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో 1,01,221 యూనిట్ల నివాస గృహాలు అమ్ముడుపోగా.. ఈ ఏడాది అదే త్రైమాసికంలో విక్రయాలు 5 శాతం తగ్గి 96,544 యూనిట్లకు పడిపోయింది. ప్రాపర్టీ బ్రోకరేజీ సంస్థ ప్రాప్‌టైగర్ వెల్లడించింది. హైదరాబాద్ మార్కెట్‌పై ఈ ప్రభావం మరింత ఎక్కువగా కనిపించింది. గత ఏడాది సెప్టెంబరు త్రైమాసికంలో హైదరాబాద్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో 14,191 యూనిట్ల ఇళ్లు అమ్ముడుపోగా, ఈ ఏడాది 19%తగ్గుదలతో 11,564 యూనిట్లకు పడిపోయాయి.

ధరా'ఘాతం': కొత్తగా అందుబాటులోకి వచ్చే ఇళ్ల సరఫరా తగ్గడంతో పాటు ధరల పెరుగుదల కూడా సెప్టెంబరు త్రైమాసికంలో ఇళ్ల అమ్మకాలను దెబ్బతీసింది. ఈ సమయంలో దేశంలోని ఎనిమిది నగరాల్లో ఇళ్ల ధరలు సగటున 20 శాతం పెరిగాయి.



మారుతి సుజుకీ గ్రాండ్ విటారా డొమినియన్ లిమిటెడ్ ఎడిషన్

మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) మార్కెట్లోకి గ్రాండ్ విటారా డొమినియన్ లిమిటెడ్ ఎడిషన్‌ను తీసుకువచ్చింది. ఆల్ఫా, జెటా, డెల్టా వేరియంట్లలో పెట్రోల్, సీఎన్‌జీతో ఇది అందుబాటులో ఉండనుంది. పండగల సీజన్‌ను పురస్కరించుకుని ఈ ప్రత్యేక ఎడిషన్‌ను తీసుకువచ్చినట్లు ఎంఎస్ఐ తెలిపింది. ఈ లిమిటెడ్ ఎడిషన్ వేరియంట్లలో వరుసగా రూ.52,699, రూ.49,999, రూ.48,599 వరకు విలువ గల యాక్సెసరీస్ కిట్స్‌ను కాంప్లిమెంటరీగా అందించనున్నట్లు మారుతి సుజుకీ వెల్లడించింది.

మన రెగ్యులేటర్ల తీరు భేష్

ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

ముంబై: దేశంలోని ఆర్థిక రంగ నియంత్రణ సంస్థలు "ప్రపంచ శ్రేణి" ప్రమాణాలతో పని చేస్తూ వ్యవస్థలో మరింత పారదర్శకత తెస్తున్నాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రశంసించారు. రెగ్యులేటర్ల వైఖరులను ప్రశ్నించడానికి తాను వ్యతిరేకం కాదని, అయితే వారు ఆర్థిక రంగానికి చేస్తున్న విశిష్ట సేవల గురించి కూడా స్పష్టంగా తెలుసుకోవాలని ఆమె సూచించారు. ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ బ్యాంకు అవార్డుల కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్‌పై వచ్చిన ఆరోపణల విషయంలో వెలికి వస్తున్న వాస్తవాలను కూడా ప్రతి ఒక్కరూ పరిశీలించాలని ఆమె సూచించారు. రెగ్యులేటర్లకు సంబంధించిన ఏ అంశం చర్చించాలన్నా వాస్తవాలను కచ్చితంగా పరిశీలించాలని తాను సూచిస్తున్నట్టు చెప్పారు. అయితే తన వ్యాఖ్యలను సెబీ వ్యవహారంతో ముడిపెట్టి చూడవద్దని ఆమె స్పష్టం చేశారు.

క్యాన్సర్ ఔషధంపై రెండో దశ పరీక్షలు

ఆరిజీన్ అంకాలజీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ నుంచి మరో క్యాన్సర్ ఔషధం రానుంది. ఎముకల మజ్జలో ఏర్పడే క్యాన్సర్ వ్యాధి చికిత్స కోసం కంపెనీ అనుబంధ సంస్థ ఆరిజీన్ అంకాలజీ లిమిటెడ్ (ఏఓఎల్) అభివృద్ధి చేస్తున్న రిబ్రేకాబ్టజీన్ ఆటోల్యూసెల్ (డీఆర్ఎల్-180) ఔషధం తొలి దశ క్లినికల్ పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఇందుకోసం ఎనిమిది మంది రోగులపై జరిపిన క్లినికల్ పరీక్షలు ఆశావహంగా ఉన్నట్టు తెలిపింది. ఎముకల మజ్జ క్యాన్సర్‌తో బాధపడుతున్న రోగులపై మన దేశంలో ఈ తరహా క్లినికల్ పరీక్షలు నిర్వహించడం ఇదే మొదటిసారి. తొలి దశ క్లినికల్ పరీక్షలు ఆశాజనకంగా ఉండడంతో మరింత మంది రోగులపై రెండో దశ క్లినికల్ పరీక్షలకు డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) కంపెనీకి అనుమతి ఇచ్చింది. తొలి దశ పరీక్షలకు లోనైన ఎనిమిది మంది రోగుల్లో ఎలాంటి ప్రతికూల ఆరోగ్య సమస్యలు తలెత్తలేదని ఏఓఎల్ తెలిపింది. ఇటీవల బ్రెజిల్‌లో జరిగిన ఒక అంతర్జాతీయ వైద్య సదస్సులోనూ ఈ తొలి దశ క్లినికల్ పరీక్షల ఫలితాలను ప్రకటించారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,400 ▼	70,950 ▼	1,02,000 ▼
ముంబై	75,726 ▼	69,365 ▼	90,412 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

9వ తేదీ

హైదరాబాద్	510	విజయవాడ	525
వరంగల్	512	గోదావరి	525
చిత్తూరు	523	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	114	విజయవాడ	120
వరంగల్	114	గుంటూరు	123
కరీంనగర్	114	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	124
కర్నూలు	114	నెల్లూరు	124
విశాఖపట్నం	115	అనంతపురం	124
గోదావరి	120		

మెషీన్ లెర్నింగ్‌కు
ఫిజిక్స్ నోబెల్
- జాన్ హోప్‌ఫీల్డ్, జెఫ్రీ హింటన్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు
- కృత్రిమ నాడీవ్యవస్థతో మెషిన్ లెర్నింగ్ ఆవిష్కరణకు పట్టం

3

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



బుధవారం | 9-10-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 193
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
వరంగల్

కమలం ఖుషీ

హరియాణాలో హ్యాట్రిక్ విజయం.. జమ్మూకశ్మీర్‌లో గణనీయంగా సీట్లు

సార్వత్రిక ఎన్నికల ఫలితాలతో ఒకింత నిరాశ చెందిన కమలనాథులకు.. హరియాణా, జమ్ముకశ్మీర్ ఎన్నికల ఫలితాలు కొత్త ఉత్సాహాన్నిచ్చాయి! ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించి మరీ హరియాణాలో హ్యాట్రిక్ విజయం సాధించిన బీజేపీ.. జమ్ముకశ్మీర్‌లో గతంలో కన్నా ఎక్కువ సీట్లు సాధించి సత్తా చాటింది! రెండు చోట్లా ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తప్పాయి! హరియాణాలో కాంగ్రెస్‌దే విజయమని.. బీజేపీకి అధికారం సుదూర స్వప్నమేనని.. జమ్ముకశ్మీర్‌లో హంగ్ తప్పదని అన్ని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. కానీ.. హరియాణాలో బీజేపీ గెలుపు ఢంకా మోగిస్తే.. జమ్ముకశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కూటమి విజయనాదం చేసింది!! హరియాణాలో డకౌట్ అయిన ఆమ్ ఆద్మీ పార్టీ.. అనూహ్యంగా కశ్మీర్‌లో ఒక్క స్థానంతో బోణీ కొట్టింది.


జమ్మూలో బీజేపీ నేతలు, కార్యకర్తల విజయోత్సాహం

ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించి
వరుసగా మూడోసారి విజయం

- హరియాణాలో 90 సీట్లకుగాను 48 స్థానాల్లో బీజేపీ గెలుపు.. 2
- 37 స్థానాలతో సరిపెట్టుకున్న కాంగ్రెస్.. ఒక్క సీటూ సాధించని ఆప్
- ఓట్ల లెక్కింపులో తొలుత కాంగ్రెస్ జోరు.. తర్వాత పుంజుకున్న బీజేపీ
- కాంగ్రెస్ భస్మాసుర హస్తం.. కచ్చితమనుకున్న గెలుపు వర్గపోరుతో దూరం
- జాట్లు హస్తంవైపు మొగ్గుచూపడంతో.. బీజేపీవైపునకు జాటేతర వర్గాలు!

హంగ్ అంచనాలు తలకిందులు

- జమ్ముకశ్మీర్‌లో ఎన్సీ-కాంగ్రెస్ కూటమికి పట్టం
- ఎన్సీ-42, కాంగ్రెస్-6, బీజేపీకి 29 సీట్లు
- కశ్మీర్ ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా?
- హరియాణా సీఎంగా నాయబ్ కొనసాగింపు? 2
- కార్యకర్తల కృషి వల్లే ఈ విజయం: ప్రధాని మోదీ
- కాంగ్రెస్‌కు పలు రాష్ట్రాల్లో నో ఎంట్రీ బోర్డు: నడ్డా
- అరంగేట్రంలో వినేశ్ ఫొగాట్ ఉత్కంఠ విజయం
- హరియాణా, కశ్మీర్‌పై ఎగ్జిట్ పోల్స్ అన్నీ తప్పు 3

హరియాణా ఫలితాన్ని ఆమోదించం

- ప్రజల ఆకాంక్షలకు భిన్నమైన ఫలితమిది
- రౌండ్ల వారీ ఫలితాల వెల్లడిలో తీవ్ర జాప్యం
- ఈవీఎంల బ్యాటరీల చార్జింగ్‌లోనూ తేడాలు
- మేం గెలిచిన స్థానాల్లో 60-70 శాతం
- బీజేపీ గెలిచిన అన్ని చోట్లా 99 శాతం చార్జింగ్
- ఇది ఎలా సాధ్యమైంది? ఈసీ వద్దకు వెళ్తాం..
- కాంగ్రెస్ నేతలు జైరాం రమేశ్, పవన్‌ఖేరా 2

నిర్వాసితుల్ని
నష్టపోనివ్వం



- ప్రత్యామ్నాయ నివాసాలు కల్పిస్తాం
- సామాన్య ప్రజలకు, బడుగు, బలహీన వర్గాల వారికి నష్టం జరగకుండా చర్యలు
- వర్షాలు, వరదలతో హైదరాబాద్‌లో వచ్చే కల్లోలాన్ని అరికట్టాలంటే కూల్చివేతలు తప్పవు
- అసదుద్దీన్‌కు స్పష్టం చేసిన రేవంత్‌రెడ్డి
- ఢిల్లీలో సీఎంను కలిసిన ఎంఐఎం అధినేత

న్యూఢిల్లీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో వర్షాలు, వరదల వల్ల ఏర్పడుతున్న కల్లోల పరిస్థితులను అరికట్టాలంటే కూల్చివేతలు తప్పవని సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. అయితే ఈ కూల్చివేతలతో నిర్వాసితులయ్యే వారికి న్యాయం చేస్తామన్నారు. వారికి ప్రత్యామ్నాయ నివాస ఏర్పాట్లు కల్పించేందుకు ఇప్పటికే తగిన ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. సామాన్య ప్రజలకు, బడుగు, బలహీన వర్గాల వారికి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నదే తన ఉద్దేశమని చెప్పారు. మంగళవారం ఢిల్లీలోని సీఎం అధికార నివాసంలో తనను కలిసిన ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి ఈ విషయాన్ని రేవంత్ స్పష్టం చేశారు. ఓవైపు హైడ్రా, మరోవైపు మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా చెరువులు, మూసీలో ఆక్రమణలను ప్రభుత్వం కూల్చివేస్తుండడంపై విపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. కాగా, హైడ్రా కూల్చివేతలను మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్న అసదుద్దీన్.. ముఖ్యమంత్రితో భేటీలో ప్రధానంగా ఈ అంశాన్నే ప్రస్తావించినట్లు తెలిసింది. కూల్చివేతల కారణంగా బలహీన వర్గాలకు చెందిన పేదలు, పేద ముస్లింలు రోడ్డున పడతారని ఒవైసీ ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. పేదల ఇళ్ల కూల్చివేతపై పునరాలోచించాలని, వారికి నష్టం జరగని విధంగా ముందుకెళ్లాలని సీఎం రేవంత్‌ను ఆయన కోరినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. హైడ్రా, మూసీ ఆక్రమణల కూల్చివేతల విషయంలో

మిగతా 5వ పేజీలో...

కొత్త టీచర్లకు నియామక పత్రాలు

- సీఎం చేతుల మీదుగా నేడు ఎల్బీ స్టేడియంలో 11
- అభ్యర్థులను రప్పించేందుకు ఉచిత బస్సులు
- మొత్తం 11,062 పోస్టులు.. 10,006 భర్తీ

విద్యుత్తు శాఖలో ఖాళీలపై త్వరలో భారీ నోటిఫికేషన్

ఈ నెలలోనే స్కిల్ వర్సిటీలో కోర్సులు!

12

వర్గీకరణపై ఏక సభ్య కమిషన్!

సుప్రీంకోర్టు లేదా హైకోర్టు రిటైర్డ్ జడ్జి సారథ్యంలో ఏర్పాటు చేయాలి



- న్యాయపరమైన చిక్కుల్లేకుండా ఉండటానికే కమిషన్
- 2011 జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీ వర్గీకరణ
- ప్రభుత్వానికి మంత్రివర్గ ఉపసంఘం సిఫారసులు
- నాలుగో సమావేశంలో పలు అంశాలపై చర్చ
- ఉపసంఘానికి 1,082 ప్రజా వినతులు
- పంజాబ్, తమిళనాడులో బృందాల అధ్యయనం
- త్వరలో జిల్లాల పర్యటన: మంత్రి ఉత్తమ్ కుమార్
- బీసీల సామాజిక, ఆర్థిక సర్వే చేయాలి
- హైకోర్టు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలి
- ప్రభుత్వానికి మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డు కులాల (ఎస్సీ) వర్గీకరణపై ఏక సభ్య జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని మంత్రివర్గ ఉపసంఘం రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ వర్గీకరణ కోసం 2011 నాటి జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో 'వర్గీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం' మంగళవారం సచివాలయంలో సమావేశమైంది. కమిటీకిది నాలుగో సమావేశం. ఈ భేటీలో కమిటీ సభ్యులైన మంత్రులు దామోదర రాజనర్సింహ, సీతక్క, పొన్నం ప్రభాకర్, డి.శ్రీధర్‌బాబుతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ పలు అంశాలపై చర్చించింది. ముఖ్యంగా ఎస్సీ వర్గీకరణ కోసం ఏక సభ్య జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. సుప్రీంకోర్టు లేదా హైకోర్టు రిటైర్డ్ జడ్జితో కమిషన్‌ను ఏర్పాటు చేయాలని సూచించింది. ఎస్సీల్లోని ఉప కులాల వెనకబాటుతనాన్ని సమగ్రంగా గుర్తించడానికి ఈ కమిషన్ ఏర్పాటు అవసరమని అభిప్రాయపడింది. వర్గీకరణ ప్రక్రియ ఎలాంటి న్యాయ చిక్కులు లేకుండా చట్టబద్ధంగా ఉండాలని, అందుకే న్యాయ (జ్యుడీషియల్) పరిశీలన అవసరమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మిగతా 13వ పేజీలో...



3

ప్రయాణంలో
తోడు నీడగా..

- హైవేలవెంట ఫుడ్‌కోర్టులు, ట్రామాసెంటర్లు, ఫార్మసీలు, రిపేర్ షాపులు, ఏటీఎంలు
- అంతర్జాతీయ ప్రమాణాలతో కేంద్రం 'హమ్ సఫర్' పాలసీ
- ప్రారంభించిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ
- సర్వీసు ప్రొవైడర్లకు ప్రత్యేక రిజిస్ట్రేషన్.. రేటింగ్ సదుపాయం
- లొకేషన్ కోసం 'రాజ్‌మార్గ్ యాత్ర' యాప్
- పెట్రోల్ బంకుల్లో టాయిలెట్లను మూసి ఉంచొద్దని గడ్కరీ హెచ్చరిక

పారిశ్రామికవేత్తలకు
అభివృద్ధి కేంద్రం

- అహ్మదాబాద్ సంస్థ సాయంతో నిర్వహణ
- నాలుగేళ్లలో 50 వేల మందికి శిక్షణ లక్ష్యం
- 6 నెలల పాటు అండగా అభివృద్ధి కేంద్రం
- ఈడీఐఐతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం
- శ్రీధర్‌బాబుతో సంస్థ డీజీ సమావేశం
- హైదరాబాద్‌లో తైవాన్ పారిశ్రామిక పార్క్
- ఎంఎస్ఎంఈల్లో మహిళలకు ప్రాధాన్యం


అహ్మదాబాద్ ఈడీఐఐ డీజీ సునీల్ శుక్లాతో శ్రీధర్ బాబు

హైదరాబాద్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించిందని పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఇందుకోసం అహ్మదాబాద్‌లోని ఆంట్రప్రెనర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఈడీఐఐ) భాగస్వామ్యంతో నగరంలో పారిశ్రామికవేత్తల అభివృద్ధి కేంద్రం(ఈడీసీ) ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. రాష్ట్రానికి వచ్చిన ఇడిఐఐ డైరెక్టర్ జనరల్ సునీల్ శుక్లాతో మంత్రి మంగళవారం సచివాలయంలో భేటీ అయ్యారు. కలిసి చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. నగరంలో ఏర్పాటు చేయబోయే అభివృద్ధి కేంద్రంతో నాలుగేళ్లలో 50 వేల మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలు నెలకొల్పేందుకు అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహిస్తామని శ్రీధర్‌బాబు ప్రకటించారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తామని చెప్పారు. ఏటా కనీసం 5 వేల మందికి సొంతంగా ఉపాధి కల్పించుకునేలా శిక్షణ ఇస్తామని, ఆ తర్వాత కూడా ఆరు నెలల వరకు ఈడీసీ సహకారం అందిస్తుందని వెల్లడించారు. కోవిడ్ సమయంలో


మిగతా 5వ పేజీలో...



13

ఈడీ విచారణకు హాజరైన అజారుద్దీన్

- నాపై తప్పుడు అభియోగాలు
- విచారణ పూర్తయ్యాక వివరాలు వెల్లడిస్తా: అజారుద్దీన్




నాంపల్లిలోని ప్రత్యేక జ్యుడీషియల్ కోర్టులో నాగార్జున, అమల, నాగసుశీల, సుప్రియ, నాగచైతన్య

13

కుటుంబ గౌరవానికి
భంగం కలిగింది

మంత్రి వ్యాఖ్యలతో అంతులేని మనోవేదన

- ఆమె క్షమాపణ కోరలేదు, వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకోలేదు
- సినీ పరిశ్రమను లక్ష్యంగా చేసుకున్నారు.. క్రిమినల్ పరువు నష్టం కేసులో నాగార్జున, సుప్రియ వాంగ్మూలం
- అమల, నాగచైతన్యతో కలిసి నాంపల్లి కోర్టులో హాజరు
- తదుపరి విచారణ రేపటికి వాయిదా

ఏపీకి బుల్లెట్ ట్రైన్

- బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, అమరావతిని కలుపుతూ..
- ప్రత్యేకంగా రైల్వే ట్రాక్.. పూర్తి ప్రతిపాదనల తర్వాత ప్రకటన
- ఢిల్లీలో ఎంపీలకు వెల్లడించిన ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు బుల్లెట్ ట్రైన్‌ను కేంద్ర రైల్వే శాఖ ప్రతిపాదించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు....రాష్ట్ర ఎంపీలకు ఈ విషయం వెల్లడించారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి వివిధ విషయాలపై మాట్లాడారు. అనంతరం ముఖ్యమంత్రి ఢిల్లీలో అందుబాటులో ఉన్న కొందరు కూటమి ఎంపీలతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో బుల్లెట్ ట్రైన్ ప్రతిపాదన గురించి చెప్పారు. దేశంలో మొదటి బుల్లెట్ ట్రైన్‌ను కేంద్ర ప్రభుత్వం ముంబై నుంచి అహ్మదాబాద్‌కు

మిగతా 13వ పేజీలో...


కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో ఏపీ సీఎం చంద్రబాబు కలుపుడు

జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానం

రాష్ట్రపతి భవన్‌లో అంగరంగ వైభవంగా కార్యక్రమం

- ముర్ము చేతుల మీదుగా అవార్డులు అందుకున్న రిషబ్ శెట్టి, నిత్యామీనన్, మిథున్ చక్రవర్తి
- వివరాలు సినిమా పేజీలో


ఉత్తమ నటి అవార్డు అందుకుంటున్న నిత్యామీనన్

బెంబేలెత్తిస్తున్న డెంగీ



- రాష్ట్రంలో ఐదేళ్ల గరిష్ఠానికి డెంగీ కేసులు.. నిరుడు 8,016
- ఈ ఏడాది అక్టోబరు 6వ తేదీ వరకే 9,254 కేసులు
- బాధితుల్లో వారం పాటు తీవ్రమైన దగ్గు, జ్వరం, నీరసం

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది డెంగీ కేసులు బెంబేలెత్తిస్తున్నాయి. నిరుటికన్నా మించే కాదు.. ఐదేళ్లలో మునుపెన్నడూ లేని గరిష్ఠస్థాయిలో డెంగీ కేసులు నమోదయ్యాయి. వైద్య ఆరోగ్య శాఖ లెక్కల ప్రకారం.. గత ఏడాది రాష్ట్రంలో 8,016 కేసులు నమోదైతే ఈసారి జనవరి నుంచి అక్టోబరు 6వ తేదీ వరకు 9,254 డెంగీ కేసులు

మిగతా 11వ పేజీలో...

హరియాణాలో బీజేపీ హ్యాట్రిక్




"ఈరోజు (మంగళవారం) శరన్నవరాత్రుల్లో ఆరో రోజు. చేతిలో కమలం పట్టుకుని, సింహవాహనాన్ని అధిరోహించిన కాత్యాయనీ మాతను ఆరాధించే రోజు. ఆ తల్లి మనందరినీ ఆశీర్వదించింది. ఈ పవిత్ర సమయంలో.. హరియాణాలో వరుసగా మూడోసారి కమలం వికసించింది. భగవద్గీత పుట్టిన గడ్డపై సత్యం, అభివృద్ధి గెలిచాయి. అబద్ధాల మూటపై అభివృద్ధి హామీ విజయం సాధించింది."

- ప్రధాని మోదీ

ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించి వరుసగా మూడోసారి విజయం

- 90 సీట్లకుగాను 48 స్థానాల్లో గెలుపు
- 37 స్థానాలతో సరిపెట్టుకున్న కాంగ్రెస్!
- ఒక్క సీటూ సాధించని ఆమ్ ఆద్మీ పార్టీ



పార్టీ	సీట్లు
బీజేపీ	48
కాంగ్రెస్	37
ఐఎన్ఎల్‌డీ	2
స్వతంత్రులు	3

న్యూఢిల్లీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ కొట్టింది! ప్రీ పోల్, పోస్ట్ పోల్, ఎగ్జిట్ పోల్ అంచనాల్ని తలకిందులు చేస్తూ.. రాజకీయ నిపుణుల విశ్లేషణలను అబద్ధం చేస్తూ.. ముచ్చటగా మూడోసారి విజయం సాధించింది! మంగళవారం ఉదయం ఓట్ల లెక్కింపు మొదలైన తర్వాత కొంతసేపటి వరకూ కాంగ్రెస్ జోరు కనిపించినా.. బీజేపీ క్రమంగా పుంజుకుని రేసులో ముందుకు దూసుకుపోయింది. మొత్తం 90 సీట్లకుగాను.. 48 స్థానాల్లో విజయఢంకా మోగించి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది. ఎన్నికల షెడ్యూలు వెలువడినప్పటి నుంచి ఎగ్జిట్ పోల్స్ దాకా.. ప్రతి దశలోనూ గెలుపుపై ధీమాతో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. కేవలం 37 సీట్లకు పరిమితమై మరోసారి ఓటమి చేదును చవిచూసింది. ఐఎన్ఎల్‌డీ రెండు సీట్లతో సరిపెట్టుకోగా.. కాంగ్రెస్‌తో పొత్తు కుదరక సొంతంగా పోటీ చేసిన ఆమ్ ఆద్మీ పార్టీ డకౌట్ అయిపోయింది! ఇక.. గత ఎన్నికల్లో 10 సీట్లు సాధించి కింగ్ మేకర్ పాత్ర పోషించిన జన్‌నాయక్ జనతా పార్టీ (జేజేపీ) ఈసారి ఒక్క సీటు కూడా సాధించలేక చతికిలపడింది! సాక్షాత్తూ ఆ పార్టీ అధ్యక్షుడు దుష్యంత్ చౌతాలా దారుణాతిదారుణంగా ఓడిపోయారు. ఇక.. ఈ ఎన్నికల్లో పోటీ చేసి అందరి దృష్టినీ ఆకర్షించిన వినేశ్ ఫొగాట్, సావిత్రి జిందాల్ గెలుపొందడం విశేషం. కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన వినేశ్ తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి యోగేశ్ కుమార్‌పై 6,015 ఓట్ల తేడాతో గెలిచారు. భారతదేశంలోనే అత్యంత సంపన్న మహిళ అయిన సావిత్రి జిందాల్.. హిసార్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. ఇంత సంతోషంలోనూ బీజేపీకి అసంతృప్తి కలిగించే విషయం.. ఆ పార్టీకి చెందిన 8 మంది మంత్రులు, స్పీకర్ ఓడిపోవడం. అటు హరియాణా కాంగ్రెస్ చీఫ్ ఉదయ్ భాన్, ఐఎన్ఎల్‌డీ చీఫ్ అభయ్ సింగ్ చౌతాలా కూడా ఓడిపోవడం గమనార్హం. కాగా.. 1966లో ఏర్పాటైన హరియాణాలో ఒక పార్టీ వరుసగా మూడోసారి గెలవడం ఇదే!

కాంగ్రెస్ స్వయంకృతం

హరియాణాలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీపై సహజంగా ఏర్పడిన వ్యతిరేకత, జాట్ సామాజికవర్గంలో ప్రభుత్వంపై నెలకొన్న ఆగ్రహం, దేశానికి అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిని తెచ్చిపెట్టిన క్రీడాకారుల్లో కొందరు రాజకీయ ఆరంగేట్రం చేసి కాంగ్రెస్ పక్షాన నిలబడడం, రైతు ఆందోళనలు, పెరిగిన ధరలు, నిరుద్యోగం, అగ్నివీర్ పథకంపై అసంతృప్తి వంటి అనేక పరిణామాల నేపథ్యంలో.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమనే ప్రచారం విస్తృతంగా జరిగింది. అయితే.. ప్రభుత్వ వ్యతిరేకతను తనవైపు తిప్పుకోవడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైంది. ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వంలో వర్గపోరు వారి గెలుపు అవకాశాలకు దూరం చేసింది. జాట్ వర్గం నేత భూపిందర్ సింగ్ హుడాకు దళిత వర్గం నేత కుమారి సెల్జాకు మధ్య విబేధాలు ఎన్నికల్లో స్పష్టంగా కనిపించాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం హుడాకు పూర్తి స్వేచ్ఛనివ్వడంతో రాష్ట్రంలోని మొత్తం 90 స్థానాల్లో 70 సీట్లు తన వర్గంవారికే ఇచ్చుకున్నారని.. ఇది కుమారి సెల్జాకే కాక, జాట్ వర్గానికే చెందిన రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలాకు సైతం మింగుడుపడలేదని చెబుతున్నారు. దీంతో, ఎవరికి వారు రెబల్ అభ్యర్థులను నిలబెట్టడంతో పార్టీకి నష్టం వాటిల్లింది. బీజేపీని కూడా రెబెల్ అభ్యర్థులు దెబ్బ తీశారు.

జాట్లు.. జాటేతరులు..

జాట్లు వర్సెస్ జాటేతర వర్గాలుగా చీలిపోయిన హరియాణా ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ ఓటు ద్వారా విస్పష్టమైన తీర్పుచెప్పారు. జాట్లలో అత్యధికులు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపగా.. జాటేతరుల్లో అత్యధికులు బీజేపీకి ఓటేయడంతో.. కమలనాథులు అనూహ్య విజయం సాధించారు. రెండు పార్టీల మధ్య ఓటు శాతం అత్యంత తక్కువగా ఉండడానికి కారణం ఇదే. ఒకవైపు కాంగ్రెస్ పార్టీ అంతర్గత కలహాలతో సతమతమవుతుంటే.. మరోవైపు బీజేపీ తనదైన శైలిలో ఎన్నికల వ్యూహాలను అమలు చేసింది. మరోవైపు, ప్రభుత్వ వ్యతిరేక ఓట్లకు ఆమ్ ఆద్మీ, బీఎస్పీ రూపంలో గండి పడింది. ఇది బీజేపీకి ఎంతగానో అనుకూలించగా, కాంగ్రెస్‌కు తీవ్రంగా నష్టం చేసింది. ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న ఆప్ హరియాణాలో మాత్రం ఒంటరిగా బరిలో దిగింది.

కేకేకు అందని 'హరియాణా' నాడి

న్యూఢిల్లీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎంతో హోరాహోరీగా ఏపీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి 164 సీట్లతో అఖండ విజయం సాధిస్తుందని, వైసీపీ కేవలం 11 సీట్లకు పరిమితమై ఘోర పరాజయం చవిచూస్తుందని అత్యంత కచ్చితంగా చెప్పిన కేకే సర్వే సంస్థ అధినేత కిరణ్ కొండేటి హరియాణా విషయంలో మాత్రం సరిగా అంచనా వేయలేకపోయారు. ఈ రాష్ట్రంలో సర్వే చేసిన కేకే సంస్థ.. మొత్తం 90 సీట్లకు గాను కాంగ్రెస్ 65 పైగా గెలవబోతోందని చెప్పారు. బీజేపీ టైటానిక్‌లా మునిగిపోయే నావ అని పేర్కొన్నారు. రానున్న మహారాష్ట్ర సహా మరే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాషాయ పార్టీ నెగ్గదని తెలిపారు. కానీ, ఫలితాలను చూస్తే ఈ అంచనాలన్నీ తప్పాయి. కేకేనే కాదు.. హరియాణా, జమ్మూకశ్మీర్ ఎన్నికలపై జాతీయ సంస్థల ఎగ్జిట్ పోల్స్ అన్నీ తప్పాయి. మరీ ముఖ్యంగా హరియాణాలో కాంగ్రెస్ సగటున 55 సీట్లు గెలిచి అధికారం చేపడుతుందని ఎగ్జిట్ పోల్స్ తెలిపాయి. దాదాపు ఇవన్నీ బీజేపీకి 30కి మించి సీట్లు రావని పేర్కొన్నాయి. కానీ, దీనిని తలకిందులు చేస్తూ కమలం నెగ్గుకొచ్చింది. కాగా, కశ్మీర్‌లో త్రిశంకు సభ ఏర్పడుతుందని ఎగ్జిట్ పోల్స్ వెల్లడించగా నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ), కాంగ్రెస్ కూటమి స్పష్టమైన మెజారిటీ సాధించింది.


అలా వచ్చి ఇలా గెలిపించి

హరియాణా సీఎంగా నయాబ్ కొనసాగింపు!

న్యూఢిల్లీ, అక్టోబరు 8: హరియాణాలో బీజేపీ ఎన్నికల వ్యూహం ఫలించినట్టు కనిపిస్తోంది. ప్రస్తుత సీఎం నయాబ్ సింగ్ సైనీ.. సీఎంగా కొనసాగడం దాదాపు ఖాయమైంది. ఓబీసీలను, జాట్‌లను ఆకర్షించడమే లక్ష్యంగా అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది నెలల ముందు ఓబీసీ నేత నయాబ్ సింగ్ సైనీ(54)ని ముఖ్యమంత్రిని చెయ్యడం బీజేపీకి లబ్ధి చేకూర్చింది. సైనీ పాలన కూడా కలిసి రావడంతో లోక్‌సభ ఎన్నికల్లో ఐదు స్థానాలకే పరిమితమైన రాష్ట్రంలో అధికారాన్ని నిలబెట్టుకుంది. నిజానికి, సీఎం సైనీ 200 రోజుల పాలనతోనే ఈ మ్యాజిక్ సాధ్యమైందనేది విశ్లేషకుల అభిప్రాయం. మాజీ సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ నేతృత్వంలోని ప్రభుత్వంపై రాష్ట్రంలో తీవ్ర వ్యతిరేకత నెలకొన్న సమయంలో మార్చి నెలలో సైనీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. త్రివిధ దళాల్లో అగ్నివీర్‌గా పని చేసిన వారికి సర్వీస్ అనంతరం ఉపాధి కల్పనకు ఆమోదం, కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసే పంటల సంఖ్యను 24కు పెంచడం, విద్యుత్ బిల్లుల కనీస చార్జీల రద్దు వంటి సైనీ ప్రభుత్వ నిర్ణయాలు ప్రజల్లో బీజేపీపై ఉన్న వ్యతిరేకతను గణనీయంగా తగ్గించాయి. సీఎం సైనీపై నమ్మకాన్ని పెంచేశాయి. ఇక, ఎన్నికల ప్రచారంలోనూ పార్టీని ముందుండి నడిపించిన సైనీ.. బీజేపీ సాధించిన విజయాలను, ఎన్నికల హామీల అమలు అంశంలో తెలంగాణ, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో కాంగ్రెస్ వైఫల్యాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. దీంతో ఎన్నికల్లో పార్టీ విజయం సాధించగా సైనీ తిరుగులేని నేతగా ఎదిగారు. పార్టీకి తిరిగి అధికారమిస్తే సైనీనే ముఖ్యమంత్రిగా కొనసాగతారని ఎన్నికల ప్రచారంలో బీజేపీ వర్గాలు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో నయాబ్ సింగ్ సైనీ సీఎంగా కొనసాగడం లాంఛనమే..!!



లోకం తీరు



ఓట్ల కుస్తీలో ఫొగాట్ పట్టే 'పట్టు'



చండీగఢ్, అక్టోబరు 8: కుస్తీ యోధురాలు, ట్రిపుల్ ఒలింపియన్ వినేశ్ ఫొగాట్ హరియాణా ఎన్నికల సమరంలో మాత్రం ఓ 'పట్టు' పట్టారు. ఇటీవల ప్యారిస్ ఒలింపిక్స్‌లో దురదృష్టవశాత్తు తృటిలో పతకం చేజారినా అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె విజయం సాధించారు. జులానా నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఫొగాట్, తన సమీప అభ్యర్థి, బీజేపీకి చెందిన యోగేశ్ కుమార్‌పై 6,015 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. కుస్తీ పోరులాగే మంగళవారం ఫొగాట్ ఫలితం కూడా అభిమానులను మునివేళ్ల మీద నిలబెట్టి ఉత్కంఠకు గురిచేసింది. తొలుత ఆధిక్యం కనబరిచినా తర్వాత ఆమె వెనుకబడ్డారు. కౌంటింగ్ మధ్య రౌండ్లకొచ్చేసరికి మళ్లీ ఆధిక్యంలోకొచ్చి దాన్ని చివరి దాకా కొనసాగించారు. 2019లో జులానా నుంచి ఎన్డీయే భాగస్వామ్య పార్టీ జేజేపీ అభ్యర్థి విజయం సాధించగా అంతకుముందు 2014, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఇక్కడ జనం పట్టం కట్టారు. విజయం అనంతరం ఫొగాట్ మీడియాతో మాట్లాడారు. ఫలితాల్లో తనకు ప్రజల ఆప్యాయత కనిపించిందని, రానున్న ఐదేళ్లలో ప్రజల అంచనాలను నిలబెడతానని, దేశం తనకు ఇచ్చిన ప్రేమ, నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు. వినేశ్ ఫొగాట్ విజయంపై జాతీయ రెజ్లింగ్ సంఘం మాజీ అధ్యక్షుడు, బీజేపీ నేత బ్రిజ్‌భూషణ్ స్పందించారు. రెజ్లింగ్‌లో ఫొగాట్ మోసంతో గెలిచేవారని, ఇక్కడా ఆమె మోసంతో గెలిచారని విమర్శించారు.



ఢిల్లీలోని ఏఐసీసీ ఆఫీసు వద్ద స్వీట్లు పంచుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు

జిలేబీ రాజకీయం!

హరియాణా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో తొలుత కాంగ్రెస్ జోరు కనిపించగానే.. ఢిల్లీలోని కాంగ్రెస్ కార్యాలయం పెద్ద ఎత్తున జలేబీలు (జిలేబీ) తెప్పించి పంచిపెట్టింది! కట్ చేస్తే.. కాసేపట్లోనే సీన్ మారింది. ఫలితాల్లో కాంగ్రెస్ జోరు తగ్గి బీజేపీ సీట్ల సంఖ్య పెరగడం మొదలుపెట్టగానే.. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో కూడా జిలేబీలతో నోరు తీపి చేసుకుని సంబరాలు చేసుకున్నారు! ఈ జిలేబీలకో ఫ్లాష్ బ్యాక్ ఉంది. ఆత్రేయపురం పూతరేకులు, కాకినాడ కాజా తరహాలో.. హరియాణాలో 'గోహానా జిలేబీ' ప్రఖ్యాతి గాంచిన మిఠాయి! ఆ ప్రాంతానికి చెందిన మాతూరామ్ అనే వ్యక్తి 1958 నుంచి జిలేబీలు విక్రయించడం ప్రారంభించారు. అనతికాలంలోనే అదో బ్రాండ్‌గా మారిపోయింది. ఈ క్రమంలోనే.. రాహుల్‌గాంధీ తన ఎన్నికల ప్రచారంలో భాగంగా జిలేబీల బాక్సును చేతిలో పట్టుకుని.. నోట్ల రద్దు, జీఎస్టీ కారణంగా మాతూరామ్ వంటి వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారని.. తాము అధికారంలోకి వస్తే వ్యాపారుల ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామని.. ఆవేదన వ్యక్తం చేశారు. "ఈ జిలేబీని ఇతర రాష్ట్రాల్లోనూ అమ్మగలిగితే? ఇతర దేశాలకు ఎగుమతి చేస్తే? మరో 20 వేల నుంచి 50 వేల మందికి ఉపాధి దొరుకుతుంది కదా" అన్నారు! అప్పట్నుంచీ ఎన్నికలు ముగిసేదాకా.. ఈ అంశంపై కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య వాగ్వాదం జరుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ తన గెలుపు సంబరాలను జిలేబీతో ప్రారంభించగా.. ఆ పార్టీని వెక్కిరిస్తున్నట్టుగా బీజేపీ తన సంబరాలను జిలేబీతో ముగించింది!!

హరియాణా ఫలితాన్ని ఆమోదించం

ప్రజల ఆకాంక్షలకు ఇది భిన్నం

- కాంగ్రెస్ నేతలు జైరాం రమేశ్, పవన్‌ఖేరా



న్యూఢిల్లీ, అక్టోబరు 8: హరియాణా అసెంబ్లీ ఎన్నికల ఫలితాన్ని తాము ఆమోదించబోమని, రాష్ట్రంలో మార్పును కోరుకున్న ప్రజల అభిమతానికి భిన్నంగా ఈ ఫలితం ఉందని కాంగ్రెస్ పార్టీ తెలిపింది. ఎన్నికల ఫలితం దేశంలోని ప్రజాస్వామిక వ్యవస్థల సమగ్రతపైనే తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోందని పేర్కొంది. ప్రజల తీర్పును కాలరాసిన కుట్రలకు విజయం దక్కిందని ఆరోపించింది. ఎన్నికల ఫలితాల వెల్లడి, ఈవీఎం బ్యాటరీల్లో ఉన్న చార్జింగ్‌పై తీవ్రమైన అనుమానాలున్నాయని తెలిపింది. కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరాతో కలిసి పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 'హరియాణా ఫలితాలు పూర్తిగా ఆశ్చర్యకరం, ఊహాతీతం. ఓట్ల లెక్కింపు సందర్భంగా రౌండ్లవారీ ఫలితాల వెల్లడిలో తీవ్రమైన జాప్యం చోటుచేసుకుంది. కనీసం 14 నియోజకవర్గాల్లో ఈవీఎంల పనితీరుపై తమ పార్టీ అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. వాటిపై త్వరలో ఈసీకి ఫిర్యాదు చేస్తాం. బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కారు (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు) స్థానిక అధికారులపై విపరీతమైన ఒత్తిడి తెచ్చింది. తొలి రౌండ్లలో మంచి ఆధిక్యతలో ఉన్న మా అభ్యర్థులు 50, 100, 250 ఓట్ల తేడాతో ఓడిపోయారు అని జైరాం తెలిపారు. హరియాణా ఫలితాన్ని ఆమోదించబోమని, ఈ విషయం ఇక్కడితో ముగియలేదని స్పష్టం చేశారు. పవన్ ఖేరా మాట్లాడుతూ, 'సాధారణంగా ఎక్కడైనా, కౌంటింగ్ నాటికి ఈవీఎంల బ్యాటరీల్లో చార్జింగ్ 60-70 శాతమే ఉంటుంది. హరియాణాలో మా పార్టీ గెలిచిన స్థానాల్లో ఉన్న ఈవీఎంల బ్యాటరీలు 60-70 శాతం చార్జింగ్‌తో ఉన్నాయి. కానీ, బీజేపీ అభ్యర్థులు గెలిచిన స్థానాల్లో ఈవీఎంల బ్యాటరీలు 99 శాతం చార్జింగ్‌తో ఉన్నాయి. పోలింగ్ తర్వాత వాటిల్లో 99% చార్జింగ్ ఉండటం ఎలా సాధ్యం? అదీగాక బీజేపీ గెలిచిన అన్ని స్థానాల్లో ఒకే విధంగా 99% చార్జింగ్‌తో ఎలా ఉన్నాయి? అంటే, ఏదో జరిగింది. ఇది కుట్రల విజయం, ప్రజాస్వామ్య అపజయం' అని ఆరోపించారు. దీనిపై న్యాయపోరాటం చేస్తారా అన్న విలేకరుల ప్రశ్నకు తొలుత తాము ఈసీ వద్దకు వెళ్తామని, ఆ తర్వాత ఏం చేయాలన్నది ఆలోచిస్తామని జైరాం చెప్పారు. కాగా, జమ్మూకశ్మీర్ ఫలితాలపై స్పందిస్తూ.. ఏదో విధంగా మెజారిటీ సాధించాలనుకున్న బీజేపీ కుతంత్రాలను ఆ రాష్ట్ర ప్రజలు ఓడించారన్నారు.

ఈసీకి కాంగ్రెస్ లేఖ

హరియాణాలో ఓట్ల లెక్కింపు సందర్భంగా రౌండ్ల వారీగా ఫలితాలను ఎప్పటికప్పుడు వెల్లడించే విషయంలో తీవ్రమైన జాప్యం జరుగుతోందని అంతకుముందు ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఒక లేఖ రాసింది. ఈసీ స్పందిస్తూ.. ఫలితాల వెల్లడిలో జాప్యం జరిగిందనటానికి ఎటువంటి ఆధారాలు లేవని తెలిపింది.

ప్రజాస్వామ్యం గెలిచింది

శ్రీనగర్, అక్టోబరు 8: తుపాకుల కాల్పులు.. బాంబుల మోతతో దద్దరిల్లే కశ్మీర్‌లో ప్రజాస్వామ్యం గెలిచింది. మరీ ముఖ్యంగా లోయలో బంద్‌లు మాయమై పూర్తి మార్పు కనిపిస్తోంది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో ప్రజలు హుషారుగా పాల్గొని స్పష్టమైన తీర్పునిచ్చారు. గత ఐదేళ్లలో శాంతిభద్రతలు మెరుగుపడ్డాయి. భద్రతా దళాలు ఉగ్రవాదుల ఏరివేత ఆపరేషన్లను ముమ్మరంగా చేపట్టాయి. ఎన్నికల బహిష్కరణ పిలుపులు తగ్గాయి. ఉగ్రవాద ప్రభావం ఎక్కువగా ఉండే శ్రీనగర్, కుల్గామ్, సోపోర్, షోపియాన్‌లోనూ భారీ ఓటింగ్ నమోదైంది.

కశ్మీర్ సీఎంగా ఒమర్ అబ్దుల్లా!

- నాడు లద్దాఖ్‌తో కూడిన రాష్ట్రానికి.. నేడు కశ్మీర్‌కు
- దాదాపు పదేళ్ల తర్వాత ముఖ్యమంత్రి పీఠంపైకి..!
- లోక్‌సభ ఎన్నికల్లో ఓడినా అసెంబ్లీలో విజయం



శ్రీనగర్‌లో ఎన్సీ మద్దతుదారుల సంబరాలు



శ్రీనగర్, అక్టోబరు 8: సరిగ్గా ఆరు నెలల కిందట జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి చేతిలో పరాజయం పాలైన ఆయన.. ఆ దెబ్బ నుంచి కోలుకుని అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటారు. పోటీ చేసిన రెండుచోట్లా గెలిచి.. పదేళ్ల విరామం తర్వాత సీఎం పదవిని చేపట్టనున్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జరిగిన జమ్ము కశ్మీర్ అసెంబ్లీ తొలి ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ)-కాంగ్రెస్ కూటమిని విజయపథంలో నడిపించిన ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రి కానున్నారు. ఒమర్ 2009-15 మధ్యన ఉమ్మడి జమ్మూకశ్మీర్‌కు సీఎంగా వ్యవహరించారు. ఈయన తాత షేక్ అబ్దుల్లా, తండ్రి ఫరూక్ అబ్దుల్లాలు చెరో మూడుసార్లు ముఖ్యమంత్రులుగా పనిచేయడం గమనార్హం.

28 ఏళ్లకు ఎంపీ.. 39వ ఏట సీఎం

ఒమర్ 1970 మార్చి 10న బ్రిటన్‌లో జన్మించారు. ఇంగ్లిష్ మహిళ మొలీని వివాహం చేసుకున్న ఫరూఖ్ ఇంగ్లండ్‌లోనే ఉండేవారు. తండ్రి షేక్ అబ్దుల్లా మరణం అనంతరం ఆయన భారత్‌కు తిరిగొచ్చారు. కాగా, ఒమర్.. శ్రీనగర్, ముంబైలలో చదివారు. స్కాట్లాండ్‌లో డిగ్రీ చేశారు. 1998లో 28 ఏళ్ల వయసులో శ్రీనగర్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. 39వ ఏట.. 2009 ఎన్నికల్లో విజయంతో సీఎం అయ్యారు. 1994లో పాయల్ నాథ్‌ను వివాహమాడిన ఒమర్ 2011లో విడిపోయారు. ఇక 2009లోనూ కాంగ్రెస్‌తో కూడిన ఎన్సీ ప్రభుత్వానికి సారథ్యం వహించిన ఒమర్ ఇప్పుడు కాంగ్రెస్‌తో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నారు. వాజ్‌పేయీ ప్రభుత్వంలో ఒమర్ 2001 నుంచి ఏడాదిన్నర పాటు విదేశాంగ శాఖ సహాయ మంత్రిగా వ్యవహరించారు. కుమారుడు ఒమర్ అబ్దుల్లానే కశ్మీర్ కాబోయే సీఎం అని ఫరూఖ్ అబ్దుల్లా మీడియాతో వ్యాఖ్యానించారు.

● ఒమర్.. బుద్గాంలో పీడీపీ అభ్యర్థి సయ్యద్ ముంతజీర్ మెహ్దీపై 18,485 ఓట్ల ఆధిక్యంతో, గందేర్బల్‌లో బషీర్ అహ్మద్ మిర్‌పై 10,574 ఓట్ల తేడాతో విజయం సాధించారు.

కశ్మీరంలో అనూహ్యం

హంగ్ అంచనాలన్నీ తలకిందులు.. ఎన్సీ - కాంగ్రెస్ కూటమికి పట్టం.. 42 సీట్లు నెగ్గిన నేషనల్ కాన్ఫరెన్స్

శ్రీనగర్, అక్టోబరు 8: హంగ్ ఖాయమనే అంచనాలు.. నామినేటెడ్ ఎమ్మెల్యేల ఓట్లు కీలకమనే ఆందోళనలు.. సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రయత్నాలు తప్పవన్న సంకేతాలు..! కానీ, వీటికి తావు లేకుండా జమ్మూకశ్మీర్ ఓటర్లు తీర్పు చెప్పారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ)-కాంగ్రెస్ కూటమికి పట్టం కట్టారు. 90 అసెంబ్లీ స్థానాలకు గాను ఎన్సీ 51, కాంగ్రెస్ 32, సీపీఎం, జేకేఎన్‌పీపీ ఒక్కోచోట పోటీ చేశాయి. ఐదు చోట్ల ఎన్సీ, కాంగ్రెస్ స్నేహపూర్వక పోటీకి దిగాయి. కాగా, కశ్మీర్ అసెంబ్లీకి ఐదుగురు ఎమ్మెల్యేలను గవర్నర్ నామినేటెడ్ చేయడంతో సంఖ్య 95కు పెరిగింది. కనీస మెజార్టీ 48గా మారింది. దీనినీ ఎన్సీ కూటమి అధిగమించింది. జాతీయ స్థాయిలో 'ఇండియా' కూటమికి తొలి విజయం కశ్మీర్ నుంచే అందినట్లైంది. హరియాణాలో దారుణంగా విఫలమైన ఆప్.. కశ్మీర్‌లోని దోడా స్థానాన్ని కైవసం చేసుకుని బోణీ కొట్టింది. మొత్తం ముగ్గురు మహిళలు ఎమ్మెల్యేలయ్యారు. సకీనా మసూద్, షమీమా ఫిర్దౌస్ (ఎన్సీ)తో పాటు బీజేపీ నుంచి షగున్ పరిహార్ గెలిచారు.

ఎన్సీ సూపర్.. పీడీపీ బేజార్

కశ్మీర్ ఎన్నికల్లో ఎన్సీ హవా సాగింది. సొంతంగా కనీస మెజార్టీకి 6 సీట్లు దూరంలో నిలిచింది. మొత్తం 23.43 శాతం ఓట్లు సాధించింది. గత ఎన్నికల కంటే (20.33) ఇది మూడు శాతం అధికం. ఎన్సీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా బుద్గామ్, గందేర్‌బల్‌లో రెండుచోట్లా గెలుపొందారు. కశ్మీర్ అనగానే గుర్తొచ్చే మరో ప్రాంతీయ పార్టీ పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీపీ) దారుణ ప్రదర్శన కనబర్చింది. మాజీ సీఎం మెహబూబా ముఫ్తీ సారథ్యంలోని ఈ పార్టీ గత ఎన్నికల్లో 28 సీట్లు నెగ్గగా ఇప్పుడు 25 కోల్పోయింది. ఓట్ల శాతం 22.67 నుంచి 8.87కు పడిపోయింది.


జమ్మూలో కమలం జోష్

జమ్మూలో హిందూ జనాభా ఎక్కువ. అదే సమయంలో కశ్మీర్‌లో ముస్లిం ప్రాబల్యం అధికం. ఉమ్మడి రాష్ట్రంలో 87 సీట్లుండేవి. ఆర్టికల్ 370 రద్దు చేశాక అసెంబ్లీతో కూడిన కేంద్రపాలిత ప్రాంతంగా జమ్మూకశ్మీర్ మిగిలింది. నియోజకవర్గాల పునర్విభజన చేపట్టి ఎన్నికలు నిర్వహించారు. దీంతో జమ్మూలో సీట్ల సంఖ్య 37 నుంచి 43కి చేరింది. కశ్మీర్ లోయలో సీట్లు మాత్రం ఒక్కటే పెరిగి 47 అయ్యాయి. ఇక జమ్మూలోని 43 సీట్లకు గాను.. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా బీజేపీ 29 స్థానాలను ఖాతాలో వేసుకుంది. ఉమ్మడి కశ్మీర్‌లో 2014లో 23 శాతం ఓట్లతో బీజేపీ 25 సీట్లు నెగ్గింది. ఇప్పుడు ఓట్లు 25.64 శాతానికి పెరిగాయి. ఓట్ల శాతం ఎన్సీ కంటే బీజేపీకే ఎక్కువ కావడం గమనార్హం. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర రైనా పరాజయం పాలయ్యారు. కాగా, కశ్మీర్ పీసీసీ చీఫ్ తారిఖ్ హమీద్ కర్రా మాత్రం విజయం సాధించారు. సీపీఎం అభ్యర్థి మొహమ్మద్ యూసుఫ్ తరిగామి కుల్గాంలో వరుసగా ఐదోసారి జయకేతనం ఎగురవేశారు.

హస్తం ప్రభావం శూన్యం

ఎన్సీతో జట్టు కట్టినా కశ్మీర్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రదర్శన పేలవంగా ఉంది. పదేళ్ల కిందట 18 శాతం ఓట్లతో 12 సీట్లలో గెలవగా.. ప్రస్తుతం 12 శాతం ఓట్లే సాధించింది. ఇతరులు సాధించిన 30.09 శాతం ఓట్ల కంటే ఇది తక్కువ. జమ్మూలో 29చోట్ల బరిలో దిగి ఒకచోటనే హస్తం నెగ్గింది. లోయనే కాస్త ఆదుకుంది.

డివిజన్	సీట్లు	ఇండియా	బీజేపీ	పీడీపీ	ఇతరులు
కశ్మీర్‌లోయ	47	41	0	3	3
జమ్మూ	43	8	29	0	6
మొత్తం	90	49	29	3	9





పార్టీ	సీట్లు
ఎన్సీ	42
బీజేపీ	29
కాంగ్రెస్	6
పీడీపీ	3
జేపీసీ	1
సీపీఎం	1
ఆప్	1
స్వతంత్రులు	7

50 మంది సీనియర్ డాక్టర్ల రాజీనామా

కోల్‌కతా ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో నిరసనల్లో కీలక పరిణామం

కోల్‌కతా, అక్టోబరు 8: జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనలో పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతా ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బాధితురాలికి న్యాయం చేయాలని, పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలనే డిమాండ్లతో నాలుగు రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న జూనియర్ వైద్యులకు సంఘీభావంగా దాదాపు 50 మంది సీనియర్ డాక్టర్లు మంగళవారం మూకుమ్మడి రాజీనామాలు చేశారు. ఈ మేరకు ఉదయం జరిగిన డిపార్ట్‌మెంట్‌ల హెడ్‌ల సమావేశంలో నిర్ణయం జరిగిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. శనివారం నుంచి నిరాహార దీక్ష చేస్తున్న పలువురు జూనియర్ వైద్యులకు సంఘీభావంగా 15 మంది సీనియర్ వైద్యులు మంగళవారం దీక్షలో కూర్చున్నారు.

డిజిటల్ అరెస్టు పేరుతో రూ. 46 లక్షలు లూటీ

ఇండోర్, అక్టోబరు 8: ఓ వైపు డిజిటల్ అరెస్టు అనేది మోసమని, కోర్టులు గాని దర్యాప్తు సంస్థలు గాని వీడియో కాల్‌లో అరెస్టులు చేపట్టవని సైబర్ క్రైమ్ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నప్పటికీ ఆ తరహా దాడులు మాత్రం ఆగడం లేదు. తాజాగా మధ్యప్రదేశ్‌కి చెందిన ఓ మహిళ.. అదే నేరశైలితో మోసాలకు పాల్పడుతున్న ఓ ముఠాకు చిక్కి రూ.46 లక్షలు పోగొట్టుకుంది. ఇండోర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొద్దిరోజుల క్రితం బాధిత మహిళ(65)కు సైబర్ ముఠాకు చెందిన ఓ వ్యక్తి ఫోన్ చేసి తాను సీబీఐ అధికారినని చెప్పాడు. ఆమె బ్యాంకు ఖాతాను డ్రగ్ ట్రాఫికింగ్, ఉగ్రవాద కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారని, కాబట్టి మనీలాండరింగ్ నేరం కింద డిజిటల్ అరెస్టు చేశామని చెప్పి 5 రోజుల పాటు చిత్రవధ చేశారు. దీంతో బాధితురాలు రెండు దఫాల్లో వారికి రూ. 46 లక్షలు బదిలీ చేసింది.

కందిలో గంజాయి సాగు.. 2కోట్ల సరుకు సీజ్

బెంగళూరు/గువాహటి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బీదర్ జిల్లా బసవకల్యాణ తాలూకాలో రూ.2 కోట్ల విలువైన గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మహారాష్ట్రలోని ఉస్మాబాద్ జిల్లా ఉమర్గా తాలూకా హిప్పరగారావ్‌వాడి గ్రామస్థుడిని అరెస్టు చేశారు. నిందితుడు బసవకల్యాణ తాలూకా ఉజళంబ గ్రామంలో కందిపంట మధ్యలో గంజాయి సాగు చేశాడు. స్థానిక రైతుల నుంచి భూమిని కౌలుకు తీసుకుని, గంజాయి సాగు చేసినట్టు పోలీసులు గుర్తించారు. అతడి నుంచి 40 కేజీలకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరాఠా పోలీసులిచ్చిన సమాచారంతో గంజాయి పంటను గుర్తించామని అధికారులు తెలిపారు. కాగా, అస్సాం రాష్ట్రంలోని బిస్వనాథ్, కాచర్ జిల్లాలలో వివిధ చోట్ల జరిపిన దాడుల్లో సుమారు రూ 11 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని అస్సాం రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ మంగళవారం ఎక్స్‌లో ప్రకటించారు. ఒక్క కామరూప్ జిల్లాలోని బోకో వద్ద జరిపిన సోదాల్లోనే 301 కేజీల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేశారు.

కమలా హారిస్ గెలిస్తే... నాకు జైలు తప్పదు!

» డెమొక్రాట్లు గెలిస్తే వలసదారులకు పౌరసత్వం: మస్క్

వాషింగ్టన్, అక్టోబరు 8: అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ కనుక రానున్న అధ్యక్ష ఎన్నికల్లో గెలిస్తే తనకు జైలు తప్పదని ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇటీవల రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి ట్రంప్‌తో ఓ బహిరంగ సభలో పాల్గొన్న అనంతరం ఆయన సోమవారం ఓ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. "నాకు ఎన్నాళ్లు జైలుశిక్ష పడుతుందో... నా పిల్లలను తిరిగి చూస్తానో లేదో తెలీదు..." అన్నారు. "ఈ ఎన్నికల్లో ట్రంప్ గనుక గెలవకపోతే మనకు ఇవే చివరి ఎన్నికలు అవుతాయి" అని పేర్కొన్నారు. లక్షలాదిగా వచ్చే వలసదారులను ప్రోత్సహిస్తోన్న హారిస్-బైడెన్ ప్రభుత్వం రానున్న కాలంలో వారికి పౌరసత్వం కూడా మంజూరు చేసి వారి ఓట్లను కొల్లగొడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. మరోసారి డెమొక్రాట్ల పాలన వస్తే దేశంలో ఏక పార్టీ పాలన వస్తుందని తాను భావిస్తున్నట్లు చెప్పారు.

కాంగ్రెస్‌కు నో ఎంట్రీ బోర్డు!

చాలా రాష్ట్రాలు ఆ పార్టీని కోరుకోవడంలేదు.. కుల చిచ్చు ప్రయత్నాన్ని ప్రజలు తిప్పికొట్టారు

కార్యకర్తల వల్లే హరియాణా గెలుపు : మోదీ



న్యూఢిల్లీ, అక్టోబరు 8: దేశంలోని చాలా రాష్ట్రాల్లో ప్రజలు కాంగ్రెస్‌కు 'నో ఎంట్రీ' బోర్డు పెట్టారని ప్రధాని మోదీ అన్నారు. దశాబ్దాల తరబడి ఆ పార్టీకి అధికారం ఇవ్వకుండా దూరం పెడుతుండడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. మంగళవారం హరియాణా, జమ్మూకశ్మీర్ ఎన్నికల ఫలితాల అనంతరం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో మోదీ మాట్లాడారు. భారత ఆర్థిక వ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని ప్రపంచవ్యాప్తంగా పలుచన చేసేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నిందని ఆరోపించారు. చివరికి ఎన్నికల కమిషన్ వంటి సంస్థపై కూడా నిందలు వేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ కుల గణన పేరుతో ప్రజల మధ్య చీలిక తెచ్చేందుకు, ఎస్సీ, ఎస్టీలను, రైతులను, యువతను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. కానీ, హరియాణా ప్రజలు కాంగ్రెస్ దేశవ్యతిరేక చర్యలను తిప్పికొట్టేలా తీర్పునిచ్చారని పేర్కొన్నారు. బీజేపీ కార్యకర్తలు పూర్తి అంకితభావంతో ప్రజా సంక్షేమానికి పాటుపడుతూ, అభివృద్ధి అజెండాను ప్రజల వద్దకు తీసుకెళ్లటం వల్లే హరియాణాలో చరిత్రాత్మక విజయం దక్కిందన్నారు. ఇక జమ్మూకశ్మీర్ ఫలితం.. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం సాధించిన విజయమన్నారు. అక్కడ బీజేపీ అత్యధిక ఓట్లు సాధించిందని పేర్కొన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన ప్రతి రాష్ట్రంలోనూ సుదీర్ఘకాలం ప్రజలు మద్దతుగా నిలుస్తున్నారని మోదీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ.. ఇతర పార్టీలపై ఆధారపడే పరాన్నజీవిగా మారిందని, చివరికి ఆ పార్టీలనే మింగేస్తుందని ధ్వజమెత్తారు. జమ్మూకశ్మీర్‌లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న నేషనల్ కాన్ఫరెన్స్ కూడా.. హస్తం పార్టీ కారణంగా తమ అవకాశాలు ఎక్కడ దెబ్బతింటాయోనని భయపడిందన్నారు. కాగా, హరియాణాలో బీజేపీ గెలుపు కోసం అలుపెరగకుండా శ్రమించిన కార్యకర్తలందరికీ అభినందలు తెలియజేస్తున్నానని 'ఎక్స్'లో మోదీ పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో అధికారం సాధించిన నేషనల్ కాన్ఫరెన్స్‌కుఅభినందనలు తెలిపారు. అయితే, ఆ పార్టీ భాగస్వామ్యపక్షం కాంగ్రెస్‌ను మాత్రం తన ట్వీట్‌లో ప్రస్తావించకపోవటం గమనార్హం. జమ్మూకశ్మీర్‌లో బీజేపీ పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. హరియాణా ప్రజలు మోదీ నాయకత్వంలో అభివృద్ధి ఎజెండాను విశ్వసించి బీజేపీని గెలిపించారని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు.

హరియాణా ఫలితాన్ని ఊహించలేదు: ఖర్గే

హరియాణాలో ఫలితం ఇలా వస్తుందని తాము ఊహించలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. అయితే ప్రజాతీర్పును శిరసావహిస్తామని, ఫలితాలపై విశ్లేషణ చేసుకుంటామని 'ఎక్స్'లో పేర్కొన్నారు. జమ్ము కశ్మీర్‌లో మాత్రం బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తీర్పునిచ్చారని అన్నారు. కాగా, ఈ ఓటమి తమకు గుణపాఠం నేర్పిందని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ అన్నారు. ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దని, ఎన్నికల సమయంలో అతివిశ్వాసం పనికిరాదని, ప్రతి ఎన్నికను, ప్రతి స్థానాన్ని ప్రతిష్ఠాత్మకంగానే భావించాలని ఆయన పార్టీ నేతలనుద్దేశించి వ్యాఖ్యానించారు.

మెషీన్ లెర్నింగ్‌కు భౌతిక శాస్త్ర నోబెల్

జాన్ హోప్‌ఫీల్డ్, జెఫ్రీ హింటన్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు



జాన్ హోప్‌ఫీల్డ్, జెఫ్రీ హింటన్

స్టాక్‌హోం, అక్టోబరు 8: భౌతికశాస్త్రంలో ఈ ఏడాది నోబెల్ బహుమతి జాన్ హోప్‌ఫీల్డ్, జెఫ్రీ హింటన్‌లను వరించింది. కృత్రిమ నాడీ వ్యవస్థలతో మెషీన్ లెర్నింగ్‌ను సాధ్యం చేసేలా వీరిద్దరూ సిద్ధాంతపరమైన ఆవిష్కరణలకు రూపకల్పన చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను మరింత అభివృద్ధి చేసే దిశగా చేసిన కృషికిగానూ వీరిద్దరినీ నోబెల్ బహుమతికి ఎంపిక చేసినట్టు స్టాక్‌హోంలోని నోబెల్ కమిటీ మంగళవారం వెల్లడించింది. ఏఐ గాడ్‌ఫాదర్‌గా పేరొందిన హింటన్.. టొరంటో వర్సిటీలో పనిచేస్తున్నారు. ఆయనకు కెనడా, బ్రిటన్ పౌరసత్వం ఉంది. ఇక అమెరికాకు చెందిన హోప్‌ఫీల్డ్ న్యూజెర్సీలోని ప్రిన్స్‌టన్ వర్సిటీలో పనిచేస్తున్నారు. నాడీ వ్యవస్థపై ఈయన పరిశోధనలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపుపొందాయి. వీరిద్దరూ అభివృద్ధి చేసిన మెషీన్ లెర్నింగ్ వ్యవస్థ హోప్‌ఫీల్డ్ నెట్‌వర్క్‌గా ప్రసిద్ధి చెందింది. హోప్‌ఫీల్డ్.. సమాచారాన్ని నిల్వ చేయగల, పునర్నిర్మించగల సామర్థ్యం కలిగిన ఒక ఫ్రేమ్‌వర్క్‌ను సృష్టించారు. హింటన్.. డేటాలోని లక్షణాలను సొంతంగా గుర్తించగల పద్ధతిని కనుగొన్నారు. భౌతికశాస్త్రంలో ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్‌ను అనేక రకాలుగా ఉపయోగిస్తారని, కొత్త పదార్థాలను అభివృద్ధి చేయడానికి వీరి పరిశోధనలు తోడ్పడతాయని నోబెల్ కమిటీ హెడ్ ఎలన్ మూర్స్ తెలిపారు.

ప్రయాణంలో తోడునీడగా..

» హైవేల వెంట ఫుడ్‌కోర్టులు, ట్రామా సెంటర్లు, ఫార్మసీలు
» రిపేర్ షాపులు, ఏటీఎంలు మరెన్నో సౌకర్యాలు
» అంతర్జాతీయ ప్రమాణాలతో కేంద్రం 'హమ్ సఫర్' పాలసీ
» ప్రారంభించిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ



న్యూఢిల్లీ, అక్టోబరు 8: జాతీయ రహదారిపై కార్లో వెళుతున్నప్పుడు సహజంగానే పిల్లలు ఆకలి అంటూ మారాం చేస్తుంటారు. వంటల్లో కల్తీ నూనె, నాసిరకమైన పదార్థాలు వాడతారనే భయంతో చిన్నారులపై పెద్దలు కన్నెర్ర చేస్తుంటారు. అయితే.. ఈ భయాలేవీ లేకుండా పిల్లలతో కలిసి పెద్దలు కూడా ఆ రోడ్డు పక్కనే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఫుడ్‌కోర్టులో భేషుగ్గా తినొచ్చు! అలాగే దారిలో అనారోగ్య సమస్య ఎదురైనప్పుడు.. ప్రమాదం సంభవించినప్పుడు కంగారుపడకుండా రోడ్డు పక్కనే ట్రామా సెంటరూ ఉంటుంది! ఈటరీలు, ట్రామా సెంటర్లే కాదు.. ఇబ్బందుల్లేని, సుఖవంతమైన ప్రయాణం కోసం ఫార్మసీలు, పెట్రోలు బంకులు, ఏటీఎంలు, రిపేర్ షాపులు, ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఇలా ఎన్నో వసతులను పూర్తిగా అంతర్జాతీయ ప్రమాణాలతో జాతీయరహదారులు, ఎక్స్‌ప్రెస్ వేల వెంబడి కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తేనుంది. ఈ మేరకు జాతీయ రహదారుల వెంబడి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను అందించేందుకు ఉద్దేశించిన 'హమ్ సఫర్' పాలసీని మంగళవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించారు. హమ్‌సఫర్ సేవలు అందించే వాళ్లు ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. వారికి పలు మినహాయింపులు ఉంటాయి. ప్రయాణికులు 'రాజ్‌మార్గ్ యాత్ర' యాప్ సాయంతో ఈ షాపుల లొకేషన్లను తెలుసుకోవచ్చు. అంతే కాకుండా షాపుల్లో, బంకుల్లో సేవలు, నాణ్యతపై ఈ యాప్ ద్వారా రేటింగ్ కూడా ఇవ్వొచ్చు. వీటిని తరచూ తనిఖీలు చేయడానికి ప్రత్యేక యంత్రాంగం ఉంటుంది. కాగా ఈ పాలసీ ఆవిష్కరణ సందర్భంగా గడ్కరీ మాట్లాడారు. రానున్న రోజుల్లో రోడ్డు భద్రత, ప్రయాణ సౌకర్యాలకు 'హమ్ సఫర్' పర్యాయ పదంగా మారుతుందన్నారు. ఈ సౌకర్యాలన్నింటినీ పర్యావరణ హితమైన పద్ధతిలోనే ఏర్పాటు చేస్తామని చెప్పారు. హమ్ సఫర్ పాలసీతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహంతో పాటు ఉద్యోగాల సృష్టి జరుతుందని గడ్కరీ చెప్పారు. "ఎవరైతే ప్రయాణికుల నుంచి టోల్ వసూలు చేస్తారో.. వాళ్లు ప్రయాణికులకు భద్రత, సౌకర్యాలు కల్పించాలి" అని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. పెట్రోలు బంకుల యజమానులు నిబంధనల ప్రకారం ప్రయాణికులకు కనీస వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. హైవేలపై ఉన్న పెట్రోల్ బంకుల్లో టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా, వాటిని ప్రజలకు అందుబాటులో ఉంచడం తప్పనిసరని చెప్పారు. చాలా పెట్రోల్ బంకుల్లో టాయిలెట్లకు తాళం వేసి ఉండటం తాను గమనించానని తెలిపారు. అలా ఉంటే పెట్రోల్ బంకులను మూసేస్తామని హెచ్చరించారు.

ఇజ్రాయెల్ 'ఐరన్ డోమ్' విఫలం!

హెజ్‌బొల్లా రాకెట్లను అడ్డుకోలేకపోయిన గగనతల రక్షణ వ్యవస్థ

» హైఫాలో ఐడీఎఫ్ శిబిరాలే లక్ష్యంగా దాడులు



బీరుట్, అక్టోబరు 8: హిజ్బుల్లా రాకెట్లు, క్షిపణి దాడులను అడ్డుకోవడంలో తమ గగనతల రక్షణ వ్యవస్థ (ఐరన్ డోమ్) విఫలమైందని ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది. ఉత్తర ఇజ్రాయెల్‌లోని హైఫాలో ఇజ్రాయెల్ భద్రతా దళాలు, రెండు ఐడీఎఫ్ శిబిరాలే లక్ష్యంగా ఆదివారం హెజ్‌బొల్లా దాడులు చేసింది. రాకెట్లు, క్షిపణులతో 18 దాడులు చేసినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. రాకెట్ దాడుల ప్రభావం, ప్రాణ, ఆస్తి నష్టంపై విచారణ జరుపుతున్నట్లు తెలిపింది. మరోవైపు ఇజ్రాయెల్‌పై రాకెట్ దాడులను తీవ్రతరం చేస్తామని హెజ్‌బొల్లా తాత్కాలిక అధినేత షేక్ నయీం కసెం హెచ్చరించారు. తమ బలగాలు చెక్కు చెదరకుండా, చాలా దృఢంగా ఉన్నాయని చెప్పారు. సీనియర్ కమాండర్ల స్థానాలన్నింటినీ భర్తీ చేశామని వెల్లడించారు. ఇజ్రాయెల్ దాడుల్లో హెజ్‌బొల్లా చీఫ్ సహా పలువురు అగ్రనేతలు, సీనియర్ కమాండర్‌లు హతమైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో హెజ్‌బొల్లా బలహీనపడిందన్న వార్తలు వచ్చాయి. కాగా, గత వారం ఇజ్రాయెల్ దళాలు లెబనాన్ భూభాగంలోకి చొరబడిన సంగతి తెలిసిందే. అయితే ఇజ్రాయెల్ దళాలు అంతకుమించి ముందుకు రాలేకపోతున్నాయని నయీం చెప్పారు. "మేం వందలాది రాకెట్లు, పదుల సంఖ్యలో డ్రోన్లతో దాడులు చేస్తున్నాం. ఇజ్రాయెల్ దళాల శిబిరాలు, పలు నగరాలపై దాడులు చేస్తున్నాం" అని నయీం తెలిపారు. ఇజ్రాయెల్‌ను సమర్థంగా ఎదుర్కోగలమని, తమ ఫైటర్లను భారీ సంఖ్యలో మోహరించామని చెప్పారు. మంగళవారం బీరుట్‌లో చేసిన దాడిలో హెజ్‌బొల్లా సీనియర్ కమాండర్ సుహైల్ హుస్సేనీని హతమార్చినట్లు ఐడీఎఫ్ వర్గాలు ప్రకటించాయి. దీనిపై హెజ్‌బొల్లా స్పందించలేదు. కాగా, సెప్టెంబరులో ప్రారంభమైన ఈ పోరులో లెబనాన్‌లో ఇప్పటి వరకు 1300 మందికిపైగా మరణించారు. 10 లక్షల మందికి పైగా నిరాశ్రయులయ్యారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కొత్త విజయాలు

హరియాణా, జమ్మూకశ్మీర్‌లలో ఓటర్లు మంగళవారం ఇచ్చిన తీర్పు బీజేపీకి కొత్తశక్తిని ఇవ్వడం ఖాయం. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో మూడోమారు కేంద్రంలో అధికారం దక్కినప్పటికీ, అది సొంతకాళ్ళమీద కాక, మిత్రపక్షాల ఊతంతో సాధ్యపడిన స్థితిలో బీజేపీకి ఈ రెండు ఫలితాలు సమధికోత్సాహాన్నిస్తాయి. హర్యానాలో మూడోమారు మంచిస్కోరుతో అధికారంలోకి రావడం, జమ్మూకశ్మీర్‌లో పదేళ్ళ తరువాత ఎన్నికలు జరిగినా, గతంలో కంటే ఘనంగా తన ఉనికిని చాటుకోవడం మెచ్చదగ్గ విషయం. అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో, మనోహర్ లాల్ ఖట్టర్ వంటి యోధుడిని మార్చి, ఆ స్థానంలో ఎవరికీ అంతగా తెలియని ఓబీసీ నేత నయాబ్ సింగ్ సైనీని ముఖ్యమంత్రిగా బీజేపీ కూచోబెట్టిన సాహసోపేతమైన వ్యూహం ఇప్పుడు సత్ఫలితాన్నిచ్చింది. సీఎంను మార్చడంతో ఆరంభమైన ఆ ప్రక్షాళన ఆ తరువాత అధికశాతం సిట్టింగ్ ఎమ్మెల్యేలకు, మంత్రులకు టిక్కెట్లు ఇవ్వకపోవడం, ఆఖరునిముషం దాకా అభ్యర్థుల జాబితాలు తిరగరాయడం వరకూ కొనసాగింది. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి అతి తక్కువ ఎంపీసీట్లతో చతికిలబడిన తరువాత, ఎగ్జిట్ పోల్స్ సైతం ఎదురుగాలి వీస్తున్నదని తేల్చేశాక, మూడోమారు హర్యానాలో బీజేపీ విజేతగా నిలుస్తుందని ఎవరూ ఊహించలేదు.

హర్యానాలో నరేంద్రమోదీ ఉధృతంగా ప్రచారం చేయకపోవడానికి కారణాలు ఏమైనప్పటికీ, అగ్నివీర్, రైతువ్యతిరేక చట్టాలు, మహిళా మల్లయోధుల ఉద్యమం, మద్దతుధర హామీలు ఇత్యాదివి ప్రభావం చూపుతాయని చాలామంది అంచనావేశారు. హర్యానా కొత్త సీఎంకు మొదట లోక్‌సభ, ఆ తరువాత అసెంబ్లీ ఎన్నికల కోడ్‌లతో తన ప్రభావాన్ని చూపడానికి పెద్దగా సమయం చిక్కలేదన్నమాట నిజం. కానీ, రెండువిడతల పాలనలో తన పార్టీ బాగా పరువుకోల్పోయిన స్థితిలో, నష్టాన్ని పూడ్చేందుకు కొన్ని పథకాలు ప్రకటించారు. అగ్నివీర్‌లకు ప్రత్యేక ఉపాధి, పాతికరకాల పంట ఉత్పత్తులను ప్రభుత్వమే నేరుగా కొనడం, సబ్సిడీ గ్యాస్, మహిళలకు ప్రత్యేక ఉపాధి వంటివి అనేకం అందులో ఉన్నాయి. ఓబీసీ సైనీని ఎంపికచేయడంతో పాటు, అనేక జాట్‌యేతర కులాలను తనవైపు తిప్పుకోవడంలోనూ బీజేపీ విజయం సాధించింది. కిసాన్, జవాన్, పహెల్వాన్ అన్న కాంగ్రెస్ నినాదం పూర్తిగా జాట్‌లను ఉద్దేశించినట్టుగా, ఆ పార్టీ వారి చుట్టూ తిరుగుతున్నట్టుగా మిగతా కులాలకు అనిపించిందట. ఇక, క్షేత్రస్థాయిలో బీజేపీ, దాని అనుబంధ సంస్థల కార్యకర్తలు పడిన శ్రమ, అట్టడుగువరకూ విస్తరించిన కులచీలికల వ్యూహాలు ఊహకు అందనివి.

జమ్మూకశ్మీర్‌లో సైతం ఫలితాలు ఆశ్చర్యం కలిగించేవే. అబ్దుల్లాల విజయం ఎలా ఉన్నా, ముఫ్తీలు ఇంతగా చతికిలబడిపోవడం వారి పార్టీ చరిత్రలో ఇదే ప్రథమం. పదేళ్ళక్రితం మెహబూబా ముఫ్తీతో కలిసి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, అది కూలడం, రాష్ట్రపతి పాలన, ప్రత్యేక ప్రతిపత్తి రద్దునుంచి సుదీర్ఘకాలం సాగిన నిర్బంధం వరకూ ప్రజలు ఏ ఘట్టాన్నీ మరిచిపోయినట్టు లేదు. కశ్మీరానికి హిందూ పాలకుడిని ఇవ్వాలన్న బీజేపీ ఆశయం నెరవేరకపోవచ్చును కానీ, హిందూ ఆధిపత్య జమ్మూలో దాని పట్టు బాగానే ఉంది. కానీ, ముప్పై రెండుస్థానాల్లో పోటీచేసిన కాంగ్రెస్ కశ్మీర్‌లోయలో ఐదు, జమ్మూలో ఒకటి మాత్రమే గెలవడం హర్యానా ఓటమికి తోడు మరో శరాఘాతం. అత్యధికం పీడీపీ స్థానాలను నేషనల్ కాన్ఫరెన్స్ ఇప్పుడు గెలుచుకోవడం లోయలో ప్రజాభిప్రాయానికి అద్దంపడుతున్నది. జమ్మూలో బీజేపీ బలం ఎంత హెచ్చినా దానిని అధికారానికి దూరంగా ఉంచడం లోయ ప్రజల అభీష్టం కావచ్చు. తాను గతంలో తిట్టిపోసి, జైళ్ళలోకి నెట్టి, ఆస్తులను సైతం స్వాధీనం చేసుకున్న పలువురు వేర్పాటువాదులను బీజేపీ రంగంలోకి దించినా, అనేక చిన్నాచితకాపార్టీలు ఓట్లను చీల్చేందుకు శాయశక్తులా కృషిచేసినా, కాంగ్రెస్ కొంతమేరకు నష్టపోయిందేమో కానీ, అబ్దుల్లాల పక్షాన ప్రజలు గట్టిగా నిలబడటం విశేషం.

అత్యధికస్థానాలు గెలుచుకున్న పార్టీ నాయకుడుగా ఒమర్ అబ్దుల్లా సునాయాసంగా ముఖ్యమంత్రి కాబోతున్నారు. కాంగ్రెస్ మద్దతు కూడా ఉన్నది కాబట్టి, ఐదుగురు ఎమ్మెల్యేలను నామినేట్ చేసే అధికారాన్ని దఖలు పరుచుకున్న లెఫ్టినెంట్ గవర్నర్ అడ్డుతోవలు తొక్కకపోవచ్చు. కానీ, కశ్మీర్ చరిత్రలో అత్యంత బలహీనమైన, ఎటువంటి నిర్ణయాధికారాలూ లేని అసెంబ్లీకి సారథ్యం వహిస్తూ ఇకపై నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం నిత్యం గవర్నర్‌తో ఘర్షణపడాల్సి ఉంటుంది. భవిష్యత్తు పరిణామాలను అటుంచితే, పదేళ్ళ తరువాత ఎన్నికలు ప్రశాంతంగా జరగడం, ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వాములు కావడం, తమకు నచ్చినవారిని ఎన్నుకోవడం మెచ్చదగ్గ విషయం.

హర్యానాలో బీజేపీ ఎలా గెలిచింది?



ఆరు నెలల క్రితమే బీసీ వర్గానికి చెందిన నేతను ముఖ్యమంత్రిగా నియమించిన బీజేపీ– బ్రాహ్మణులు, పంజాబీ ఖత్రీలు, రాజపుత్రులు, వైశ్యులను సైతం దరిచేర్చుకుంది. క్రీమీలేయర్ పద్ధతిని సమర్థంగా ఉపయోగించి బీసీల్లో బాగా వెనుకబడిన వర్గాలకు ప్రయోజనాలు చేకూర్చే చర్యలు చేపట్టింది. జాట్ యేతర సామాజిక వర్గాలను సంఘటితం చేసే ప్రయత్నంలో బీజేపీ విజయవంతం కావడమే హర్యానాలో ఆ పార్టీ గెలుపునకు కారణమని అంటున్నారు.



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

భారతీయ జనతా పార్టీతో ముఖాముఖి తలపడే రాష్ట్రాల్లో అనేక చోట్ల కాంగ్రెస్ పార్టీ ఎందుకని గట్టి పోటీనివ్వకపోతోంది? బీజేపీని ఎదుర్కొనేందుకు అవసరమైన అస్త్ర శస్త్రాలు కాంగ్రెస్ వద్ద లేవా? 2022లో హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ, 2023లో జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీతో కాంగ్రెస్ ముఖాముఖి పోటీపడి విజయం సాధించగలిగింది. అయితే 2024 లోక్‌సభ ఎన్నికలలో కర్ణాటకలో బీజేపీకి 17 సీట్లు లభిస్తే కాంగ్రెస్‌కు 9 సీట్లు మాత్రమే లభించాయి. ఇక హిమాచల్‌ప్రదేశ్‌లో మొత్తం నాలుగు సీట్లు బీజేపీకే దక్కాయి. ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికంగా మిత్రపక్షాలతో కలిసి పోటీ చేసిన స్థానాల్లోనే విజయం సాధించింది. ఉత్తరప్రదేశ్, తమిళనాడు లాంటి రాష్ట్రాల్లో మిత్రపక్షాల వల్ల కాంగ్రెస్ ఓటు శాతం పెరిగింది.

2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ సంఖ్యాబలం 240కి తగ్గిపోయిన తర్వాత బీజేపీని ముఖాముఖి ఢీకొనే అవకాశం కాంగ్రెస్‌కు ఇప్పుడు హర్యానాలో లభించింది. నిజానికి లోక్‌సభ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌కు టేకాఫ్ దశ ప్రారంభమైందని చాలా మంది భావించారు. ప్రతిపక్ష నేత హోదా సాధించిన రాహుల్ నేతృత్వంలో కాంగ్రెస్‌కు మాత్రమే బీజేపీని ఢీకొనే శక్తి ఉన్నదనే ప్రచారం జరిగింది. లోక్‌సభలో ఇతర మిత్రపక్షాలతో కలిసి బీజేపీని ఉక్కిరిబిక్కిరి చేసిన రాహుల్‌గాంధీ విస్తృతంగా ప్రజల్లో ప్రవేశించడమే కాక విదేశాలకు వెళ్లి కూడా తాను మోదీకి ప్రత్యామ్నాయ నాయకుడుగా నిరూపించుకునే ప్రయత్నం చేశారు. బీజేపీ భావజాలానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ తన స్వంత భావజాలం సృష్టించుకుంది. దళితులు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీలకు తామే ప్రాతినిధ్యం వహించగలమని చెప్పుకుంది. బీజేపీని సంపన్న వర్గాల పార్టీగా తమది పేదల పార్టీగా చిత్రీకరించింది. కులజనగణన, రైతుల సమస్యలు, నిరుద్యోగం, అధిక ధరలు మొదలైన అనేక అంశాలను లేవనెత్తింది. నరేంద్రమోదీని రాహుల్ గాంధీ విమర్శించినంత తీవ్రంగా మరే నేతా విమర్శించలేదు. ప్రతిపక్షాలు కూడా రాహుల్‌తో ఏ మాత్రం విభేదించలేదు. పైగా ఆయనను ప్రోత్సహించాయి. లోక్‌సభలో ఆయన వెన్నంటి నిలిచాయి. కాంగ్రెస్‌తో పొత్తు కుదరని రాష్ట్రాల్లో కూడా ప్రతిపక్షాలు రాహుల్‌ను వ్యక్తిగతంగా విమర్శించకుండా ఇండియా కూటమిలో కొనసాగుతూ వచ్చాయి.

అయితే బీజేపీతో ముఖాముఖి పోటీ చేసే రాష్ట్రాల్లో కాంగ్రెస్ దాన్ని ఓడించగల శక్తిని, వ్యూహరచనను సమకూర్చుకోలేదని హర్యానా ఎన్నికల ఫలితాలు రుజువు చేస్తున్నాయి. నిజానికి హర్యానాలో పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం కొనసాగుతోంది. రైతుల ఆందోళన, మల్లయోధుల నిరసనతో పాటు అనేక స్థానిక అంశాలు బీజేపీకి వ్యతిరేకంగా మారాయి. హర్యానాలో తిరిగిన ప్రతి జర్నలిస్టూ అక్కడ మార్పు సంభవిస్తోందని భావించారు. హర్యానాలో ఎగ్జిట్‌పోల్స్ నిర్వహించిన ఏడు ప్రధాన సంస్థలు చెప్పిన ఫలితాలను సగటున బేరీజు వేసి చూస్తే 90 సీట్లలో 55 సీట్లు కాంగ్రెస్‌కు దక్కుతాయని, బీజేపీకి 26 సీట్లు దక్కుతాయని తేలింది. కాని ఇప్పుడు ఫలితాలు చూస్తే అందుకు భిన్నంగా ఉన్నాయి. బీజేపీ మూడోసారి హ్యాట్రిక్ చేసి అధికారంలోకి రాగలిగింది.

ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ఎన్నికల కమిషన్‌ను, ఈవీఎంలను విమర్శించడం ప్రతి పార్టీ చేస్తుంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన కొద్ది గంటల్లోనే ఫలితాలను వెంటవెంటనే ప్రకటించడం లేదని కాంగ్రెస్ కమ్యూనికేషన్ ఇన్‌చార్జి జైరాం రమేశ్ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. అందుకు ఎన్నికల కమిషన్ వెంటనే స్పందిస్తూ అందుకు ఆధారాలేమీ లేవని, ప్రతి అయిదు నిమిషాలకూ ఫలితాలను ప్రకటిస్తూనే వచ్చామని స్పష్టం చేసింది. అంటే కాంగ్రెస్‌కు తాము ఎందుకు ఓడిపోయామో ఏ మాత్రం అర్థం కాలేదన్న విషయం తేటతెల్లమవుతోంది. మేము ఈ ఫలితాలను ఆమోదించం అని ప్రకటించినంత మాత్రాన ఏమి జరుగుతుంది?

ఆమ్ ఆద్మీ పార్టీ నేత అరవింద్ కేజ్రీవాల్ జైలు నుంచి విడుదలయిన తర్వాత బీజేపీతో జరిగిన ఒప్పందంలో భాగంగా హర్యానాలో తమ అభ్యర్థులను రంగంలోకి దింపారని ఒక ప్రచారం జరుగుతోంది. రాజకీయాల్లో ఎవరూ శాశ్వత శత్రువులు కానీ శాశ్వత మిత్రులు కానీ ఉండరు. కేజ్రీవాల్‌తో బీజేపీ అలాంటి ఒప్పందమే నిజంగా కుదుర్చుకుని ఉంటే అందుకు ఆ పార్టీ వ్యూహకర్తలను ప్రశంసించాల్సి ఉంటుంది కాని తప్పుపట్టలేము. తమిళనాడులో డిఎంకెకు కూడా బీజేపీ స్నేహహస్తం చాస్తోందని ఇటీవల మరో ప్రచారం మొదలైంది. నవంబర్‌లో మహారాష్ట్ర ఎన్నికలు సమీపించేసరికి బీజేపీ ఏ వ్యూహరచన చేస్తుందో, లేక ఇప్పటికే చేసిందో చెప్పడం కష్టం. దేశంలో తన ఆమోద యోగ్యత పెంచుకునేందుకు, తాను బలహీనపడ్డానన్న విమర్శలను దూరం చేసేందుకు, పూర్తి టర్మ్ అధికారంలో కొనసాగేందుకు మోదీ ఏ వ్యూహాన్నైనా అవలంబించవచ్చు. దక్షిణాదిన తెలుగుదేశం, జనతాదళ్ (ఎస్)తో చేతులు కలిపాక బీజేపీ ఆమోదయోగ్యత పెంచుకుంది. తెలంగాణలో ఆ పార్టీ ఏమి చేస్తుందో కొద్ది నెలల్లో తేలనుంది.

ఎటొచ్చీ హర్యానాలో గెలుపుతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ మరోసారి దేశ రాజకీయాల్లో తన పార్టీకి బలమైన నాయకత్వం అందించగలరని నిరూపించుకుని ఆయన ఓటమిని ఆకాంక్షిస్తున్నవారు వెనక్కు తగ్గేలా చేశారు. జమ్ము కశ్మీర్‌తో పాటు హర్యానా ఎన్నికల్లో ఓడి ఉంటే మహారాష్ట్రలోనూ, పొరుగున ఉన్న ఢిల్లీలోనూ మోదీ తన బలం నిరూపించుకునేందుకు అష్టకష్టాలు పడాల్సి వచ్చేది. అ తర్వాత మోదీకి ప్రత్యామ్నాయం గురించి కూడా దేశంలో తీవ్ర చర్చ జరిగేది. ప్రస్తుతానికి ఆ చర్చ అప్రస్తుతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

లోక్‌సభ ఎన్నికల తర్వాత తాను పుంజుకున్నానని నిరూపించేందుకు కాంగ్రెస్‌కు లభించిన ఒకే ఒక్క అవకాశాన్ని హర్యానాలో పోగొట్టుకుంది. తెలంగాణలో రేవంత్ రెడ్డిని రంగంలోకి దింపినట్లు కొత్తరక్తాన్ని, కొత్త నేతలను ప్రవేశపెట్టే అవకాశం ఉన్నా అందుకు ప్రయత్నించే ధైర్యం చేయలేదు. మల్లయోధురాలు వినేశ్ ఫోగట్ లాంటి ఒకరిద్దరిని నిలబెట్టినా మొదటి జాబితాలోనే 28 మంది సిట్టింగ్ అభ్యర్థులను రంగంలోకి దించారు. బీజేపీ కొందరు రాష్ట్ర మంత్రులకు కూడా సీట్లు నిరాకరించే ధైర్యం చేస్తే కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవికి అయిదారు మంది పోటీపడ్డా సర్దుబాటు చేయలేని పరిస్థితిలో పడింది. ముఖ్యమంత్రి పదవిని ఆశించిన పీసీసీ అధ్యక్షుడు ఉదయభాను కూడా ఓడిపోయారు. రాహుల్, ప్రియాంక ఇద్దరూ హర్యానాలో విస్తృతంగా ప్రచారం చేశారు. వారి సభలకు జనం పెద్ద ఎత్తున హాజరయ్యారు. కాని వారిని ఓటు బ్యాంకుగా మళ్లించే వ్యూహరచన కాంగ్రెస్ చేయలేకపోయింది.

ఒకవైపు యువతను ఆకర్షించేందుకు నిరుద్యోగం వంటి వాటిని కాంగ్రెస్ ప్రస్తావించినప్పటికీ యువ నేతలకు సీట్లు ఇవ్వకపోతే ఏమి ప్రయోజనం? కులజనగణన, దళితుల గురించి రాహుల్ గాంధీ ప్రస్తావించి ఉండవచ్చు కాని మూడోవంతు సీట్లను జాట్లకు ఎందుకు కేటాయించాల్సి వచ్చింది? అయినా జాట్ల అధిపత్యం ఉన్న సీట్లలో కూడా కాంగ్రెస్ మెజారిటీ సీట్లు ఎందుకు సాధించలేకపోయింది? 1966లో హర్యానా ఏర్పడిన నాటి నుంచి 33 ఏళ్లు జాట్ ముఖ్యమంత్రులే పారిపాలించారు. ఒక్క భజన్‌లాల్ తప్ప జాట్ కాని వారు ఎక్కువకాలం పాలించలేకపోయారు. రాష్ట్రంలో 33 శాతం ఉన్న బీసీలు, 22 శాతం ఉన్న దళితులపై బీజేపీ పూర్తిగా దృష్టి కేంద్రీకరించి మూడోవంతు సీట్లను జాట్లు కాని వర్గాలకు కేటాయించింది. బీసీలకే 22 సీట్లు దక్కాయి. ఆరు నెలల క్రితమే బీసీ వర్గానికి చెందిన నేతను ముఖ్యమంత్రిగా నియమించిన బీజేపీ బ్రాహ్మణులు, పంజాబీ ఖత్రీలు, రాజపుత్రులు, వైశ్యులను కూడా దరిచేర్చుకుంది. అంతేకాక, క్రీమీలేయర్ పద్ధతిని సమర్థంగా ఉపయోగించి బీసీల్లో బాగా వెనుకబడిన వర్గాలకు ప్రయోజనాలు చేకూర్చే చర్యలు చేపట్టింది. నిజానికి దేశ వ్యాప్తంగా ఓబీసీ ఓటు బ్యాంకును తమ వైపునకు తిప్పుకునేందుకు బీజేపీ ఎప్పటి నుంచో ప్రయత్నాలు చేస్తోంది. సాధ్యమైనంత మేరకు ముఖ్యమంత్రులు, పార్టీ రాష్ట్ర అధ్యక్షులను ఓబీసీ వర్గాలనుంచే నియమిస్తోంది. జాట్ కాని వారందర్నీ సంఘటితం చేసే ప్రయత్నంలో బీజేపీ విజయవంతం కావడమే హర్యానాలో ఆ పార్టీ గెలుపునకు కారణమని అంటున్నారు.

బీజేపీకి గత లోక్‌సభ ఎన్నికల్లో 240 సీట్లు మాత్రమే వచ్చాయని ఆనందిస్తున్న కాంగ్రెస్, ఆ పార్టీకి ఓట్లు 37.3 శాతం నుంచి 36.6 శాతానికి మాత్రమే తగ్గాయని గుర్తించాలి. అఖిల భారత స్థాయిలో బీజేపీ ఆదరణ అనుకున్నంత తగ్గలేదు. కనుక బీజేపీతో ఆ పార్టీ ఇంకా సుదీర్ఘ కాలం బలంగా పోరాడాల్సి ఉంటుంది. ఒకరకంగా హర్యానాలో కాంగ్రెస్ బాగానే ఘర్షించి, కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఉన్న అధికార పార్టీకి ముచ్చెమటలు పుట్టించిందనే చెప్పాలి. కాని విజయం సాధించదగ్గ ప్రణాళికను కాంగ్రెస్ అమలు చేయలేకపోయింది. ఒడిషాలో అధికారం సాధించి, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో కూడా బీజేపీ ఓటు బ్యాంకు పెంచుకుంటే కాంగ్రెస్ తాను బలంగా ఉన్న రాష్ట్రాల్లో కూడా నిలదొక్కుకోలేకపోతోంది. మరో ఒకటి రెండునెలల్లో ఎన్నికలు జరుగనున్న మహారాష్ట్ర ఢిల్లీల్లో కూడా బీజేపీ విజయం సాధిస్తే కాంగ్రెస్ శ్రేణులు మరింత నీరుకారిపోక తప్పదు. అప్పుడు ఇండియా కూటమిలో కూడా లుకలుకలు ఏర్పడుతాయి. 'హర్యానా చిన్న రాష్ట్రమైనా ఒక కీలక సమయంలో జరిగిన ఆ రాష్ట్ర ఎన్నికలు మోదీకి తిరుగులేని బలాన్ని చేకూర్చాయి. ఈ విజయం ప్రాతిపదికగా ఆయన మహారాష్ట్రలో కూడా గెలిచేందుకు ప్రతిపక్ష శిబిరాన్ని కకావికలు చేసేందుకు మరిన్ని ప్రయత్నాలు చేస్తారు' అని ఒక ముఖ్యమంత్రి మంగళవారం ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ చెప్పారు. కాంగ్రెస్ తన భవిష్యత్ కార్యాచరణపై మరింత ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉన్నది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)



ఈ సూచనలు ఆచరణకు తగినవి. వాటిని మీరు అమలు చేయగలిగితే పర్యావరణంతో బాటు ప్రజల మద్దతు కూడా మీకు లభిస్తుంది. ముఖ్యమంత్రి పదవి అనేది ప్రజల మద్దతుతో దేవుడు ఇచ్చిన వరం, దాన్ని సద్వినియోగపర్చుకోవడం మీ బాధ్యత.

పర్యావరణ భద్రతతో పాటు ప్రజాశ్రేయస్సు ముఖ్యం

హైదరాబాద్, పరిసర ప్రాంతాలలో ఉన్న అనేక చెరువులు, నాలాలు, మూసీ నది పరివాహక ప్రాంతంలో దశాబ్దాలుగా అక్రమ, సక్రమ కట్టడాలు వచ్చినవి అనేది వాస్తవం. దానికి ప్రధాన కారణం అవినీతి నాయకులు, అధికారులు. ముఖ్యంగా పేదరికాన్ని ఆసరాగా చేసుకొని ప్రోత్సహించినవారు ఉన్నారు. ఇది దీర్ఘకాలిక సమస్య. పర్యావరణాన్ని కాపాడాలి, గ్రేటర్ హైదరాబాద్‌లో లేక్ సిటీని పునరుద్ధరించాలి అనే లక్ష్యాన్ని స్వాగతిస్తూనే, సహజ న్యాయం కొరకు ఈ సూచనలు ప్రస్తావిస్తున్నాను. నిర్వాసితులకు న్యాయం మొదటి అంశం కావాలి. అందరి మన్ననతలోనే ముందుకు సాగాలి.

1) ఇది దీర్ఘకాలిక సమస్య, పరిష్కారానికి కూడా ఒక దీర్ఘకాలిక ప్రణాళిక ఉంటె మంచి ఫలితాలు ఉంటవి. పర్యావరణ రక్షణతో పాటు, నిర్వాసితులకు న్యాయం చేయడం కూడా ముఖ్యం. ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబానికి సొంత ఇల్లు వారి జీవిత లక్ష్యం. నిర్దాక్షిణ్యంగా వారి గూడు కూలిస్తే ప్రభుత్వాలే కూలుతాయి. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు ఈ ప్రభుత్వం చేయకుంటే వారికే మంచిది. 2) ప్రణాళిక: మొదట సర్వే, గూగుల్ మ్యాప్స్, ఇస్రో, రిమోట్ సెన్సింగ్‌లతో ఒక బృహత్తర ప్రణాళికను సిద్ధం చేయండి. దానికి అవసరం అయిన ప్రపంచ ఖ్యాతి పొందిన సంస్థలతో ప్రణాళిక సిద్ధం చేయండి. అది ప్రజలు, ప్రతిపక్ష పార్టీల ముందు ఉంచి, అందరి సలహాలు, సూచనలు తీసుకోవడం మంచిది. డీపీఆర్ (డిటైల్డ్ ప్లానింగ్ రిపోర్ట్) లేకుండా ముందుకు వెళితే, గుంతలు తీసినంక ఇల్లు ప్లాన్ చేసినట్లు ఉంటది. 3) నిర్మాణాల తొలగింపు–టాప్ టు బాటమ్. అంటే మొదట సంపన్నులు, ధనికులతో మొదలు పెట్టండి. పేద, మధ్య తరగతి వారికి మంచి ప్యాకేజి ఇచ్చిన తర్వాతనే వారి జోలికి రండి. 4) స్థలం బదులు స్థలం: ప్రభుత్వ భూమి హైదరాబాద్, పరిసర ప్రాంతాలలో చాలా ఉన్నది. ఉదాహరణకు తెలంగాణ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ దగ్గర దాదాపు 1,50,000 ఎకరాలు ఉంది. అదే విధంగా హైదరాబాద్, పరిసర ప్రాంతాలలో ప్రభుత్వ భూమి ఉంది. నిర్వాసితులకు 250 గజాల స్థలం కేటాయిస్తే, వారికి సహజ న్యాయం దక్కుతుంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 12,000 వేల మంది నిర్వాసితులు ఉంటారు. కుటుంబానికి 250 గజాలు ఇచ్చినా, కేవలం 1000 ఎకరాల భూమి సరిపోతుంది. 5) అపార్ట్‌మెంట్, విల్లా నిర్వాసితులకు న్యాయం: వారికి కూడా హైదరాబాద్, పరిసర ప్రాంతాలలో ఉన్న ప్రధాన కూడళ్లలో, స్థలం కేటాయించి ఆర్థిక సహాయం అందిస్తే లేదా బ్యాంకు వడ్డీ మాఫీ చేయగలిగితే బాగా ఉంటుంది. 6) బ్యాంకు రుణాలు: అపార్టుమెంట్లు, విల్లాలు చాలామంది లోన్లు తీసుకొనే కట్టి ఉంటారు. ప్రభుత్వం, భూమి, ఇల్లు రిజిస్ట్రేషన్ ఫీజు, మునిసిపల్ పర్మిషన్ ఫీజు, నాలా ఇలా రకరకాల ఫీజులు, చార్జీలు కట్టించుకునే ఇచ్చారు కనుక, వారికీ లోన్లు బ్యాంకులు వీటి ఆధారంగా ఇచ్చాయి కనుక, బ్యాంకు రుణాలు స్వచ్ఛంద మాఫీ చేయాలి. బ్యాంకులు రుణ గ్రహీతలను ఇబ్బంది పెట్టకుండా చొరవ తీసుకోవాలి. నిర్వాసితులు కట్టినటువంటి అన్ని ఫీజులు ప్రభుత్వం వాపసు చెయ్యాలి. 7) మూసి సుందరీకరణ తర్వాత మూసి వెంట నిర్మించే హై రైస్ బిల్డింగ్స్‌లో కొంత కోట నిర్వాసితులకు చెందేలా చట్టపరమైన చర్యలు తీసుకుంటే మంచిది. 8) సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమలవారు ఈ ప్రాంతాలలో సర్వం కోల్పోయారు. వారికి వివిధ ఇండస్ట్రియల్ పార్కులలో ప్లాట్స్ కేటాయిస్తే ప్రభుత్వానికి మంచి పేరు, వారికి జీవనోపాధి కల్గుతుంది. 9) జీవో 111: హైదరాబాద్ జంట జలాశయాలు కొరకు లక్ష 50 వేల ఎకరాల్లో పర్యావరణ రక్షణ కొరకు ప్రభుత్వం, కోర్ట్, ప్రజల మద్దతుతో జీఓ ఇచ్చారు. కానీ చాలా మంది సంపన్నులు తక్కువ ధరకు కొని, జీఓ 111 ఉల్లంఘించి విల్లాలు, రిసోర్ట్లు, ఫార్మ్ హౌస్‌లు, కాలేజీలు కట్టారు. అది పూర్తిగా అక్రమం. అత్యధిక మంది సంపన్నులు కావడం వలన, మొదట ఆ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటే బాగుంటది. 10) 1,50,000 కోట్ల రూపాయలు మూసి ప్రాజెక్టుకు అయ్యే ఖర్చు అని ప్రభుత్వం ప్రకటన చేసింది. సహజ న్యాయం, ఇంటర్నేషనల్ లా ఆఫ్ హ్యూమన్ రైట్స్ ప్రకారం, ప్రాజెక్టుకు అయ్యే ఖర్చులో కనీసం ముప్పైశాతం నిర్వాసితులకు ఖర్చు పెట్టాలనే నిబంధన ఉంది. కనుక, ఆ సిద్ధాంతాలను పాటిస్తే ప్రభుత్వానికి మంచి పేరు వచ్చే అవకాశం ఉంది.



ప్రభుత్వ భూమి హైదరాబాద్, పరిసర ప్రాంతాలలో చాలా ఉన్నది. ఉదాహరణకు తెలంగాణ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ దగ్గర దాదాపు 1,50,000 ఎకరాలు ఉంది. అదే విధంగా హైదరాబాద్, పరిసర ప్రాంతాలలో ప్రభుత్వ భూమి ఉంది. నిర్వాసితులకు 250 గజాల స్థలం కేటాయిస్తే, వారికి సహజ న్యాయం దక్కుతుంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 12,000 వేల మంది నిర్వాసితులు ఉంటారు. కుటుంబానికి 250 గజాలు ఇచ్చినా, కేవలం 1000 ఎకరాల భూమి సరిపోతుంది.

ఈ సూచనలు ఆచరణకు తగినవి, వాటిని మీరు అమలు చేయగలిగితే పర్యావరణంతో బాటు ప్రజల మద్దతు కూడా మీకు లభిస్తుంది. ముఖ్యమంత్రి పదవి అనేది ప్రజల మద్దతుతో దేవుడు ఇచ్చిన వరం, దాన్ని సద్వినియోగం పర్చుకోవడం మీ బాధ్యత. With power comes responsibility, with great power comes greater responsibility.

• డాక్టర్ బూర నర్సయ్య గౌడ్
మాజీ ఎంపీ– భోనగిరి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

తెలంగాణ ప్రజాఫ్రంట్ 15వ ఆవిర్భావ సదస్సు

తెలంగాణ ప్రజాఫ్రంట్ (టిపిఎఫ్) 2010 అక్టోబర్ 9న హైదరాబాద్‌లోని రెడ్‌హిల్స్‌లో వేలాది తెలంగాణ ఉద్యమకారుల సమక్షంలో పురుడు పోసుకున్నది. ప్రజానాయకుడు గద్దర్ ఈ ఫ్రంట్‌కు తొలి అధ్యక్షుడు. ప్రజా ఉద్యమం ద్వారానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోగలమని నమ్మే వ్యక్తులు, శక్తులు ఈ ఫ్రంట్‌లో భాగమయ్యారు. తెలంగాణ ఐక్యకార్యాచరణ కమిటీ, సాంస్కృతిక సమాఖ్య, తెలంగాణ జేఏసీ సమన్వయ స్టీరింగ్ ఫ్రంట్ వంటి సంస్థలు చేసిన కృషి ఫలితంగా టిపిఎఫ్ ఏర్పడింది. తెలంగాణ రాష్ట్ర సాధన, వనరుల సంరక్షణ ప్రజాఫ్రంట్ ముఖ్య ఆశయం. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లును ప్రవేశ పెట్టి, ఆమోదింపజేయడానికి కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడం ప్రధాన లక్ష్యంగా టిపిఎఫ్ ఆనాడు పనిచేసింది. ప్రజా ఉద్యమాల ద్వారానే రాష్ట్ర సాధన సాధ్యమవుతుందని టిపిఎఫ్ విస్తృత ప్రచారం చేసింది. తెలంగాణ రాష్ట్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ టిపిఎఫ్‌పై తీవ్ర నిర్బంధాన్ని అమలు చేసి, కార్యకర్తలను, నాయకులను నిర్బంధించారు. కానీ ఫ్రంట్ కార్యకర్తలు గుండె నిబ్బరంతో ఆ నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారెంటీల అమలు కోసం కూడా ఇప్పుడు ఒత్తిడి తేవాల్సిన అవసరం ఏర్పడింది.

నేడు తెలంగాణ ప్రజాఫ్రంట్ 15 ఆవిర్భావ సదస్సు జరుగుతుంది. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు ఈ సదస్సు ప్రారంభమవుతుంది. ప్రారంభ సభకు రాచమోని నాగభూషణం అధ్యక్షులు. ప్రొ. జి. హరగోపాల్ ప్రారంభోపన్యాసకులు. మధ్యాహ్నం నుంచి జరిగే సభల్లో 'ప్రజాస్వామిక తెలంగాణ – తెలంగాణ ప్రజాఫ్రంట్ అంశంపై ప్రొ. కాశీం; ప్రజా ఉద్యమాలు–నిర్బంధం అంశంపై ప్రొ. గడ్డం లక్ష్మణ్ 'మహిళలు, దళితులపై జరుగుతున్న మనువాదుల దాడులు' అంశంపై కాత్యాయని విద్మహే; 'కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల పాలనా విధానాలు' అంశంపై ఎస్. వేణుగోపాల్ ప్రసంగిస్తారు.


–తెలంగాణ ప్రజాఫ్రంట్ (టిపిఎఫ్) రాష్ట్ర కమిటీ

అధికారం పోతేనే రైతన్న గుర్తుకొస్తాడా.. హరీశ్!



మిర్చి కొనుగోలు చేయాలని అడిగినందుకు ఖమ్మం జిల్లాకు చెందిన 10 మంది రైతులను బేడీలు వేసి జైలుకు తీసుకుపోతుంటే వారికి ఆత్మగౌరవం ఉందని అనిపించలేదా హరీశ్‌రావ్?

ఏడు లక్షల కోట్ల అప్పులను, గత నీతిమాలిన పాలకుల వారసత్వంగా ఏడెనిమిది వేల కోట్ల మిత్తీలను కడుతూనే కేవలం 27 రోజుల వ్యవధిలో 18 వేల కోట్ల రుణమాఫీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీద నోరు పారేసుకుంటే మన రైతాంగం హర్షిస్తదా? ఇదొక నీతిమాలిన ప్రతిపక్షమని భావించడానికి హరీశ్‌రావు రాసిన ఇలాంటి అబద్ధాలు, అసత్యాలు, ఆత్మవంచన కారణమవుతాయి.



మాజీ మంత్రి హరీశ్‌రావు అక్టోబర్ 8న ఆంధ్రజ్యోతిలో "నీతిగల్ల రైతులు.. నీతిమాలిన ప్రభుత్వం" పేరిట రాసిన వ్యాసం అబద్ధాలు, అసత్యాలతో కూడిన ఆత్మవంచనను ఆవిష్కరించింది. హరీశ్‌రావుకు రాజకీయ జన్మను ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిజస్వరూపాన్ని, వారి పదేళ్ల మోసపూరిత పాలనను తెలంగాణ ప్రజలకు పదేపదే గుర్తు చేయాలని హరీశ్‌రావు లోలోపల భావించినట్లు కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి, ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న ఏడు నెలలకే రుణమాఫీకి పూనుకుంటే, బీఆర్ఎస్ (టీఆర్ఎస్)కు రాజకీయ భవిష్యత్తు అంధకారంగా కనిపించినట్టుంది. రైతులు పదేళ్ల రుణ బాధ నుంచి విముక్తి కావడం ఓర్వలేక హరీశ్‌రావు తన అక్కసు, అసూయ వెళ్లగక్కుతున్నట్లుగా ఉంది.

సమాచార హక్కు చట్టం కింద ఎస్.బి.ఐ ద్వారా జూన్ 1, 2024 వరకు రుణ ఖాతాల సమాచారం అడిగినట్లుగా హరీశ్‌రావు వెల్లడించారు. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 మధ్యలో తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ హరీశ్‌రావు ఈ ఏడు నెలల సమాచారాన్ని కూడా అందులోనే జమచేశారు. పదేళ్లపాటు ఆర్థిక, వైద్యం వంటి ముఖ్యమైన శాఖలకు మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావుకు ఈ సంగతి తెలియదనుకోవాలా? లేకుంటే ఎలాంటి సోయి లేకుండానే మాట్లాడుతున్నాడని అనుకోవాలా? అబద్ధాలు, అసత్యాలు, ఆత్మవంచన, మోసపూరిత పునాదుల మీదనే రాజకీయాలు చేయడం సహజమైన లక్షణమని తెలంగాణ సమాజం భావించాలా? ఆర్టీఐ కింద మీరు అడిగిన సమాచారం ఉద్దేశపూర్వకంగా తెలంగాణ ప్రజలను మరోసారి మోసం చేయాలనే దుర్బుద్ధితో అడిగినట్టు స్పష్టంగా కనిపిస్తోంది. తెలంగాణ రైతాంగానికి మేలు జరిగితే ఓర్చుకోలేని కడుపుమంటతో హరీశ్‌రావు చేస్తున్న విషప్రచారాలను తెలంగాణ సమాజం విశ్వసించదు.

గత పదేళ్ల నీతిమాలిన పాలకుల కాలంలోని పాపాల కారణంగా 7 లక్షల కోట్ల అప్పును వారసత్వంగా తీసుకుని, ఆ పాపాలకు పరిహారంగా తెలంగాణ ప్రజానీకం నెలకు ఏడెనిమిది వేల కోట్ల రూపాయల మిత్తీ కడుతున్నది. ఈ భారాన్ని మోస్తూనే ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు ఇస్తూ.. కఠోరమైన ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ.. ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పనిచేస్తుంటే హరీశ్‌రావుకు భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉన్నట్టుంది.

జూలై 18, 2024న మొదలుపెట్టి ఆగస్టు 15, 2024 వరకు మూడు దశలలో 22,22,067 మందికి రూ.2 లక్షల లోపు రుణ మాఫీ చేసింది. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రమాణం అమలు చేసి చూపించారు. పేర్లలో అచ్చుతప్పులు, కుటుంబ నిర్ధారణ వంటి సాంకేతిక సమస్యల కారణంగా మిగిలిన వాటిని పూర్తి చేయడానికి జిల్లాల్లో ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తోంది. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి తన 8 నెలల కాలంలోనే 22.22 లక్షల మందికి సుమారుగా 18 వేల కోట్ల రూపాయలను నేరుగా రైతుల ఖాతాలలో జమచేసి రుణవిముక్తులను చేశారు. కానీ ఇదే హరీశ్‌రావు ఆర్థిక, వైద్య మంత్రిగా 10 ఏండ్ల కాలంలో ఎంతమంది రైతులను రుణ విముక్తులను చేశారో చెప్పుకోవడానికి ముఖం చెల్లడం లేదా? 10 వేల రుణమున్న రైతును కూడా 10 ఏండ్ల పాటు గోసపుచ్చుకున్న హరీశ్‌రావుకు 7 నెలల్లోనే (పార్లమెంట్ ఎన్నికల కోడ్ పోను) 'రైతుల కన్నీటితో తడిసిన కాగితాల కట్ట" జమ అయిందా? మరి మీరు అధికారంలో ఉన్న పదేళ్లలో చేసిన అరాచకాలు, మోసాలు, అబద్ధాలు, ద్రోహాలు, అఘాయిత్యాలు, బెదిరింపులు ఈ తెలంగాణ సమాజం దగ్గర ఎన్ని కట్టలుంటాయో అంచనా వేయగలరా? రైతులకు రుణమాఫీ చేస్తామని 2014 మెనిఫెస్టో (9, 10, 11 పేజీలు)లో రాసుకున్న కాగితాల కట్ట మీ దగ్గర లేదా? మీరు శాసనసభ సభ్యునిగా ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట నియోజకవర్గంలో 19,126 మంది లబ్ధిదారుల (18,662 కుటుంబాలు)కు 160.96 కోట్లతో రుణమాఫీ జరిగింది. మీ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి శాసనసభ్యునిగా ఉన్న గజ్వేల్ నియోజకవర్గంలో 28,810 మంది లబ్ధిదారుల (27,906 కుటుంబాలు)కు 215.37 కోట్లతో ప్రభుత్వం రుణవిముక్తులను చేసింది. ఒకసారి నియోజకవర్గాలలో తిరిగి చూడు వారి మొఖాల్లో వెలుగుతున్న కాంతిని చూస్తే మీరెంత అంధకారంలో ఉన్నారో అర్థమవుతుంది. ఈ కుటుంబాల్లో దసరా పండుగకంటే ముందే వచ్చిన సంబరాలను చూసే విశాల హృదయం మీకు, మీ పార్టీకి ఉందా? బహిరంగ చర్చకు సవాల్ విసరడానికి ముందు గత పదేండ్ల పాపాలకు ఎలాంటి ప్రాయశ్చిత్తం కోరతావ్? మిర్చి కొనుగోలు చేయాలని అడిగినందుకు ఖమ్మం జిల్లాకు చెందిన మండేపూడి ఆనంద రావుతో సహా 10 మంది రైతులను బేడీలు వేసి జైలుకు తీసుకుపోతుంటే వారికి ఆత్మగౌరవం ఉందని అనిపించలేదా హరీశ్‌రావ్? కామారెడ్డిలో వడ్లను కొనకపోతే అదే ధాన్యం కుప్పమీద పడి మామిడి వీరయ్య (ఐలాపూర్ గ్రామం) గుండె ఆగిపోతే మీది నీతిమాలిన పాలన అని అనిపించలేదా? బాన్సువాడ మండలం హనుమాజీపేటకు చెందిన రైతు సింగం శంకర్ తాను పండించిన వడ్లు కొనాలని బతిమిలాడితే, మీ పాలనలో ఎవరూ పట్టించుకోకుంటే ఆత్మహత్య చేసుకున్నారు. అప్పుడు మంత్రిగా ఉన్న మీ సత్యం, సమర్థత, ట్రబుల్ షూటింగ్ నైపుణ్యం ఏమైనాయి? బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో 5304 మంది రైతులు ఆత్మహత్య (నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో రిపోర్ట్ నివేదికలు) చేసుకుంటే చలనం లేని నీతిమాలిన పాలకులు ఏమిచెప్పినా మన రైతాంగం నమ్ముతదా?

తెలంగాణ రైతాంగం ఎప్పుడూ రాజకీయ చైతన్యం ఉన్నదే. సబ్బండవర్గాల పోరాటం, త్యాగంతో హైదరాబాదుతో కూడిన తెలంగాణ ఏర్పాటయింది. జూన్ 2, 2014 నాటికి 16 వేల కోట్ల మిగులు బడ్జెట్, పదేళ్ల పాటు అప్రతిహత అధికారం ఇస్తే.. 7 లక్షల కోట్ల అప్పు చేసినవారు ఎంత నీతిమాలిన పాలకులో తెలంగాణ సమాజం అర్థం చేసుకోలేదా? మిగులు బడ్జెట్ ఉన్నప్పటికీ రుణమాఫీ చేయటం చేతకాని వారెంత అసమర్థులో హరీశ్‌రావుకు అర్థం కాకుండా ఉంటదా? 7 లక్షల కోట్ల అప్పులను, గత నీతిమాలిన పాలకుల వారసత్వంగా ఏడెనిమిది వేల కోట్ల మిత్తీలను కడుతూనే కేవలం 27 రోజుల వ్యవధిలో 18 వేల కోట్ల రుణమాఫీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీద నోరు పారేసుకుంటే మన రైతాంగం హర్షిస్తదా? ఇదొక నీతిమాలిన ప్రతిపక్షమని భావించడానికి హరీశ్‌రావు రాసిన ఇలాంటి అబద్ధాలు, అసత్యాలు, ఆత్మవంచన కారణమవుతాయి.

తెలంగాణ సాయుధ పోరాటం చేసిన మన రైతాంగం ఎప్పుడూ నీతిమంతమైనదే. ఆకలితో చచ్చినా అవమానాన్ని భరించలేని ఆత్మగౌరవం మనది. ఆనాటి నుంచి రైతాంగంతో విడదీయలేని బంధం కాంగ్రెస్ పార్టీది. ఒక రైతు బిడ్డగా, సాగులోని రైతు స్వేదం విలువ తెలిసిన రేవంత్‌రెడ్డికి మీరు చెప్పాల్సిన ఆగత్యం లేదు. మరీ ముఖ్యంగా ఎకరానికి కోటి రూపాయల పంటను పండించే మర్మం తెలిసిన, నిజాయితీగా పాలుపోసే డెయిరీలు దివాలా తీస్తుంటే వందల కోట్ల లాభాలొచ్చే డెయిరీల యాజమానులైన మీరు సామాన్య రైతుల గురించి మాట్లాడితే అంతకుమించిన ఆత్మవంచన ఉంటదా? రైతులు నీతిమంతులనే విషయం మీకు అధికారం పోతేనే గుర్తుకొస్తదా? వరి పండిస్తే ఉరే అని అధికారంలో ఉన్నప్పుడు బెదిరింపులకు దిగి రైతుల ఆత్మగౌరవం గుర్తించలేని కర్కోట హృదయులకు అధికారం పోతేనే రైతులు నీతిమంతులని గుర్తొస్తది.

■ బొర్రెడ్డి అయోధ్యరెడ్డి
సీపీఆర్ఓ, తెలంగాణ ముఖ్యమంత్రి



బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతల సంబరాలు

జమ్మూలో బీజేపీ విజయం చరిత్రాత్మకం

- కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్ రెడ్డి
- హరియాణాలో కాంగ్రెస్ మోసాలకు చెక్:సంజయ్
- కాంగ్రెస్ హామీలను ప్రజలు నమ్మ లేదు: ఈటల

న్యూఢిల్లీ/హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మూలో బీజేపీ విజయం చరిత్రాత్మకమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి.. బీజేపీ జమ్మూ కశ్మీర్ ఎన్నికల ఇన్‌చార్జ్ కిషన్‌రెడ్డి అన్నారు. జమ్మూ ప్రాంతంలో 43 అసెంబ్లీ స్థానాలు ఉండగా 29 చోట్ల బీజేపీ విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో గతంలో కంటే ఎక్కువ సీట్లు, ఓట్లు సాధించామని తెలిపారు. జమ్మూ ప్రజలు బీజేపీతో ఉన్నారని మరోసారి రుజువైందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ముక్త జమ్మూ కశ్మీర్ సాధనలో తాము విజయం సాధించామని అన్నారు. జమ్మూ కశ్మీర్‌లో గతంలో ఎప్పుడూ సాధించనన్ని సీట్లు ఇచ్చిన ప్రజలకు రుణపడి ఉంటామని, ఆ ప్రాంతాల అభివృద్ధికి ప్రజలతో కలిసి పనిచేస్తామని కిషన్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ చేసే మోసాలు, తప్పుడు వాగ్దానాలకు చెక్ పెట్టేలా హరియాణా ఎన్నికల ఫలితాలు వచ్చాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. హరియాణాలో కాంగ్రెస్ ఉచితాల పేరిట ప్రచారం చేసినా, అక్కడి ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారని అన్నారు. అడ్డదారిలో అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ అలవికాని హామీలు ఇస్తోందని గుర్తించిన హరియాణా ప్రజలు.. ఆ పార్టీకి బుద్ధి చెప్పారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాలను వారు గమనించారని అన్నారు. హరియాణా, జమ్మూలో సాధించిన ఫలితాల పట్ల బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

అలంపూర్ ఆలయాలను పట్టించుకోని కేసీఆర్: మంత్రి సురేఖ

నాగార్జున అంశంపై నో కామెంట్ అంటూ దాటవేత

అలంపూర్, అక్టోబరు 8: 2016 కృష్ణా పుష్కరాల సమయంలో అలంపూర్ ఆలయాల అభివృద్ధికి రూ. 100 కోట్లు కేటాయిస్తానన్న గత సీఎం కేసీఆర్ వంద రుపాయలు కూడా ఇవ్వలేదని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్కియాలజీ విభాగంతో సమీక్ష నిర్వహించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రముఖ ఆలయాలను అభివృద్ధి దిశగా తీసుకెళ్లే ప్రయత్నం చేస్తామని చెప్పారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆమె జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లోని జోగుళాంబదేవి ఆలయాన్ని సందర్శించి పూజ చేశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మంత్రి సురేఖ మాట్లాడుతూ.. మహిమాన్వితమైన అలంపూర్ జోగుళాంబదేవి అమ్మవారిని దర్శించుకోవడం భక్తులందరి భాగ్యమన్నారు. ఈ సందర్భంగా సినీ నటుడు నాగార్జునపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి వివాదంపై మంత్రిని ప్రశ్నించగా.. విషయం కోర్టు పరిధిలో ఉన్నందున మాట్లాడనని దాటవేశారు.

ఎంబీఏ, ఎంసీఏ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు!

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : భర్తీ కాకుండా మిగిలిపోయిన ఎంబీఏ, ఎంసీఏ సీట్లకు స్పాట్ అడ్మిషన్లను నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా ఈ నెల 9వ తేదీన మిగిలిపోయిన సీట్ల వివరాలను ఆయా కాలేజీల నోటీస్ బోర్డులపై ప్రదర్శించనున్నారు. 10వ తేదీన నోటిఫికేషన్‌ను జారీ చేస్తారు. ఈ నెల 15, 16వ తేదీల్లో ఆయా కాలేజీల పరిధిలో స్పాట్ అడ్మిషన్లను నిర్వహించనున్నారు.

ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నర్సిరెడ్డి: యూటీఎఫ్

హైదరాబాద్, నల్లగొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అలుగుబెల్లి నర్సిరెడ్డి పోటీ చేస్తారని యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు జంగయ్య, చావా రవి మంగళవారం ప్రకటించారు. ప్రస్తుతం నర్సిరెడ్డి ఇదే నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. ఈ నియోజకవర్గానికి 2025 మార్చిలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని నర్సిరెడ్డినే మరోసారి పోటీలో నిలపాలని యూటీఎఫ్ నిర్ణయించింది.

పెండింగ్ బిల్లులను చెల్లించాలి: ఎమ్మెల్సీ రఘోత్తం

ఉపాధ్యాయులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి డిమాండ్ చేశారు. టీఆర్‌టీయూ అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం నాడు జరిగిన 35వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దసరాలోపు ఈ బిల్లులను చెల్లించాలని, లేని పక్షంలో ఉద్యమ కార్యాచరణను చేపడతామని ప్రకటించారు.

అసలేం జరిగింది!

- వివరాలు ఇవ్వండి
- వికలాంగుల సంక్షేమ శాఖ, కార్పొరేషన్ అధికారులకు ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ, కార్పొరేషన్లలో అసలేం జరుగుతోంది..? గడచిన పదేళ్లలో శాఖాపరంగా ఏం జరిగిందో వివరాలను ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆ శాఖ ఉన్నతాధికారులు ఆదేశించినట్టు సమాచారం. వికలాంగుల సంక్షేమ శాఖ, కార్పొరేషన్‌లో భారీ అవినీతి జరిగిందని, గత ప్రభుత్వ హయాంలో కోట్ల రూపాయల గోల్‌మాల్ జరిగిందని ప్రస్తుత వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య ఆరోపించిన విషయం తెలిసిందే. అందుకు సంబంధించి కొన్ని పత్రాలను కూడా ఆయన విడుదల చేశారు. ఈ క్రమంలోనే శాఖలో ప్రస్తుతం నిర్వహిస్తున్న, గతంలో అమలుచేసిన పథకాలు, కార్యక్రమాలకు సంబంధించి అన్ని వివరాలను నివేదించాలని ఉన్నతాధికారులు శాఖ అధికారులను ఆదేశించినట్టు తెలిసింది.

కేసు పేరుతో ఫోన్‌లో బెదిరించి రూ. 10.61 కోట్లు స్వాహా!

- ఇద్దరి అరెస్టు

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పోలీసులమనో.. సీబీఐ అధికారులమనో ఫోన్ చేసి.. కేసుల పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తే కంగారు పడకండి. స్థిమితంగా ఆలోచించండి. లేదంటే.. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి మాదిరిగా మీరూ జేబు గుల్ల చేసుకోవాల్సి రావొచ్చు! హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి రెండు నెలల క్రితం ఓ ఫోనొచ్చింది. అవతలి వ్యక్తి తనను తాను ముంబైకి చెందిన పోలీసుగా పరిచయం చేసుకున్నాడు. ఆధార్, పాన్ కార్డు ఉపయోగించి తెరిచిన బ్యాంకు ఖాతాలో పెద్ద మొత్తంలో మనీలాండరింగ్ జరిగిందని హడలెత్తించాడు. సీబీఐ, ఈడీ, ఆదాయపు పన్ను శాఖ, ఇతర విభాగాల పేర్లతో నకిలీ నోటీసులు పంపించాడు. కేసులో ఇరుక్కుంటే 3 నుంచి 7 ఏళ్ల శిక్ష తప్పదని బెదిరించాడు. కేసు నుంచి తప్పించాలంటే అడిగిన మొత్తం, చెప్పిన ఖాతాలకు బదిలీ చేయాలని డిమాండ్ చేశాడు. బెదిరిపోయిన బాధితుడు పలు దఫాలుగా రూ. 10.61 కోట్లు అతడు చెప్పిన ఖాతాకు బదిలీ చేశాడు. తర్వాత.. తాను మోసపోయానని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీస్‌లు బెంగళూరుకు చెందిన వినయ్ కుమార్, మారుతి అనే వ్యక్తులను అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలించారు.

చెరువులు, నాలాల లెక్క పక్కాగా!

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల గుర్తింపునకు సర్వే ఆఫ్ ఇండియాతో కలిసి పని చేయనున్న హైడ్రా

- ఇప్పటికే ఎన్ఆర్ఎస్ఏ, ఎస్ఆర్ఎస్‌సీలతో సమన్వయం
- హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ విభాగాల వద్ద వివరాలూ పరిశీలన
- అన్నీ క్రోడీకరించి చెరువులపై అంచనా
- 1970-71లో స్థితి ఎలా.. ఇప్పుడెలా ఉన్నాయన్నది గుర్తింపు
- సర్వే ఆఫ్ ఇండియా అధికారులతో కమిషనర్ రంగనాథ్ భేటీ



సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ బీసీ పరీడా, సూపరింటెండెంట్ దేబబ్రతతో భేటీ అయిన రంగనాథ్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మహానగరంలో చెరువులు, నాలాల లెక్కను శాస్ర్తీయ విధానం ద్వారా తేల్చేందుకు హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) సన్నద్ధమైంది. హబ్సిగూడలోని సర్వే ఆఫ్ ఇండియాతో కలిసి హైదరాబాద్‌లో చెరువులు, నాలాల లెక్క తేల్చేందుకు నడుంబిగించింది. ఈ మేరకు సర్వే ఆఫ్ ఇండియా అధికారులతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం సమావేశమయ్యారు. నాలుగైదు దశాబ్దాల క్రితం నగరంలో గొలుసు కట్టు చెరువులు ఎన్ని ఉండేవి? ఇప్పుడెన్ని ఉన్నాయి? అనేవి తేల్చేందుకు సహకరించాలని సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ బీసీ పరీడా, సూపరింటెండెంట్ దేబబ్రత పాలిట్‌లను రంగనాథ్ కోరారు. సర్వే ఆఫ్ ఇండియా వద్ద ఉన్న పాత మ్యాపులను ఈ సందర్భంగా పరిశీలించారు. 1971-72 సర్వే ప్రకారం నగరంలో ఉన్న చెరువుల సంఖ్య, వాటి విస్తీర్ణం, ప్రస్తుత స్థితి, నాలాలు ఎంత మేర ఉండేవి? కబ్జా అయినవెన్ని? అనేవి సర్వే ఆఫ్ ఇండియా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కాగా చెరువులకు సంబంధించి హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, రెవెన్యూ విభాగాల నుంచి హైడ్రా ఇప్పటికే వివరాలు సేకరించింది. వాటిని సర్వే ఆఫ్ ఇండియా వద్ద ఉన్న గత, ప్రస్తుత మ్యాపులతో క్రోడీకరించి చూశారు. ఏ ప్రాంతాల్లో చెరువులు కనుమరుగయ్యాయి? నాలాలు విస్తీర్ణం ఎంత తగ్గింది? అన్న దానిపై ఓ అంచనాకు రానున్నట్లు రంగనాథ్ తెలిపారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల నిర్ధారణలో సర్వే ఆఫ్ ఇండియానూ భాగస్వామ్యం చేయాలని నిర్ణయించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్- మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లోని చెరువులకు సంబంధించి సర్వే ఆఫ్ ఇండియా ఇచ్చిన వివరాలను ప్రభుత్వ విభాగాల సమచారంతో సరి పోల్చి ఓ నివేదిక తయారు చేయాలని నిర్ణయించారు. చెరువుల వారీగా వివరాలను డిజిటలైజ్ చేయాలని భావిస్తున్నారు.

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల నిర్ధారణపై దృష్టి

పలు చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ను నోటిపై చేస్తూ హెచ్ఎండీఏ తుది నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంకొన్ని చెరువులకు సంబంధించి ప్రాథమిక నోటిఫికేషన్ ప్రకటించింది. ఇందులో కొన్ని చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దశాబ్దాల క్రితం నాటి వివరాలను పరిగణనలోకి తీసుకొని వాస్తవ ఎఫ్‌టీఎల్ నిర్ధారించకుండా ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితుల ఆధారంగా పూర్తి నీటి నిల్వ సామర్థ్యం గుర్తించారని పర్యావరణ వేత్తలు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల నిర్ధారణపై ప్రత్యేక దృష్టి సారించాలని హైడ్రా నిర్ణయించింది. పైన పేర్కొన్న ఆయా విభాగాలతోపాటు ఎన్ఆర్ఎస్ఏ, ఎస్ఆర్ఎస్‌సీల వద్ద ఉండే శాటిలైట్ చిత్రాలు, ఇతర వివరాలనూ పరిగణనలోకి తీసుకోనున్నారు. శాస్ర్తీయ విధానంలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిర్ధారించాలని హైడ్రా నిర్ణయించింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో తాజాగా ప్రభుత్వమూ సంబంధిత విభాగాలకు మూడు నెలల్లో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల నిర్ధారణ పూర్తి చేయాలని ఆదేశించింది. ఈ ప్రక్రియలో హైడ్రా కీలకంగా వ్యవహరించనుంది. ఇటీవల హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో న్యాయపరమైన చిక్కులు లేకుండా ముందుకు వెళ్లాలని అధికారులు భావిస్తున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల నిర్ధారణ తరువాతే చెరువుల్లో ఆక్రమణల గుర్తింపు, తొలగింపుపై దృష్టి సారించే అవకాశముందని ఓ అధికారి తెలిపారు. ప్రాధాన్య క్రమంలో పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని హైడ్రా నిర్ణయించింది.

పారిశ్రామికవేత్తలకు అభివృద్ధి కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

అమ్మకాలు లేక నష్టపోయిన ఎంఎస్ఎంఈ లకు ఆర్థిక సహకారం అందించి కోలుకునేలా చేస్తామని శ్రీధర్ బాబు ప్రకటించారు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థల తరహాలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఓఎన్‌డీసీ(ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్)తో ఉచితంగా మార్కెటింగ్ చేసుకోవచ్చని తెలిపారు. తైవాన్ నుంచి పెట్టుబడులు ఆకర్షించడం లక్ష్యంగా నగరంలో తైవాన్ పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేయనున్నట్టు టీజీఐఐసీ ఎండీ విష్ణు తెలిపారు. టీజీఐఐసీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ పరిశ్రమల శాఖ, తైవాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీసీసీ) మధ్య ఎంవోయూ కుదిరింది. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ, తైవాన్ నుంచి పెట్టుబడులను రాబట్టేందుకు టీసీసీ హైదరాబాద్‌లో ప్రత్యేకంగా ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేయనుందని తెలిపారు. తైవాన్ కంపెనీలు రాష్ట్రానికి రావడంలో టీసీసీ కీలక మాధ్యమంగా నిలుస్తుందని చెప్పారు. హైదరాబాద్‌లో తైవాన్ పారిశ్రామిక పార్క్ రూపకల్పన ఇప్పటికే జరిగిందన్నారు. కాగా, ప్రభుత్వం ఇటీవలే విడుదల చేసిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) విధానంలో మహిళలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. బీసీ, దళిత పారిశ్రామిక వేత్తలకూ కొత్త విధానంలో నిర్దేశించిన ప్రయోజనాలు అందేలా చూడాలని అధికారులను కోరారు. పరిశ్రమల శాఖ జిల్లాల జనరల్ మేనేజర్ల రాష్ట్ర స్థాయి సమావేశం మంగళవారం జరిగింది. కొత్త ఎంఎస్ఎంఈ పాలసీకి సంబంధించి మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎంఈ కొత్త విధానం హ్యాండ్‌బుక్‌ను ఆవిష్కరించారు. ఎంఎస్ఎంఈ పథకాల వివరాలు, ప్రభుత్వ రాయితీలు, రుణాలు పొందేందుకు ఉండాల్సిన అర్హతలు, దరఖాస్తు చేసే విధానంతో సహా అన్ని వివరాలు హ్యాండ్ బుక్‌లో ఉన్నాయని శ్రీధర్ బాబు వెల్లడించారు. పరిశ్రమల ఏర్పాటులో వృద్ధి సాధించేందుకు కేంద్ర ప్రభుత్వ అధికారులతో కలిసి సమన్వయంతో పని చేయలని కోరారు. బీసీలు ప్రధాన లబ్దిదారులుగా ఉన్న పీఎం విశ్వకర్మ పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని సూచించారు. మరో పదేళ్లలో తెలంగాణ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడంలో పరిశ్రమల శాఖదే కీలక బాధ్యత అని చెప్పారు.

నిర్వాసితుల్ని నష్టపోనివ్వం

(మొదటి పేజీ తరువాయి)

ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించాకే చర్యలు చేపట్టాలని కోరినట్లు పేర్కొన్నాయి. మూసీ సుందరీకరణతో నిర్వాసితులయ్యే వారిని ఎలా ఆదుకోవాలన్న దానిపైనా అసద్ పలు సూచనలు చేసినట్లు తెలిసింది. కాగా, హైడ్రా కూల్చివేతలపై రెండు రోజుల క్రితం ఒవైసీ తీవ్ర వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో సీఎంతో ఆయన భేటీ ఆసక్తికరంగా మారింది. ఇక సీఎం రేవంత్ తన ఢిల్లీ పర్యటనను ముగించుకొని మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. హరియాణా ఎన్నికల ఫలితాలతో ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలు నిరాశలో కూరుకుపోవడంతో సీఎం రేవంత్ వారితో భేటీ కాలేకపోయారు. దీంతో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై చర్చలు మళ్లీ వాయిదా పడ్డాయని తెలుస్తోంది.

విజేతలకు జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానం







జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో వైభవంగా జరిగింది. 2022 సంవత్సరానికి గానూ కేంద్ర ప్రభుత్వం ఉత్తమ చిత్రాలు, నటీనటులు, సాంకేతిక నిపుణులను ఎంపిక చేసిన విషయం విదితమే. ఉత్తమ నటుడిగా రిషబ్ శెట్టి (కాంతార), ఉత్తమ నటి అవార్డును నిత్యా మీనన్ (తిరుచిత్రంబలం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్) సంయుక్తంగా రాష్టపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా నిత్యా మాట్లాడుతూ 'దాదాపు పదిహేనేళ్ల కష్టానికి తగిన ప్రతిఫలం ఇది. నా సహ నటీనటులు, 'తిరుచిత్రంబలం' యూనిట్‌కు ఈ అవార్డును అంకితం ఇస్తున్నా' అన్నారు.

ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'ఎన్నికైన 'కార్తికేయ 2' చిత్రానికి దర్శకుడు చందూ మొండేటి, నిర్మాత అభిషేక్ అగర్వాల్ అవార్డులు స్వీకరించారు. ఉత్తమ సంగీత దర్శకుడు (నేపథ్యం) అవార్డును 'పొన్నియిన్ సెల్వన్ 1' చిత్రానికి గాను అందుకొన్నారు. 'నేను అందుకొన్న ఏడవ జాతీయ అవార్డ్ ఇది. ఇన్ని అవార్డులు తీసుకోవడానికి కారణమైన ఆ భగవంతుడికి, దర్శకనిర్మాతలకు నా కృతజ్ఞతలు' అన్నారు రెహమాన్. అలాగే ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును రాష్ట్రపతి చేతుల మీదుగా మిథున్ చక్రవర్తి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మాట్లాడుతూ 'ఈ రోజు దాదాపు 85 మంది అవార్డులు స్వీకరించారు. కానీ వాళ్లలో మహిళలు కేవలం 15 మందే ఉండడం విచారకం. మహిళలు కూడా తమ ప్రతిభను ప్రదర్శించి చిత్ర పరిశ్రమలో తమ స్థానాన్ని బలపర్చుకోవాలి. సినిమాలు, సోషల్ మీడియా సమాజంలో మార్పు తీసుకువచ్చే మంచి సాధనాలుగా ఉపయోగపడాలి' అని అన్నారు.





తగ్గేదేలా!



అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న 'పుష్ప 2.. ద రూల్' చిత్రం శరవేగంతో తయారవుతోంది. ఈ సినిమా తొలి భాగం 'పుష్ప -ద రైజ్' ఘన విజయం సాధించడంతో దేశవ్యాప్తంగా అందరి దృష్టీ ఈ సినిమా మీదే ఉంది. అందుకే అంచనాలు అందుకొనేందుకు టీమ్ విశేషంగా కృషి చేస్తోంది. 'పుష్ప 2' ఫస్ట్ హాఫ్‌ను లాక్ చేశామని అంటూ కీలకమైన అప్‌డేట్‌ను మంగళవారం విడుదల చేశారు మేకర్స్. ఫస్ట్ హాఫ్ అద్భుతంగా ఉందనీ, ప్రేక్షకులు ఎంత ఊహించుకున్నా అంతకు తగ్గేదేలే లా ఉందని అంటున్నారు. ఒక పక్క చిత్రీకరణ పూర్తి చేసుకుంటూనే మరో వైపు నిర్మాణానంతర పనులు శరవేగంతో జరుపుతున్నారు. డిసెంబర్ 6న చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాతలు ఇప్పటికే ప్రకటించారు. రష్మిక కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని నవీన్ యర్నేని, రవిశంకర్ నిర్మిస్తున్నారు.

నిజమే గెలిచింది



తనతో పెళ్లికి నిరాకరించిందంటూ కథానాయిక మాల్వీ మల్హోత్రాపై కత్తితో దాడికి పాల్పడిన ఘటనలో నిర్మాత యోగేశ్ సింగ్‌ను దోషిగా తేల్చిన ముంబై కోర్టు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తున్నట్లు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుపై మాల్వీ ఆనందం వ్యక్తం చేశారు. తన పోరాటం ఫలించిందని సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 'ఈ పోరాటంలో ఎన్నో ఒత్తిళ్లు, ఇబ్బందులు ఎదుర్కొన్న నాకు తీర్పుతో ఉపశమనం లభించింది. నాలుగేళ్లుగా పోరాడుతున్నాను. ఎట్టకేలకు నిజం గెలిచింది. న్యాయం దక్కేవరకూ పోరాడే శక్తినిచ్చిన అమ్మవారికి ధన్యవాదాలు' అని మాల్వీ పేర్కొన్నారు. 2020లో తనతో పెళ్లికి నిరాకరించిందనే కారణంతో మాల్వీని అడ్డగించిన యోగేశ్ కత్తితో దాడి చేశాడు.

సమంతతో కలసి నటించాలనుంది

అలియా భట్



ఆలియా భట్, వేదాంగ్ రైనా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జిగ్రా'. వాసన్ బాల దర్శకత్వంలో కరణ్‌జోహార్, అపూర్వ మెహతా, ఆలియా భట్, సౌమెన్ మిశ్రా నిర్మించారు. ఇటీవలే ఈ సినిమా ట్రైలర్‌ను రాజమౌళి, రామ్‌చరణ్ విడుదల చేశారు. ఈ నెల 11న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించగా.. ముఖ్య అతిథులుగా త్రివిక్రమ్, రానా దగ్గుబాటి, సమంత విచ్చేశారు. ఈ కార్యక్రమంలో సమంత మాట్లాడుతూ "ఆలియా నటనంటే నాకు చాలా ఇష్టం. ఈ సినిమా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. తెలుగు ప్రేక్షకుల ప్రేమను అలియా ఈ సినిమాతో మరోసారి సంపాదించుకుంటారు" అని చెప్పారు. "ఆన్ స్క్రీన్, ఆఫ్ స్క్రీన్ సమంత ఓ హీరో. సమంతతో కలసి నటించాలనుంది. నాకు, ఆమెకు సరిపడా స్క్రిప్ట్‌ను త్రివిక్రమ్ రాస్తే బాగుండనిపిస్తోంది. ఇది యాక్షన్, డ్రామా, ఎమోషన్ ఉన్న ఇంటెన్స్ సినిమా" అని ఆలియా భట్ అన్నారు.

ఇద్దరూ నాకు ఇష్టమైన హీరోయిన్లే!



నాకు ఇష్టమైన ఇద్దరు హీరోయిన్లు అలియాభట్, సమంత ఇక్కడే ఉన్నారు. ఈ సినిమా ట్రైలర్ అదిరిపోయింది. ట్రైలర్ చూస్తుంటే సినిమా పక్కా బ్లాక్‌బస్టర్ అవుతుందని అనిపిస్తోంది. రజనీకాంత్ అన్ని భాషల్లోనూ అభిమానుల్ని సంపాదించుకున్నారని తెలిసిందే. సమంత కూడా అలాగే అన్ని భాషల్లోని అభిమానుల మనసును గెలుచుకున్నారని అనిపిస్తోంది. సమంత ముంబయిలోనే కాకుండా హైదరాబాద్‌కు కూడా అప్పుడప్పుడూ వస్తే బాగుంటుంది. సమంత నటిస్తానంటే.. ఆమె కోసం రాయడానికి సిద్ధం. 'అత్తారింటికి దారేది' లాగా.. సమంత హైదరాబాద్‌కు రావాలంటే 'హైదరాబాద్‌కు దారేది' అనాలేమో. సమంత మూవీ సెట్స్‌లో ఓ డైనమేట్‌లా ఉంటారు. ఈ కార్యక్రమంలో అలియా కూడా డైనమేట్‌లా కనిపిస్తున్నారు" అని చెప్పారు.

ప్రసాదంతో పాటు.. మొక్కలు ఇవ్వండి..

- డిప్యూటీ సీఎం పవన్‌కు షిండే సూచన



ఆలయాల్లో ప్రసాదంతో పాటు ఒక మొక్క కూడా భక్తులకు ఇస్తే పచ్చదనాన్ని పెంపొందించవచ్చు అనే షాయాజీ షిండే సూచనను స్వాగతిస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తెలిపారు. మంగళగిరిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ప్రముఖ నటుడు షిండే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఆలోచనలు విన్నపవన్‌కళ్యాణ్ ఇది అభినందనీయమైన ఆలోచన అని కొనియాడారు. ఆయనచేసిన సూచనల అమలుపై సీఎం చంద్రబాబు చర్చిస్తామని చెప్పారు. వృక్షప్రసాద్ యోజనను మహారాష్ట్రలో మూడుప్రముఖ ఆలయాల్లో అమలు చేస్తున్నారని షిండే వివరించారు. వాటి విశిష్టతగురించి మరాఠీలో రాసుకున్న కవితను పవన్‌కళ్యాణ్‌కు చదివి వినిపించారు. ఈ కవితనుపవన్ కళ్యాణ్‌ప్రశంసిస్తూ ఆ మరాఠీ కవితను తెలుగులోఅనువదించి చెప్పారు.

- అమరావతి (ఆంధ్రజ్యోతి)

బామ్మను విమర్శించిన వ్యక్తికి అవార్డా?



కర్నాటక గాత్ర విద్వాంసుడు టీఎం కృష్ణకు ఈ యేడాది 'సంగీత కళానిధి' అవార్డును ప్రదానం చేయాలని మ్యూజిక్ అకాడమీ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ దివంగత కర్నాటక సంగీత దిగ్గజం ఎమ్మెస్ సుబ్బలక్ష్మి మనవడు వి. శ్రీనివాసన్ మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. గతంలో తన బామ్మను తీవ్రంగా విమర్శించడంతో పాటు హేతువాదిగా ఉంటున్న కృష్ణన్‌కు ఆ అవార్డును ప్రదానం చేయడం తగదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఎమ్మెస్ సుబ్బులక్ష్మిని స్మరిస్తూ చెన్నైలోని మ్యూజిక్ అకాడమీ, ప్రముఖ ఆంగ్ల పత్రిక నిర్వాహకులు కలిసి 2005 నుంచి ప్రతియేటా ఆమె పేరుతో సంగీత కళానిధి అవార్డులను ప్రదానం చేయడం ఆనవాయితీ అని, అయితే ఆమెను తీవ్రంగా విమర్శించిన కృష్ణన్‌కు ఈ సారి అవార్డును ప్రదానం చేయకుండా ఉత్తర్వులివ్వాలని పిటిషన్‌లో అభ్యర్థించారు.

-చెన్నై(ఆంధ్రజ్యోతి)

జానీ మాస్టర్ బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ



మహిళా కొరియోగ్రాఫర్‌పై అత్యాచారం కేసులో పోక్సో చట్టం కింద అరెస్టై జైల్లో ఉన్న టాలీవుడ్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై విచారణను రంగారెడ్డి జిల్లా కోర్టు బుధవారానికి వాయిదా వేసింది. ఉత్తమ కొరియోగ్రాఫర్‌గా జానీ మాస్టర్‌కు లభించిన అవార్డును కమిటీ తాత్కాలికంగా నిలిపివేసిన నేపథ్యంలో తమకు మంజూరు చేసిన మధ్యంతర బెయిల్ అవసరం లేదని ఆయన తరపు న్యాయవాది కోర్టులో మెమో దాఖలు చేశారు. దీంతో జానీ మాస్టర్‌కు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను రద్దు చేయాలంటూ వేసిన పిటిషన్‌ను నార్సింగి పోలీసులు వెనక్కి తీసుకున్నారు. జాతీయ పురస్కార అందుకునేందుకు ఢిల్లీకి వెళ్లేందుకు ఈ నెల 6 నుంచి 9 వరకూ జానీ మాస్టర్‌కు మధ్యంతర బెయిల్ లభించింది. అయితే అవార్డును నిలిపివేయడంతో జానీ మాస్టర్ రిమాండ్‌లోనే కొనసాగుతున్నారు.

నాగసాధు పాత్రలో తమన్నా



'ఓదెల రైల్వే స్టేషన్' చిత్రానికి సీక్వెల్‌గా రూపుదిద్దుకుంటున్న 'ఓదెల 2' చిత్రం షూటింగ్ కొనసాగుతోంది. మహాదేవుని ఆశీస్సులతో వారణాసిలో ప్రారంభమైన ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం ఓదెల మల్లన్న క్షేత్రంలో జరుగుతోంది. తన కెరీర్‌లోనే తొలిసారిగా తమన్నా ఇందులో శివశక్తి(నాగసాధు) పాత్ర పోషిస్తున్నారు. ఆమెతో పాటు మురళీశర్మ, హెబ్బా పటేల్ తదితరులు షూటింగ్‌లో పాల్గొంటున్నారు. మల్లన్న ఆలయం, ఓదెల గ్రామంలోని అందమైన ప్రదేశాల్లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. దర్శకుడు సంపత్‌నంది పర్యవేక్షణలో అశోక్ తేజ రూపొందిస్తున్న ఈ చిత్రాన్ని డి. మధు నిర్మిస్తున్నారు.

నవ్వుల్లో ముంచెత్తుతుంది

గోపిచంద్



"విశ్వం' సినిమాతో పాత శ్రీను వైట్లను మళ్లీ చూడబోతున్నారు. ఈ సినిమాలో యాక్షన్, ఫన్, కామెడీ అద్భుతంగా వచ్చాయి. ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తారు. 'విశ్వం' ఆద్యంతం నవ్వుల్లో ముంచెత్తుతుంది' అని హీరో గోపిచంద్ అన్నారు. ఆయన కథానాయకుడిగా శ్రీను వైట్ల దర్శకత్వం వహించిన చిత్రమిది. . టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ నెల 11న విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా గోపిచంద్ మాట్లాడుతూ 'విశ్వప్రసాద్ గారి వల్ల సినిమాకు మరింత బలం చేకూరింది. శ్రీనువైట్ల స్క్రిప్ట్ మీద ఏడు నెలలు పని చేశారు. ఆయనతో పని చేయడాన్ని ఆస్వాదించాను' అని చెప్పారు. శ్రీను వైట్ల మాట్లాడుతూ 'రెండున్నర గంటల్లో ఒక్క సెకన్ కూడా బోర్ కొట్టదు. విశ్వ ప్రసాద్, వేణు నిర్మాణంలో రాజీ పడలేదు. ఈ హిట్‌తో దసరాని ఎంజాయ్ చేయబోతున్నాం' అని చెప్పారు. 'నేను అమెరికాలో ఉన్నప్పుడే శ్రీను వైట్ల గారి సినిమాలు బాగా చూసేవాణ్ణి. ఇప్పుడు ఆయనతో ఈ సినిమా చేయడం చాలా ఆనందాన్నిచ్చింది. పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రమిది' అని టీజీ విశ్వప్రసాద్ తెలిపారు. 'విశ్వం పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్, ప్రేక్షకులకు పండుగ ఆనందాన్ని రెట్టింపు చేస్తుంది' అని కావ్యథాపర్ తెలిపారు.



ఇన్ ప్రోగ్రెస్

అన్ని వర్గాల వారిని ఆకట్టుకునేలా...



నూతన దర్శకుడు సందీప్ రెడ్డి బండ్ల తెరకెక్కించిన ఫ్యామిలీ డ్రామా 'జనక అయితే గనక. సుహాస్, సంగీర్తన జంటగా నటించిన ఈ చిత్రాన్ని హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దర్శకుడు సందీప్ మీడియాతో ముచ్చటించారు.

"ఇది అన్ని వర్గాల వారికి కనెక్ట్ అవుతుంది. హెల్దీ హ్యూమర్, అర్థవంతమైన సంభాషణలు, బరువైన భావోద్వేగాలతో నిండిన చిత్రమిది. ఈ జనరేషన్ వారి ఆలోచనలను తెరపై అర్థవంతంగా చూపించేలా సినిమా ఉంటుంది. పెళ్లి చేసుకోవడం.. పిల్లల్ని కనడం అనేవి యూనివర్సల్ ఎమోషన్స్.. వీటిని ఆధారం చేసుకుని ఓ కీలకమైన మలుపు జోడించి కథ రాసుకున్నాను. సుహాస్ నటన ఈ సినిమాకు ఎస్సెట్. విజయ్ బుల్గానిన్ అద్భుతమైన సంగీతం ఇచ్చారు. సినిమాటోగ్రాఫర్.. ఎడిటర్.. ఆర్ట్ డైరెక్టర్.. ఇలా ప్రతీ ఒక్కరు ప్రాణం పోసి పని చేశారు. చిత్రం అన్ని వర్గాల వారిని తప్పకుండా ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది" అని చెప్పారు.

క్లైమాక్స్ చిత్రీకరణలో...



'స్నేహితులు' ఫేమ్ శ్రీరామ్, శ్రుతి మీనన్, ఆరుషి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కోడిబుర్ర. చంద్రశేఖర్ కానూరి దర్శకత్వంలో కంచర్ల సత్యనారాయణరెడ్డి, గట్టు విజయ్‌గౌడ్, చిన్ని చందు, వట్టం రాఘవేంద్ర, సముద్రాల మహేశ్ గౌడ్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం సెకండ్ షెడ్యూల్‌లో భాగంగా క్లైమాక్స్‌ను చిత్రీకరిస్తున్నారు. యాక్షన్‌తో నిండిన ఈ సన్నివేశాలు సినిమాకు కీలకమని మేకర్స్ తెలిపారు. ఎడిటర్: గ్యారీ బీ.హెచ్, సినిమాటోగ్రఫీ: కల్యాణ్‌శ్యామ్, సంగీతం: సుకుమార్ రాగ.

సరికొత్త ప్రపంచంలోకి



జీవా, అర్జున్ సర్జా హీరోలుగా పా. విజయ్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై డాక్టర్ ఈశారి కె. గణేశ్ నిర్మిస్తున్నారు. 'అఘతియా' అనే టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేశారు. చిత్రబృందం మంగళవారం ఫస్ట్‌లుక్‌ను ఆవిష్కరించింది. ఈ సందర్భంగా పా. విజయ్ మాట్లాడుతూ 'ఇంతకు ముందెన్నడూ చూడని ప్రపంచంలోకి చేసే అద్భుత ప్రయాణాన్ని ఈ చిత్రం ఆవిష్కరిస్తుంది. సీజీ విజువల్స్ అలరిస్తాయి' అని చెప్పారు. రాశీఖన్నా, మటిల్డా కీలకపాత్రలు పోషిస్తున్నారు. యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: దీపక్‌కుమార్ పతి

దీపావళి బరిలో పొట్టేల్



అజయ్, యువచంద్రకృష్ణ, అనన్య నాగళ్ల ప్రధాన తారాగణంగా రూపొందుతున్న గ్రామీణ నేపథ్య చిత్రం 'పొట్టేల్'. సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో సురేశ్‌కుమార్ సడిగె నిర్మిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. దీపావళి సందర్భంగా ఈ నెల 25న విడుదల చేస్తున్నట్లు నిర్మాత ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్స్‌లో అనన్య నాగళ్ల, యువచంద్రకృష్ణ మాస్ పాత్రల్లో కనిపించారు. ప్రియాంక శర్మ కీలకపాత్ర పోషిస్తున్నారు. సంగీతం: శేఖర్ చంద్ర, సినిమాటోగ్రఫీ: మోనిష్ భూపతి రాజు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
బుధవారం 9 అక్టోబరు 2024

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు పూర్తి

వరంగల్ మేయర్ గుండు సుధారాణి ● నగరంలోని పలు చెరువుల వద్ద ఏర్పాట్ల పరిశీలన

వేడుకలకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచన



1లో..



పల్లెలకు పైసలొచ్చినయ్

పంచాయతీలకు కాస్తంత ఊపిరి పోసిన రాష్ట్ర ప్రభుత్వం

- ఉమ్మడి జిల్లా జీపీలకు రూ.20కోట్ల పైచిలుకు మంజూరు
- జనాభా ఆధారంగా కేటాయింపు
- ఒకట్రెండురోజుల్లో ఖాతాల్లో జమ
- 'స్వచ్ఛదనం-పచ్చదనం'కు వి నియోగించాలని సూచన

హనుమకొండ టౌన్, అక్టోబరు 8: నిధులు లేమితో తల్లడిల్లుతున్న పల్లెలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసి ప్రాణం పోసింది. ఇప్పటికే గ్రామ పంచాయతీల ఖాతాలో చెక్కులు పడగా ఒకటి రెండు రోజుల్లో ఆ నిధులు మంజూరు కానున్నాయి. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ జిల్లాల గ్రామ పంచాయతీల్లో జరిగిన పనులకు మోక్షం కలగనుంది. అయితే ఈ నిధులను గ్రామ పంచాయతీ కార్మికులతో పాటు వాహనాల ఈఎంఐ, 'స్వచ్ఛదనం- పచ్చదనం'కు వి నియోగించాలని సర్కారు షరతు విధించింది.

చాలా రోజులకు..

కేంద్ర, రాష్ట్ర ఫైనాన్స్ నిధులు నిలిపివేసినప్పటి నుంచి పల్లెల్లో అభివృద్ధి కుంటుపడింది. దానికి తోడు పంచాయతీల్లో సర్పంచ్‌లు లేకపోవడంతో ఇంటికి పెద్ద దిక్కు లేకుండాపోయింది. అప్పటి నుంచి పల్లెల బాగోగులు పట్టించుకునే నాథులు లేకుండాపోయారు. దీంతో పల్లెల్లో అభివృద్ధికి ఆటంకం ఏర్పడింది. పల్లె అభివృద్ధి భారమంతా కార్యదర్శులపై పడడంతో వారికి తలకు మించిన భారమైంది. దీనిపై 'ఆంధ్రజ్యోతి' పత్రికలో ప్రత్యేక కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ క్రమంలో ఎట్టకేలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేయగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 1,688 గ్రామ పంచాయతీలకు సుమారు రూ.20 కోట్లు పైచిలుకు నిధులను ప్రభుత్వం విడుదల చేసింది.

జనాభా ఆధారంగా నిధులు

ఆగస్టు 5న 'స్వచ్ఛదనం - పచ్చదనం' పేరుతో ఐదు రోజుల కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కార్యక్రమ నిర్వహణకు మాత్రం ఎలాంటి నిధులు ఇవ్వకుండా కార్యదర్శులు జేబులో నుంచి ఖర్చు పెట్టాలని ఆదేశించింది. చేసేదేమీ లేక స్వతహాగా ఖర్చుచేసి ఐదు రోజుల కార్యక్రమాలను నిర్వహించారు. ఈ ఖర్చును ఇప్పుడు ప్రభుత్వం ఆయా గ్రామ పంచాయతీలకు జనాభా ఆధారంగా అందజేస్తుంది. 3వేల వరకు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.50,000, 3వేల నుంచి 8వేల వరకు ఉన్న గ్రామ పంచాయతీలకు రూ.75,000, 8 వేలకు పైగా ఉన్న పంచాయతీలకు రూ.లక్ష చొప్పున కేటాయించింది. ఒకటి రెండు రోజుల్లో ఆయా గ్రామ పంచాయతీల్లోని ఖాతాల్లో ఈమొత్తం జమకాబోతుందని జిల్లా పంచాయతీ అధికారులు పేర్కొంటున్నారు.

కార్మికుల్లో ఆనందం

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,688 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో 6,995 మంది కార్మికులు వి ధులు నిర్వర్తిస్తున్నారు. పంచాయతీ ఆదాయన్ని బట్టి కొంత మందికి 6 నెలల జీతం పెండింగ్‌లో ఉండగా, మరో కొంత మందికి రెండు, మూడు నెలల జీతం పెండింగ్ ఉంది వీరందరికీ కలిపి ప్రసుత్తం ప్రభుత్వం విడుదల చేసిన నిధుల్లో నుంచి ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు వేతనాలు అందజేయనున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో కొంత కాలంగా వేతనాల కోసం ఎదురుచూస్తున్న హనుమకొండలోని 1006 కార్మికులు, జనగామలో 1,209, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1,033, మహబూబాబాద్ జిల్లాలో 1,781, ములుగులో 806, వరంగల్‌లో 1,160 మెత్తం కలిపి 6,995 మంది కార్మికులు దసరా పండుగ ముందు వేతనాలు అందుకోనున్నారు.

సరిపోని నిధులు

ప్రస్తుతం విడుదల చేసిన నిధులతో కొంత ఉపశమనం దొరుకుంతుంది కానీ పూర్తిగా పంచాయతీల్లోని నిధుల లేమిని పూడ్చలేదని కార్యదర్శులు తెలుపుతున్నారు. సెంట్రల్, స్టేట్ ఫైనాన్స్ నిధులు ఆపివేయడంతో రోజు వారి కార్యక్రమాల నిర్వహణ ఇబ్బందిగానే మారిందంటున్నారు. జేపీఎస్, ఓపీఎస్ కార్యదర్శుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. సర్పంచ్‌లు వస్తే కానీ కార్యదర్శుల ఇబ్బందులు తొలగవని చాలా మంది కార్యదర్శులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వారిగా విడుదల చేసిన నిధులు (రూ.కోట్లలో)

జిల్లా	జీపీల సంఖ్య	నిధులు
హనుమకొండ	208	2,75,05,217
వరంగల్	323	3,23,44,427
జనగామ	281	3,81,31,080
మహబూబాబాద్	461	5,37,24,129
జయశంకర్ భూపాలపల్లి	241	2,70,26,027
ములుగు	174	2,17,03,374

జీపీ ఖాతాల్లో జమ చేస్తున్నాం..



లక్ష్మీరమాకాంత్,
హనుమకొండ జిల్లా డీపీవో

ప్రభుత్వం నిధులు వి డుద ల చేసింది. ట్రెజరీ ద్వారా గ్రామ పంచాయతీ ఖాతాల్లో కి నిధులు వెళ్లాయి. గ్రామ పంచాయతీ వాహనాల ఈఎంఐతోపాటు స్వచ్ఛదనం- పచ్చదనం, కార్మికుల వేతనాలు, విద్యుత్ బిల్లుల చెల్లింపుకు నిధులను వినియోగించుకోవచ్చు.

అభ్యర్థుల్లేక ఆగిన పోస్టులు 59

నేడు హైదరాబాద్‌కు కొత్త టీచర్ల పయనం

9లో..

వరంగల్ ఏసీపీపై వేటు?

- రంగం సిద్ధం చేసిన ఉన్నతాధికారులు
- ఇప్పటికే ఇద్దరు సీఐలపై క్రమశిక్షణ చర్యలు
- ప్రైవేటు వ్యక్తులకు అంటకాగిన ఫలితం

వరంగల్ క్రైం, అక్టోబర్ 8: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్ డివిజన్ ఏసీపీ నందిరాంనాయక్‌పై బదిలీ వేటు పడనున్నట్లు అధికారిక సమాచారం. ఒకటిరెండు రోజుల్లో ఆయనపై వేటు వేసి కొత్త ఏసీపీని నియమించేలా చర్యలు ప్రారంభమైనట్లు తెలిసింది. ఇప్పటికే వరంగల్ డివిజన్‌లోని ఇద్దరు సీఐలపై బదిలీ వేటుపడగా, ఏసీపీపై కూడా బదిలీ వేటు పడనుందనే ప్రచారం జోరుగా సాగుతోంది.

నేతల సేవల ఫలితం

వరంగల్ పోలీసు డివిజన్ పరిధిలోని ఏసీపీతో పాటు ఇద్దరు సీఐలు ప్రైవేటు వ్యక్తుల పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనడం, దైవ దర్శనాలకు ఎస్కార్ట్‌గా వెళ్లడం వివాదాస్పదమైంది. ఈ విషయమై సీపీ అంబర్ కిషోర్ ఝా విచారణకు ఆదేశించారు. విచారణలో భాగంగా మిల్స్‌కాలనీ, ఇంతేజార్‌గంజ్ సీఐలు మల్లయ్య, శివకుమార్‌లపై వేటు పడింది. ఇద్దరిపై బదిలీ వేటు వేసి ఏసీపీని మినహాయించారనే ప్రచారం జరిగింది. ప్రైవేటు వ్యక్తులు ఏసీపీ బదిలీ కాకుండా కాపాడుతున్నారనే వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏసీపీపై బదిలీ వేటు వేయాలని శాఖ అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఒకటి రెండురోజుల్లో ఏసీపీపై బదిలీ వేటుపడే అవకాశం ఉన్నట్లు అధికారిక సమాచారం. కాగా కొత్త ఏసీపీ నియామకం సైతం జరిగే అవకాశం ఉన్నట్లు తెలిసింది. మొత్తంగా వరంగల్ డివిజన్ పోలీసు అధికారులు ప్రైవేటు వ్యక్తులకు అధికారిక సేవలు అందించి క్రమశిక్షణా చర్యలకు గురికావడం చర్చనీయాంశంగా మారింది.

సీపీకి తలనొప్పి

కమిషనరేట్ పరిధిలోని పలువురు పోలీసు అధికారుల తీరు సీపీ అంబర్ కిషోర్ ఝాకు తలనొప్పిగా మారింది. పలువురు పోలీసు అధికారుల దందాలు, పోస్టింగ్‌ల కోసం ప్రైవేటు వ్యక్తులకు సేవలు చేయడం, ఇతరత్రా విషయాలు ఎక్కువ కావడం ఇబ్బందికరంగా మారినట్లు తెలిసింది. ఈ విషయాలను కట్టడి చేయడం సీపీవల్ల కావడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాప్రతినిధుల జపం చేస్తున్న పోలీసు అధికారులు సీపీ ఆదేశాలు సైతం లెక్కచేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజువారిగా సమీక్షలు జరుపుతూ ప్రక్షాళన చేసేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోతోందనే విమర్శలున్నాయి. దందాలు చేసే పోలీసుల వైఖరి విషయంలో ప్రజాప్రతినిధులు సైతం సీపీపై గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. ప్రైవేటు వ్యక్తికి గన్‌మెన్‌లు ఇవ్వడం, అతడికి పోలీసులు సేవలు చేయడంపై అధికార పార్టీ ఎమ్మెల్యే ఒకరు సీపీపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కమిషనరేట్ పరిధిలో ప్రధానంగా వరంగల్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారుల తీరుపై సీఎం పేషీ నుంచి ఆరా తీసినట్లు తెలిసింది. మొత్తంగా కమిషనరేట్ పరిధిలోని కొంతమంది అధికారుల తీరు శాఖకు మచ్చతేవడంతో పాటు సీపీకి తలనొప్పిగా మారడం గమనార్హం.



భవానీమాతగా భద్రకాళి

ఆరో రోజుకు దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 8: వరంగల్‌లోని భద్రకాళి దేవస్థానంలో దేవీ నవరాత్రి వేడుకలు మంగళవారానికి ఆరోరోజుకు చేరాయి. ఉదయం నిత్య పూజల అనంతరం అమ్మవారిని భవానిమాతగా అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదగిరిగుట్ట దేవస్థానం చైర్మన్ నర్సింహమూర్తి గంధోత్సవాన్ని నిర్వహించి సాలాబంజిక సేవ జరిపారు. ఈవో శేషు భారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భద్రకాళి సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. మేయర్ గుండు సుధారాణి అమ్మవారిని దర్శించుకొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా, నేడు మూల నక్షత్రం సందర్భంగా అమ్మవారిని సరస్వతి మాతగా అలంకరిస్తారు.

పూలను పూజించే గొప్ప పండుగ బతుకమ్మ

ఎంపీ డాక్టర్ కడియం కావ్య ● కలెక్టరేట్‌లో ఘనంగా వేడుకలు




వేడుకలను ప్రారంభిస్తున్న ఎంపీ కావ్య, కలెక్టర్ ప్రావీణ్య, ఎమ్మెల్యే నాయిని, బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

న్యూశాయంపేట, అక్టోబరు 8: పువ్వులను దేవత లుగా పూజించే గొప్ప పండుగ బతుకమ్మని ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో మంగళవారం రాత్రి బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. వివిధ శాఖలకు చెందిన ఉద్యోగినులు పెద్ద ఎత్తున పాల్గొని అందంగా పేర్చిన బతుకమ్మలతో ఆడిపాడి సందడి చేశారు. బతుకమ్మ పాటలకు చేసిన నృత్యాలు తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించాయి. డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి బతుకమ్మకు స్టెతస్కోప్ పెట్టి తీసుకురావడం ఆకర్షణీయంగా నిలిచింది. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. మహిళల్ని శక్తి రూపంగా పూజించే గొప్ప సంస్కృతి మనదన్నారు. మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ వేడుకలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. యేటా కలెక్టరేట్‌లో ఉద్యోగినులు బతుకమ్మ ఆడటం గొప్ప విషయమన్నారు. కలెకర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. మహిళలందరూ ఆనందంగా పండుగ జరుపుకోవాలన్నారు. టీఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఎన్నమనేని జగన్‌మోహన్‌రావులు మాట్లాడుతూ.. యేటా కలెక్టరేట్‌లో నిర్వహించే వేడుకలకు ఉద్యోగినులు పాల్గొని విజయవంతం చేస్తున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌వో వై.వి.గణేష్, కలెక్టరేట్ ఏవోసత్యనారాయణ, ట్రెసా అధ్యక్షుడు భాస్కర్, డీఎంహెచ్‌వో లలితాదేవి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దాస్యనాయక్, ఉద్యోగ సంఘాల నాయకులు బైరి సోమయ్య, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, పుల్లూరు వేణుగోపాల్, పనికెల రాజేష్, శ్యాంసుందర్, కత్తి రమేష్, రాజీవ్, పృథ్వీ, అనూప్, రాజ్యలక్ష్మీ, శ్రీలత, పావని, సింధూరాణి, రజిత, సరస్వతి, యమున, రాజమణి, శిరీష, కార్పొరేటర్ మానస రాంప్రసాద్‌తోపాటు వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగినులు పాల్గొన్నారు.



హసన్‌పర్తి పెద్ద చెరువులో చేప పిల్లలను కలుపుతున్న ఎమ్మెల్యే నాగరాజు

హైడ్రా తరహాలోనే వరంగల్‌లో వాడ్రా

- చెరువులు మింగిన ఘనులపై చర్యలు తప్పవు
- హసన్‌పర్తి ముదిరాజ్ సభలో ఎమ్మెల్యే నాగరాజు
- పెద్దచెరువులో 40వేల చేప పిల్లల విడుదల

1లో..



బాలుర స్టీపుల్‌చెజ్ విజేతలతో నాగపురి రమేష్, దీప్తి జీవంజి, నిర్వాహకులు

పేదరికం అడ్డురాలే.. వైకల్యంతో కుంగిపోలే

- పట్టుదల, క్రమశిక్షణతో కాంస్యం సాధించింది..
- క్రీడాకారులు దీప్తిని స్ఫూర్తిగా తీసుకోవాలి
- అథ్లెటిక్స్ పోటీల ముగింపులో చీఫ్ కోచ్ నాగపురి రమేష్

9లో..

న్యాయశాస్త్రం సెమిస్టర్ పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్, అక్టోబరు 8: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో అక్టోబరు 16 నుంచి జరగాల్సిన న్యాయశాస్త్రం సెమిస్టర్ పరీక్షలను గ్రూప్-1 పరీక్షల నేపథ్యంలో వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాయిదా పడిన పరీక్షల్లో ఎల్ఎల్‌బీ మూడేళ్ల కోర్సు రెండో సెమిస్టర్, ఎల్ఎల్‌బీ ఐదేళ్ల కోర్సు ఆరో సెమిస్టర్ అలాగే ఎల్ఎల్ఎం రెండో సెమిస్టర్ పరీక్షలున్నాయని వివరించారు.

సత్తెమ్మ పాట.. రాగాల పూదోట..

కష్టసుఖాల దొంతరలే ఆమె పాటలకు రూపం
ఆకాశవాణిలో ఆలపించిన బతుకమ్మ పాటలు
ఆడియో క్యాసెట్లుగా రూపాంతరం

లింగాలఘణపురం, అక్టోబరు 8:సాహిత్య లోకమెరుగని కళాపిపాసి ఆమె.. ఆమె కైకట్టి పాడే ప్రతీ పాట లక్షల ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తుంది. సుస్వరాలు ఎరుగకపోయినా.. అక్షరం ముక్క నేర్వక పోయినా.. బడుగుల కష్టాలను ఒక్కటిగా పోగు చేసినట్టు.. జనజీవన శ్రమైకంలో చిందించే చెమట చుక్కలు రాశులుగా పేర్చినట్టు.. అభాగ్యుల కన్నీటి ధారలను ఒడిసిపట్టి బతుకమ్మ పాట రూపంలో బడుగులకు బతుకు నేర్పుతుంది. జీవితంలో ఎదురయ్యే కష్టం.. సుఖం.. మనోల్లాసానికి ఉపయుక్తమయ్యే ఆటలు.. పాటలు.. ఇలా అన్నీ కలబోసి ఆమె నోట వెలువడే బతుకమ్మ పాట బడుగుల బతుకులకు కొత్త ఊపిరిలూదుతోంది. కనుమరుగవుతున్న సాంస్కృతిక సంరంభాన్ని నాలుగు బాటల వద్ద నిటారుగా నిలబెట్టినట్టు పాడే ఆమె ఉయ్యాల పాట బతుకు భరోసాకు సరికొత్త ఊటగా ఉత్సాహాన్నిస్తుంది. ఆమె కంఠం ఓ ఘంటానాదం.. రాగరంజితాన్ని రంగరించుకున్న ఆమె పాట సెలయేటి ఊటై బడుగుల బతుకులకు భాష్యం నేర్పుతోంది. ఆమే.. లింగాలఘణపురం మండలం నెల్లుట్లకు చెందిన కడకంచి సత్తెమ్మ ఉరఫ్ ఉయ్యాల పాటల సత్తెమ్మ. సత్తెమ్మ రాగం పల్లె బతుకుల జీవన గానం.. కనుమరుగవుతున్న సంస్కృతీ సంప్రదాయాలకు పునరుజ్జీవం పోస్తున్న కళాతపస్వి ఆమె. గడిచిన 60 ఏళ్లుగా నవతరానికి బతుకమ్మ పాటలను నేర్పుతూ బతుకు భాష్యానికి నాందిగా.. సంస్కృతీ సాంప్రదాయాలకు దిక్సూచిగా నిలుస్తోంది. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయల వైభవం.. బతుకమ్మ వేడుకల సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం. సత్తెమ్మ గళమెత్తిందంటే చాలు ఇంటి ముంగిళ్లలో గుసగుసలాడే అతివలంతా ఆమె దరికి చేరాల్సిందే. అలా వచ్చిన వాళ్లంతా ఆమె పాటకు వంతపాటాడాల్సిందే. అదే సత్తెమ్మ ప్రత్యేకత.

కన్నీటి కష్టాలే.. బతుకమ్మ పాటలుగా..

అక్షరజ్ఞానం అసలే ఎరుగని సత్తెమ్మ తన చుట్టూ నిత్యం ఎదుర్కొంటున్న కష్టాలను.. తోటి వారు ఎదుర్కొంటున్న బాధలను తన జీవితంలో ఎదురైన ఇబ్బందుల సారాన్ని పాటల రూపంలో మలచడం సత్తెమ్మ ప్రత్యేకత. ప్రతీ ఏటా స్వగ్రామం నెల్లుట్లలో మహాలయామావాస్య రోజు జరిగే ఎంగిలి బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ దాకా సత్తెమ్మతో పాటలను పాడించుకునేందుకు స్థానికులు ఉవ్విళ్లూరుతుంటారు.

ఎల్లలు దాటిన.. సత్తెమ్మ పాటలు..

బతుకమ్మ పాటలతో పరిచయమైన సత్తెమ్మ తన పాటల తూటాలను వరంగల్ ఆకాశవాణిలో ఉర్రూతలూగించింది. అంతటితో ఆగకుండా తన పాటల ప్రవాహాన్ని ఒగ్గు కళాసామ్రాట్ చుక్క సత్తయ్య, బుగ్గ మల్లయ్య ప్రోత్సాహంతో ఆడియో రికార్డింగ్‌ను కూడా చేయించారు. ఒంగూరి మల్లేశ్‌యాదవ్ నిర్మాణంలో బతుకమ్మ పాటలతో పాటుగా రేణుకా ఎల్లమ్మ, సమ్మక్క సారలమ్మ, మాంధాత, పార్వతీ, బీరప్ప, పెద్దిరాజు, గంగురాజు, శ్రీదేవి, వన్నెల అక్కమ్మ, మల్లన్న, వేములవాడ రాజన్నకు చెందిన పురాణ కథలను అనర్గలంగా చెబుతూ సత్తెమ్మ తన ప్రావీణ్యాన్ని వేనోళ్ల చాటుతోంది. సత్తెమ్మ పాడిన ఉయ్యాల పాటలు, బతుకమ్మ పాటలు క్యాసెట్లు, సీడీల రూపంలో తయారై ఎంతో మందికి సాంస్కృతిక సంబరాన్ని పంచిస్తోంది. తెలంగాణ స్వరాష్ట్రంలో బతుకమ్మ పాటలకు విశేష ఆదరణ లభిస్తుందని ఆనందం వ్యక్తం చేస్తుంది.



20వ ఏట నుంచి పాటల తూటాగా ఎదిగి..

సత్తెమ్మ తన 20వ ఏట నుంచే పాటల తూటగా ఎదిగింది. ప్రస్తుతం 80 ఏళ్ల వయసున్న సత్తెమ్మ గళం ఇప్పటికీ ఓ ఘంటారావమై మారుమ్రోగుతుంది. వయసు మీదపడ్డా తన కంఠంలో పదును ఏమాత్రం తగ్గలేదని, ఏటేటా పాటల సవ్వడిలో నిత్యనూతనమే నంటూ నిరూపిస్తుంది. జనగామ మండలం గానుగుపహాడ్‌కు చెందిన సత్తెమ్మకు చిన్నతనంలో 10వ ఏటలోనే నెల్లుట్లకు చెందిన కడకంచి బీరయ్యతో బాల్యవివాహం జరిగింది. పెళ్లైన 10 ఏళ్ల తర్వాత తన పాటకు పదును పెట్టి 60 ఏళ్లుగా వెనకకు తిరగకుండా బతుకమ్మ పాటలకు జీవంపోస్తుండటం గమనార్హం.

"అడవుల్లో పుట్టినావా గౌరమ్మా..
ఆకుల్లో పెరిగినావా గౌరమ్మ..
నిండు అమాసనాడూ గౌరమ్మా..
మా ఇంటికొచ్చినావా గౌరమ్మ..
పూవుల్ల పూజిద్దునా గౌరమ్మా..
గంధాన కరిగిద్దునా గౌరమ్మ..
తీగమల్లెలు తెచ్చి.. నాగ మల్లెలు తెచ్చి..
తీగమల్లెలు తెచ్చి.. నాగ మల్లెలు తెచ్చి..
నాగమల్లెలు తెద్దునా గౌరమ్మా..
నిన్నే పూజిద్దునా గౌరమ్మ..
బ్రాహ్మణులను పిలుపిద్దునా గౌరమ్మా..
అక్షింతలు వేయిద్దునా గౌరమ్మ..
అద్దమడుగు నెయ్యి.. ఆవునేతి బొట్టు..
నేతిలో కరిగిద్దునా గౌరమ్మా..
మల్లెల్లో పూజిద్దునా గౌరమ్మ..
ఎన్నెన్నో పూజలు మెప్పుగా జేయించి..
గొప్పగా జేయిద్దునా గౌరమ్మా..
గంగలో ఒదిలొద్దునా గౌరమ్మ"

డ్యూటీ మీట్ పోటీలతో వృత్తి నైపుణ్యం పెరుగుతుంది..

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, అక్టోబర్ 8: డ్యూటీ మీట్ పోటీల్లో పాల్గొనడం ద్వారా పోలీసు అధికారులు తమ వృత్తిలో మరింత రాణించొచ్చని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. మూడురోజుల పాటు కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన జోనల్ పోలీసు డ్యూటీ మీట్‌లో విజయం సాధించిన పోలీసు అధికారులకు సీపీ మంగళవారం పతకాలను బహుకరించారు. భద్రాద్రి జోనల్ పరిధిలోని వరంగల్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన పోలీసు అధికారులు పాల్గొన్న జోనల్ స్థాయి డ్యూటీ మీట్ ఈనెల 3వతేదీ నుంచి మూడు రోజుల పాటు వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించారు. అధికారులు రోజువారిగా నిర్వహించే విధులకు సంబంధించి 18 విభాగాల్లో పోటీలను నిర్వహించి విజేతలుగా నిలిచిన వారికి సీపీ చేతుల మీదుగా పతకాలు అందచేశారు. విజేతలు ఈనెలలో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. వృత్తిలో నైపుణ్యం సాధించడం ద్వారా నురస్థులను గుర్తించడం సులభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీలు అనంతయ్య, సురేంద్రతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



విజయం సాధించిన పోలీసులతో సీపీ అంబర్ కిషోర్ ఝా

అభ్యర్థుల్లేక ఆగిన పోస్టులు 59

నేడు హైదరాబాద్‌కు కొత్త టీచర్ల పయనం
ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 8: డీఎస్సీ-2024 నియామకాల ప్రక్రియ ఎట్టకేలకు ముగియనుంది. ఈ నెల 3 నుంచి 5 వరకు 1:3 ప్రాతిపదికన సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ నిర్వహించగా, మంగళవారం ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థుల జాబితాలను సంబంధిత డీఈవోలు వారి కార్యాలయ వెబ్‌సైట్లలో పొందుపరిచారు. అయితే రెండు జిల్లాల్లో 488 పోస్టులు భర్తీ కానున్నాయని ముందుగా ప్రకటించినప్పటికీ సంబంధిత కేటగిరీల్లో అభ్యర్థులు లేకపోవడంతో 59 పోస్టులు మళ్లీ ఖాళీగానే దర్శనమీయనున్నాయి.

వరంగల్ జిల్లాలో 17 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు సంబంధిత క్వాలిఫికేషన్ ఉన్న అభ్యర్థులు లేకపోవడంతో వాటిని ఖాళీలుగానే ఉంచారు. అలాగే వివిధ కేటగిరీల్లో అభ్యర్థులు లేక 21 పోస్టులు బ్యాక్‌లాగ్‌గా మిగిలాయి. కాగా, జిల్లాలో మొత్తం 301 పోస్టులకుగాను 38 పోస్టులు ఖాళీలుగానే మిలిగిపోయాయి. ఇక హనుమకొండ జిల్లాలో స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులకు సంబంధిత క్వాలిఫికేషన్ గల అభ్యర్థులు లేకపోవడంతో 12 పోస్టులు ఖాళీలుగానే విగలగా, ఎస్టీల్లో సంబంధిత కేటగిరీల్లో 6 పోస్టులకు సంబంధిత క్వాలిఫికేషన్ అభ్యర్థులు లేకపోవడంతో అవి బ్యాక్‌లాగ్ పోస్టులుగా మిగిలిపోనున్నాయి. మొత్తంగా జిల్లాలో 187 పోస్టులకు 18 పోస్టులు ఖాళీగానే మిగలనున్నాయి. కాగా, కొత్తగా ఎంపికైన అభ్యర్థులకు బుధవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలు అందుకోనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ యంత్రాంగం కొత్తగా ఎంపికైన అభ్యర్థులను బస్సుల్లో హైదరాబాద్ తరలించేందుకు అన్ని చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద నుంచి వారిని తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

డైట్ బకాయిలు చెల్లించండి

బోధన ఆస్పత్రుల డైట్ కాంట్రాక్టర్ల మొర



వరంగల్ మెడికల్, అక్టోబరు 8: ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బోధన ఆస్పత్రులలో డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని డైట్ కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలల కాలంగా నిధులు విడుదల చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మూడు నెలలకోసారి బిల్లులు మంజూరు చేయాల్సి ఉన్నప్పటికీ ఆరు నెలలకు పైగా గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా విడుదల చేయడం లేదని కన్నీటి పర్యంతమవుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు చికిత్స చేస్తున్న వైద్యులకు ఆహార పదార్థాలను సరఫరా చేస్తున్న తమను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో రూ.3 కోట్లు, వరంగల్ సీకేఎం ఆస్పత్రిలో రూ.36లక్షలు, హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో రూ.33లక్షలు, టీబీ ఆస్పత్రిలో రూ.15లక్షలు, వరంగల్ కంటి ఆస్పత్రిలో రూ.15లక్షల నిధులు పెండింగ్‌లో ఉన్నాయని డైట్ కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ వద్ద పనిచేసే ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నామని, దసరా, దీపావళి పండుగలు ఉన్న నేపథ్యంలో బిల్లులను వెంటనే మంజూరు చేయాలని వారు కోరారు.

నాలుగు ఉద్యోగాలకు అర్హత సాధించిన యువకుడు

పర్వతగిరి, అక్టోబరు 8: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని దౌలత్‌నగర్ గ్రామశివారు బాజుతండాకు చెందిన మాలోత్ సుకుమార్ అనే యువకుడు ఏకంగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించాడు. బాజుతండాకు చెందిన మాలోత్ శేర్యా- పతాని దంపతులకు ఒక కూతురు రజిత, ఇద్దరు కుమారులు రాము, సుకుమార్ ఉన్నారు. రజితకు వివాహం కాగా, పెద్దకుమారుడు రాము డిగ్రీ పూర్తిచేసి తండాలో తల్లిదండ్రులకు వ్యవసాయంలో చేదోడుగా ఉంటున్నాడు. చిన్నకుమారుడు సుకుమార్ ఎన్ఐటీ వరంగల్‌లో 2021లో ఎంటెక్ పూర్తిచేసి ఉద్యోగప్రయత్నాల్లో భాగంగా పలు పోటీపరీక్షలు రాశాడు. ఏకంగా నాలుగు ఉద్యోగాలకు అర్హత సాధించాడు. స్టాఫ్‌సెలక్షన్ కమిషన్(ఎస్సెస్సీ)లో జూనియర్ ఇంజనీర్, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పాలిటెక్నిక్ లెక్చరర్, అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులకు ఎంపికయ్యారు. నాలుగు పోస్టులకు అర్హత సాధించగా పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో ఏఈఈగా ఉద్యోగంలో చేరి సేవలందించడానికి గాను సుకుమార్ సుముఖతను వ్యక్తం చేశారు. తమ కుమారుడు ఏకంగా నాలుగు ఉద్యోగాలు సాధించడంతో ఇటు తల్లిదండ్రులతో పాటు అటు తండావాసులు హర్షం వ్యక్తం చేశారు.



మాలోత్ సుకుమార్

పేదరికం అడ్డురాలే.. వైకల్యంతో కుంగిపోలే..

క్రీడాకారులు దీప్తిని స్ఫూర్తిగా తీసుకోవాలి
అథ్లెటిక్స్ ఇండియా చీఫ్ కోచ్ నాగపురి రమేష్
రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల ముగింపు వేడుకల్లో వెల్లడి

వరంగల్ స్పోర్ట్స్ అక్టోబరు 8: చాలామంది తమలో ఉన్న చిన్న చిన్న లోపాలకే కుంగిపోతూ వైకల్యం ఉంటే ఏదీ సాధించలేమనే భావనతో ఉన్నవారికి జీవంజి దీప్తి స్ఫూర్తిగా నిలిచారని అథ్లెటిక్స్ ఇండియా చీఫ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ కొనియాడారు. హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జేఎన్ఎస్‌లోని సింథటిక్ ట్రాక్‌పై రెండు రోజులుగా నిర్వహిస్తున్న 10వ తెలంగాణ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇతర అమ్మాయిలా మాదిరిగా కాకుండా కొంత భిన్నంగా ఉండడంతో పలువురు దీప్తిని హేళన చేయడంతో ఆమె కుంగిపోకుండా మొక్కవోని దీక్షతో పారాలింపిక్స్‌లో పాల్గొని కాంస్య పతకం సాధించడంతో నేడు తనతో ఫోటోలు దిగేందుకు ఉత్సాహాన్ని కనబరుస్తున్నారన్నారు. ఇటీవల నిర్వహించిన పారాలింపిక్స్‌లో కల్లెడకు చెందిన జీవంజి దీప్తికి తెలుగురాష్ట్రాల్లో కాంస్య పతకం సాధించిన ఘనత దక్కిందన్నారు. తన దగ్గర అథ్లెటిక్స్‌లో తర్ఫీదు పొందుతూ ఒలంపిక్స్‌లో దీప్తి కాంస్య పతకం సాధించడం తనకెంతో గర్వంగా ఉందన్నారు. హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. పారాలింపిక్స్ కాంస్య పతక విజేత జీవంజి దీప్తి మాట్లాడుతూ.. ఒలంపిక్స్‌లో పతకం సాధించడం కోసం ఆహర్నిషలు కష్టపడుతూ కోచ్ నాగపురి రమేష్ సలహాలు సూచనలతో కాంస్య పతకం సాధించానన్నారు.

అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి మాట్లాడుతూ.. అండర్ -14, 16, 18, 20 బాల బాలికల విభాగాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో సుమారు 1,100 మంది క్రీడాకారులు, 100 మంది టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొన్నారన్నారు. 100, 400, 600, 3000, 10,000 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్, లాంగ్ జంప్, ట్రిబుల్ జంప్, హైజంప్, జావెలిన్‌త్రో, హ్యామర్‌త్రో, డిస్కస్‌త్రో, స్టీపుల్‌చేజ్, 110 మీటర్ల హార్డిల్స్, 4ఇంటు 400 మిడ్ రిలే, ట్రయాత్లేన్, పోల్‌వాల్ట్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ డీవైఎస్‌వో జి.అశోక్‌కుమార్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గట్టు మహేష్‌గౌడ్‌బాబు, ములుగు జిల్లా అసోసియేషన్ బాధ్యులు పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి, నిజామాబాద్, నారాయణపేట జిల్లాల కార్యదర్శులు రాజాగౌడ్, రమణ, పీడీలు రజనీకాంత్, మనోజ్, కోచ్‌లు శ్రీమన్నారాయణ, దిమ్మిక నాగరాజు, టెక్నికల్ అఫీషియల్స్ తదితరులు పాల్గొన్నారు.



పరుగు పందెంలో విజేతగా నిలిచిన క్రీడాకారులకు మెడల్స్ ప్రదానం చేస్తున్న హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి



అండర్20 బాలుర పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు

హోరాహోరీగా పోరు

అథ్లెటిక్స్ ఫైనల్ ఈవెంట్లు హోరాహోరీగా జరిగాయి. క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా తమ సత్తా చాటుకున్నారు. 100 మీటరు, 3000 మీటర్లు, హార్డిల్స్ స్టీపుల్ చేజ్ పోటీల్లో ఒకరికి మించి ఒకరు గెలవాలని సంకల్పంతో ఎండ వేడిమిని లెక్కచేయకుండా అనుకున్న లక్ష్యంవైపు పరుగులు తీశారు. రెండో రోజు నిర్వహించిన ఫైనల్స్ అండర్-18 బాలుర 100మీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానం గణేష్ (నల్లగొండ), ద్వితీయ స్థానం ఎస్.హర్షవర్ధన్ (రంగారెడ్డి), తృతీయ స్థానం కె.అశోక్ (ఖమ్మం) సాధించారు. బాలికల విభాగంలో ప్రథమ స్థానం షేక్ సుహాని (హైదరాబాద్), ద్వితీయ స్థానం ఎం.అక్షిత (రంగారెడ్డి), తృతీయ స్థానం అమ్మ అంజుం (మంచిర్యాల) సాధించారు. అండర్- 20 బాలికల 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం ఎస్.ప్రవళిక(నల్లగొండ), ద్వితీయ స్థానం రాగవర్శిని(హైదరాబాద్), తృతీయ స్థానం ఎం.శృతి(నాగర్‌కర్నూల్) పొందారు. అండర్-20 బాలుర జావెలిన్‌త్రోలో ప్రథమ స్థానం కె.స్వామి, ద్వితీయ స్థానం పి.నగేష్, తృతీయ స్థానం ఆర్.తరుణ్‌కుమార్ సాధించారు.



వితంతువులకు జన వికాస్ సంస్థ చేయూత

కాజీపేట, అక్టోబరు 8: భర్త చనిపోయి పిల్లల చదువు, కుటుంబ భారం మోయలేక ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న వితంతువులకు జన వికాస్ సంస్థ ఆపన్న హస్తం అందిస్తోంది. కాజీపేటలోని బాల వికాస శిక్షణ సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సోఫార్ కెనడా డోనార్ల ద్వారా రూ.12లక్షలతో యువ వితంతువులకు చేయూతగా వారి పిల్లలకు 249 మందికి విద్యకు అవసరమైన బ్యాగ్‌లు, పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐదు జిల్లాల నుంచి 130 మంది వితంతువులు, 249 మంది పిల్లలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా అభివృద్ధి పథక ప్రోగ్రాం ఆఫీసర్ లత మాట్లాడుతూ.. ఒంటరి మహిళ ఆర్థిక పరిస్థితిని గమనించి వారి పిల్లల చదువుకు అవసరమయ్యే స్టేషనరీని అందజేస్తున్నట్లు తెలిపారు.

ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన సేవలందించాలి

కలెక్టర్ ప్రావీణ్య



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ధర్మసాగర్, అక్టోబరు 8: ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన సేవలందించాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. మంగళవారం ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ విభాగం గురించి, వైద్య సిబ్బందికి సంబంధించిన వివరాలను మెడికల్ ఆఫీసర్ గోపీనాథ్‌ను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని డ్రగ్స్ నిల్వ చేసిన రూమ్, వాటి వివరాలను, ఎంత డ్రగ్స్ ఇప్పటి వరకు వినియోగించారని రికార్డును తనిఖీ చేయగా, మూడు నెలల నుంచి రికార్డులో డ్రగ్స్ వాడకం వివరాలను నమోదు చేయకపోవడంతో అసంతృప్తిని వ్యక్తం చేశారు. ల్యాబ్, టీకా గదిని పెషంట్ గదిని, ఆయుష్ రూమ్ పరిసరాలను పరిశీలించారు. ఆరోగ్యకేంద్రానికి వైద్యం కోసంవచ్చిన రోగులతో వైద్య సేవలు అందుతున్నాయా, లేదా అని కలెక్టర్ రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని మెడికల్ ఆఫీసర్‌కు, సిబ్బందికి సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు, సదుపాయాల గురించి లైబ్రేరియన్, పాఠకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయానికి కావాల్సిన అదనపు వనరులు అవసరం ఉంటే ప్రతిపాదను పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి లలితాదేవి, మెడికల్ ఆఫీసర్ గోపీనాథ్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన దీప్తి జీవంజి

న్యూశాయంపేట : ఇటీవల పారిస్‌లో జరిగిన పారా ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన పారా అథ్లెట్ దీప్తి జీవంజి మంగళవారం కలెక్టర్ ప్రావీణ్యను కలిశారు. ఈ సందర్భంగా దీప్తి జీవంజికి కలెక్టర్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దీప్తి, కోచ్ నాగపురి రమేష్‌ను శాలువాతో కలెక్టర్ సత్కరించారు. దీప్తి దేశ కీర్తిని ప్రపం చానికి చాటారని ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాధికారి అశోక్‌కుమార్ ఉన్నారు.

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు పూర్తి

వరంగల్ మేయర్ సుధారాణి ▸▸ చెరువుల వద్ద ఏర్పాట్ల పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 8: గ్రేటర్ వరంగల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరిగే సద్దుల బతుకమ్మ, దసరా పండగలు జరుపుకునేందుకు బల్దియా అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు వరంగల్ మేయర్ గుండు సుధారాణి తెలిపారు. వడ్డేపల్లి, భద్రకాళి చెరువుల వద్ద ఏర్పాట్లను మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గుండు సుధారాణి మాట్లాడుతూ.. వరంగల్ నగరంలోని ఉర్సు రంగసముద్రం, హనుమకొండ వడ్డేపల్లి చెరువు, శివనగర్ బతుకమ్మకుంట, చిన్నవడ్డేపల్లి చెరువు, మెట్టు దర్వాజ, రంగశేశ్‌నగర్ మంగళమ్మకుంట, మామునూరు పెద్ద చెరువు, రంగశాయిపేట బెస్తం చెరువు, దురుషకుంట ప్రాంతాల్లో బతుకమ్మకు అన్ని ఏర్పాటు చేశామన్నారు. చెరువుల్లో ఉన్న గుర్రపు డెక్కను తొలగించి మైదానాలను శుభ్రం చేశామన్నారు. ఈ ప్రాంతాల్లో ఉన్న బతుకమ్మ విగ్రహాలకు పెయింటింగ్ వేయించామన్నారు. ఇంకా మిగిలి ఉన్న పద్మానగర్, శాంతినగర్‌లలో పనులు జరుగుతున్నాయన్నారు. రావణవధ కార్యక్రమాలకు లైటింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో 11వ డివిజన్ కార్పొరేషన్ దేవరకొండ విజయలక్ష్మి, బల్దియా ఎస్ఈ రాజయ్య, ఈఈ మహేందర్, డీఈ సారంగంతో పాటు అధికారులు పాల్గొన్నారు.

మార్నేనికి మంత్రి తుమ్మల అభినందన

హనుమకొండ సిటీ, అక్టోబరు 8: వరంగల్ డీసీసీ బ్యాంక్ రూ.2వేల కోట్ల టర్నోవర్ సాధించడంపై టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖ, అనుబంధ చైర్మన్లు, ఆయిల్ సీడ్ కార్పొరేషన్, డీసీసీ బ్యాంకు అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష జరిపారు. సమీక్షకు హాజరైన మార్నేని రవీందర్‌రావుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందనలు తెలియచేశారు. సమావేశంలో వ్యవసాయ సహకార శాఖ ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్‌రావు, ఆయిల్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, టెస్కాబ్ సీజీఎం జ్యోతి, అధికారులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదు

కాజీపేట, అక్టోబరు 8: యూపీలోని ఘజియాబాద్ జిల్లాలో ఓ కార్యక్రమంలో ప్రవక్త మహ్మద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన నర్సింగ్ ఆనంద్‌పై చర్యలు తీసుకోవాలని సీపీ అంబర్ కిషోర్‌ఝాకు మంగళవారం దర్గా పీఠాధిపతి, హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూ పాషా వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో ముస్లిం మత పెద్దలు ఉన్నారు.

భవానీదేవిగా రుద్రేశ్వరీ అమ్మవారు

▸▸ లక్ష గాజులతో అర్చన పాల్గొన ▸▸ ఎంపీ కడియం కావ్య
▸▸ కనుల పండువగా శరన్నవరాత్రోత్సవాలు



రుద్రేశ్వరీ దేవి లక్ష గాజుల అర్చనలో పాల్గొన్న ఎంపీ కడియం కావ్య



డీసీసీ భవన్‌లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న నాయిని నీలిమారెడ్డి

హనుమకొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వేయిస్తంభాలగుడిలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రుద్రేశ్వరీదేవి అమ్మవారిని భవానీదేవిగా అలంకరించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చతుశష్టి ఉపచార పూజలు, శ్రీ చక్రార్చన నిర్వహించారు. లక్ష గాజులతో అమ్మవారికి పూజ జరిగింది. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర పురావస్తుశాఖ అధీనంలో ఉన్న వరంగల్ కోట, వేయిస్తంభాలగుడి దేవాలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ముఖ్యంగా వేయిస్తంభాలగుడిని పూర్తిస్థాయిలో సుందరీకరించాల్సి ఉందన్నారు. ఇందుకోసం కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర షెకావత్‌తో మాట్లాడి అవసరమైన నిధులు తీసుకువచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రుద్రేశ్వరీ దేవి అమ్మవారిని నెమలివాహనంపై పురవీధుల గుండా ఊరేగించారు. ఆలయ ఆవరణలోని యాగశాలలో మహాచండీ యాగాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం జరిగింది. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఎం.పరమేశ్వర్ శిష్యుల భరత నాట్యం ఆహూతులను ఆకట్టుకున్నది. పూజల్లో కోన శ్రీకర్, పులి రజనీకాంత్, పల్లం రమేష్, పుష్పలత, దివ్య రాధిక, స్వరూప, శివకన్య తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత మండపానికి ప్రథమ బహుమతి

హనుమకొండ వేయి స్తంభాలగుడిలోని రుద్రేశ్వరీదేవి శరన్నవరాత్రి ఉత్సవ మండపానికి ప్రథమ బహుమతి లభించింది. ఎస్ఎస్ఎస్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దుర్గా నవరాత్రి ఉత్సవ మండపాలకు పురస్కారాలను అందజేసింది. ఇందులో భాగంగా వేయిస్తంభాల గుడిలోని మండపం బహుమతికి ఎంపికైంది. ఎస్ఎస్ఎస్ ఫౌండేషన్ ప్రతినిధి నాగవెల్లి నరేందర్ ప్రథమ బహుమతిని ఆలయ ప్రధాన అర్చకుడు ఉపేంద్ర శర్మకు అందచేశారు. ఈ కార్యక్రమంలో మెజీషియన్ కల్యాణ్ రంజిత, స్వప్న, గుజ్జారి శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

వడ్డెపల్లి: హనుమకొండలోని వివిధ డివిజన్ల మండపాల్లో నెలకొల్పిన దుర్గామాతకు భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదానాలు చేశారు. 56వ డివిజన్ గోపాల్‌పూర్ రేణుక ఎల్లమ్మ కాలనీలో రేణుకా ఎల్లమ్మ యూత్ అసోసియేషన్ ఉత్సవ కమిటీ పర్యవేక్షణలో 56వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొంక హరిబాబు, స్రవంతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు ప్రారంభించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు చింత రమేష్ గౌడ్, రుద్రోజు మణీంద్రనాథ్, పల్లకొండ విజయ్‌సూర్య, సాగంటి మంజుల తదితరులు దుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాన్ని సమర్పించుకున్నారు. డివిజన్‌లోని కనకదుర్గా కాలనీలోని కనకదుర్గా మల్లేశ్వర ఆలయంలో నెలకొల్పిన దుర్గామాతకు ప్రధానార్చకుడు కృష్ణమూర్తి శర్మ, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తుల భజన కీర్తనలతో కనకదుర్గా మల్లేశ్వర స్వామి ఆలయం మార్మోగింది. మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చి దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు.

కాత్యాయనీ అలంకరణలో అమ్మవారు..

ఐనవోలు: భ్రమరాంబికాదేవి ఆలయంలో దుర్గామాత ఆరో స్వరూపమే కాత్యాయనీ అలంకరణలో దర్శనమిచ్చారు. ఖడ్గమాల త్రిశతి అష్టోత్తర శతనామర్చన, శ్రీ చక్రార్చన చండీహోమాలను నిర్వహించారు. అర్చకులు, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు..

● మడికొండ : మడికొండలో అంబేద్కర్ సెంటర్‌లో భద్రకాళి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పూజారి వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజలో రాజ్‌కుమార్ సౌమ్య దంపతులు, చైత్ర, మంజుల, శివప్రసాద్, సాయికుమార్ దివ్య దంపతులు కిషోర్, వెంకటలక్ష్మి, కోమల తదితరులు పాల్గొన్నారు. కడిపికొండలోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ, యూత్ ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని భక్తితో కొలిచి అన్నప్రసాదం స్వీకరించారు.

కాకతీయ యూనివర్సిటీలో..

కేయూ క్యాంపస్ : కేయూ పరిపాలన భవనం ఎదుట వర్సిటీ మహిళా ఉద్యోగ సంఘాల నేతృత్వంలో బతుకమ్మ సంబురాలు జరిగాయి. ఈ సందర్భంగా నిలువెత్తు బతుకమ్మను ఏర్పాటు చేసి ఉద్యోగులు సంప్రదాయ బద్ధంగా నృత్యం చేశారు. ఉత్సాహంగా బతుకమ్మ పాటలు పాడారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా కేయూ పాలన మండలి సభ్యుడు డాక్టర్ రమారెడ్డి, కే అనితరెడ్డి, ఎస్ఎం కళాశాల ప్రిన్సిపాల్ సుకుమారి హాజరై మాట్లాడుతూ.. ధనిక, బీద భేదం లేకుండా అందరూ బతుకమ్మ సంబురాల్లో పాల్గొని తమ భక్తి, సంప్రదాయాలను పాటిస్తారని వివరించారు. బతుకమ్మ ప్రజల ఆత్మగౌరవమన్నారు. ఈ కార్యక్రమంలో దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, మహిళ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు, ఎఫ్‌వో తోట రాజయ్య, ఏఆర్‌లు ఎల్.రాము, ప్రణయ్‌కుమార్, మహిళ ఉద్యోగులు డాక్టర్ ఎస్.సుజాత, బి.సృజన, బి.కృష్ణవేణి, పి.నర్మద, కె.శ్రీలత, రమ, రజిత, పద్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బల్దియాలో బతుకమ్మ ఆడుతున్న కమిషనర్, మేయర్, కార్పొరేటర్లు

జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలో..

వరంగల్ కార్పొరేషన్: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో మంగళవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారదాదేవి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్లు పద్మ, అరుణ, చందన, షిభారాణి, శిరీష, విజయలక్ష్మి, విజయశ్రీ, పద్మ, సులోచన, స్వప్న, ఉమా సెక్రెటరి విజయలక్ష్మి బతుకమ్మ ఆడి పాడారు.

ఎన్జీవోస్ కాలనీలో..

వడ్డెపల్లి : హనుమకొండ పట్టణ మేదరి సంఘం ఆధ్వర్యంలో హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని పాపులర్ గార్డెన్స్‌లో బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి నాయిని నీలిమారెడ్డి హాజరై మేదరి మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో హనుమకొండ పట్టణ మేదరి సంఘం అధ్యక్షుడు చిలువేరు రవికుమార్, ఉపాధ్యక్షుడు కూచనపల్లి దేవేందర్, ప్రధాన కార్యదర్శి కోరుట్ల రమేష్, ప్రచార కార్యదర్శి వలిపిరెడ్డి శ్రీనివాస్ తదితరులు బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి బతుకమ్మ సంబరాలను హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి నాయిని నీలిమారెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయ రజాలి, మహిళా కాంగ్రెస్ నేతలు స్రవంతి, మానస,తేళ్ల సుగుణ కిశోర్, పల్లపు రజిత, ఝాన్సీ, విజయ తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్ వద్ద..

బాలసముద్రం : బతుకమ్మ పండగను పురస్కరించుకుని మంగళవారం హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో మహిళ ఉద్యోగులు బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్ఎం డి. విజయభాను, డిప్యూటీ ఆర్ఎం భానుకిరణ్ హాజరయ్యారు. అనంతరం బతుకమ్మ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్-2డిపో మేనేజర్ జోత్స్న తదితరులు పాల్గొన్నారు.

బీసీ హక్కుల సాధనకు అధ్యాపకులు కలిసిరావాలి

బీసీ జేఏసీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న సుందర్‌రాజ్

రాంనగర్, అక్టోబరు 8: బీసీ హక్కుల సాధనకు అధ్యాపకులు కలిసిరావాలని బీసీ జేఏసీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని మాస్టర్జీ కళాశాలలో అధ్యాపకుడు వేణుమాధవ్ అధ్యక్షతన బీసీ అధ్యాపకులు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సుందర్‌రాజ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు రోల్‌మాడల్‌గా ఉంటున్న అధ్యాపకులకు అడుగడుగునా అన్యాయం జరుగుతోందన్నారు. బీసీలు ఐక్యంగా ఉంటే హక్కుల సాధన సులభం అవుతుందన్నారు. దీని కోసం బీసీ జేఏసీని ఏర్పాటు చేసి ప్రతీ సంఘాన్ని ఇందులో భాగస్వామ్యంగా చేసే దిశగా ప్రయత్నం చేస్తున్నామన్నారు. త్వరలో బీసీ లెక్చరర్స్ ఫోరం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. బీసీల హక్కుల సాధనకు అవగాహన కార్యక్రమాలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రేటర్ వరంగల్‌లో 300 కళాశాలలుండగా, వీటిలో 3వేలకు పైగా బీసీ అధ్యాపకులు పనిచేస్తున్నారని సుందర్‌రాజ్ తెలిపారు. రేపటి తరంకోసం బీసీ అధ్యాపకులు కృషి చేయాలని సుందర్‌రాజ్ యాదవ్ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొ.విజయబాబు, తెలంగాణ ప్రైవేట్ కళాశాలల లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాస్‌గౌడ్, బీసీ రాష్ట్ర నాయకులు డా.తిరునహరి శేషు, ప్రొ.గడ్డం బాస్కర్, డా.మోటె చిరంజీవి, తాడిశెట్టి క్రాంతికుమార్, వీరస్వామి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

మడికొండ, అక్టోబరు 8: కాజీపేట మండలం భట్టుపల్లిలో మంగళవారం పోలీస్ కళాజాత బృందం మత్తు పదార్థాలు, సైబర్ క్రైం వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం యువత గంజాయి, గుట్కా, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను నిర్వీర్యం చేసుకుంటున్నారన్నారు. అలాగే సైబర్ నేరాలకు బలై డబ్బులు పోగొట్టుకుంటున్నారని, ఇలాంటి వాటిపై ప్రజలు అవగాహన కల్పించుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్సై రాజాబాబు, హెడ్ కానిస్టేబుళ్ళు జయరాజ్, రాంచందర్, ఏఎస్సై నాగమణి, సభ్యులు విలియం, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్, రాజు, చిరంజీవి, కానిస్టేబుళ్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

బకాయిలను వెంటనే చెల్లించాలి

ఎమ్మెల్యే, కలెక్టర్‌కు నివేదించిన రైస్‌మిల్లర్లు



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న రైస్ మిల్లర్ల ప్రతినిధులు

హనుమకొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తమకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని, కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) విషయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తక్షణం పరిష్కరించాలని కోరుతూ మంగళవారం హనుమకొండ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో కలెక్టర్ ప్రావీణ్యను కలిసి మిల్లర్లు కోరారు. ఈ మేరకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డినీ కలిసి తమ ఇబ్బందులను వివరించి వినతిపత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే నాయిని స్పందిస్తూ రైస్ మిల్లర్ల సమస్యలను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రికి, అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మాటేటి రాధికా ప్రదీప్ చైతన్య, కోశాధికారి చౌల్ల లక్ష్మన్ రావుతో పాటు హనుమకొండ జిల్లా పరిధిలోని పలువురు రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

మునిసిపల్ ఔట్‌సోర్సింగ్ జేఏసీ ఏర్పాటు

వరంగల్ కార్పొరేషన్ : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ జేఏసీ ఎన్నికలు మంగళవారం ఏకగ్రీవంగా జరిగాయి. బల్దియా ప్రధాన కార్యాలయంలో ఎన్నికలు జరిగిన తర్వాత పూర్తి కమిటీని వెల్లడించారు. గౌరవ అధ్యక్షుడిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, అధ్యక్షుడిగా కొత్తకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వక్కల రాణాసాగర్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా సుద్దాల కుమార్, నేరెళ్ల కుమార్, పిండి రవి, రంగు యుగేందర్, సోంపెల్లి సురేందర్, కోశాధికారులుగా ఎర్ర రాము, ఎర్ర అరుణ్, ఉపాధ్యక్షులుగా కుమ్మరి అశోక్, ఏల్పుగొండ చిరంజీవి, బొక్క రాజేశ్, వరలక్ష్మి, దామెర రాజు, అవినాష్‌లు ఎన్నిక కాగా, కార్యదర్శులుగా కొమ్ము తిలక్, ఇంద్రసేన, ఎర్ర ప్రదీప్, యూజిన్, రమేష్, ఐలయ్య, అరుణ్, సుభద్రలు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా చారి, సాంబరాజు, శేఖర్, గోపి, పవన్, సంధ్య, కుమార్, రాజును ఎన్నుకున్నారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌ను కలిసి పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు విన్నవించారు.

ఆటో డ్రైవర్లు ఆర్థికంగా ఎదగాలి

వడ్డెపల్లి : పరపతి సంఘంలో సభ్యులైన ఆటో డ్రైవర్లు క్రమం తప్పకుండా పొదుపు చేస్తూ ఆర్థికంగా ఎదగాలని మనం-మనది ఆటోపరపతి సంఘం గౌరవ అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా ముఖ్య సలహాదారు చిర్ర రమేష్‌గౌడ్, అధ్యక్షుడు వసుల యాదగిరి, ప్రధాన కార్యదర్శి బండి లింగయ్య ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ అశోకకాలనీలో పరపతి సంఘం ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. పరపతి సంఘం సభ్యులు రూపొందించిన బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించి మాట్లాడారు. ఆటోడ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలను రూపొందించి అమలు చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో పరపతి సంఘం ఉపాధ్యక్షుడు ఓరుగంటి సదానందం, సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ సమతుల్యతను కాపాడాలి



మాట్లాడుతున్న భీమానాయక్

న్యూశాయంపేట, అక్టోబరు 8: వన్యప్రాణులను సంరక్షించి పర్యావరణ సమతుల్యతను కాపాడాలని భద్రాద్రి సర్కిల్ వరంగల్ ముఖ్య అటవీ సంరక్షణ అధికారి భీమానాయక్ అన్నారు. వణ్యప్రాణి వారోత్సవాలలో భాగంగా అక్టోబరు 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు హనుమకొండ హంటర్‌రోడ్‌లోని జూపార్కులో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. జూపార్కులో మంగళవారం ముగింపు వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో భీమానాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జూపార్క్ రెస్క్యూ టీంను సన్మానించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ డివిజినల్ ఫారెస్ట్ అధికారి క్రిష్ణమాచారి, రిటైర్డ్ జిల్లా అటవీ శాఖ అధికారి కె.పురుషోత్తం, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జె.శిరీష, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ డి.రాందాసు, బీట్ ఆఫీసర్లు టి.సురేష్, డి.శారద, ఓరుగల్లు వైల్డ్ సొసైటీ సభ్యులు, జూపార్కు సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ డీఎంకు సన్మానం



డీఎంను సన్మానిస్తున్న వాకర్స్

కాజీపేట, అక్టోబరు 8: కాజీపేట డీజిల్ కాలనీలో పెన్షనర్లు, వాకర్స్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా సీనియర్ డీఎం వెంకట కిరణ్‌ను పెన్షనర్లు, వాకర్స్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మల్లయ్య, మేఘరాజ్, వెంకటేశ్వర్లు, ఎలుగం కృష్ణా, మధు, సదానందం, విజయ్ పాల్గొన్నారు.

హైదరాబాద్ తరహాలోనే వరంగల్‌లో వాడ్రా

హసన్‌పర్తి, అక్టోబరు 8: హైదరాబాద్ తరహాలో వరంగల్‌లో వాడ్రాకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు వెల్లడించారు. హసన్‌పర్తి పెద్ద చెరువులో ప్రభుత్వం ద్వారా మత్స్యకార్మికులకు ఉచితంగా అందజేసిన 40 వేల చేప పిల్లలను చెరువులో వేశారు. ఈ సందర్భంగా చెరువు వద్ద ముదిరాజ్ కుల సంఘం ఆధ్వర్యంలో మత్స్య కార్మికులు ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగరాజు, కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, ఆత్మకూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, ముది రాజ్ సంఘం అధ్యక్షుడు శీలం పృథ్విరాజ్ సమక్షంలో జల పూజ నిర్వహించారు. అనంతరం చెరువు కట్టపై సభలో ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడారు.

చెరువులు, కుంటలు మింగిన ఘనులకు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. చెరువులు, కుంటల పరిధిలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని ప్రభుత్వ ఆదేశాలున్నప్పటికీ వాటిని బేఖాతరు చేస్తూ అక్రమ వెంచర్లు చేసి నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు చేపడుతున్నారని మండిపడ్డారు. త్వరలోనే ఆన్‌లైన్ ఫిర్యాదుల ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా నిర్దాక్షిణ్యంగా కూల్చివేతలు తప్పవని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అడ్డగోలుగా చెరువులు, కుంటలు, శిఖం భూములు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో అక్రమ వెంచర్లు చేసి నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపట్టి దోపిడీ చేసిందన్నారు. లక్షలాది ముదిరాజ్‌ల జీవనోపాధి కోసం ఉపయోగపడే చెరువులు, కుంటల పరిరక్షణకు త్వరలోనే వాడ్రా ద్వారా చర్యలు చేపట్టి చెరువుల పరిరక్షణకు స్వీకారం చుట్టబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అడ్లూరి అనురాధ, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్‌కుమార్, మార్కెట్ డైరెక్టర్ గౌరు రాజిరెడ్డి, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేయూ రిటైర్డు ఉద్యోగి మృతి

కేయూ క్యాంపస్, అక్టోబరు 8: కేయూ రిటైర్డు ఉద్యోగి సంగాల యోన (85) మంగళవారం ఆయన స్వగృహంలో మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. భీమారానికి చెందిన యోన వర్సిటీలో పంప్ డ్రైవర్‌గా సుదీర్ఘకాలం విధులు నిర్వర్తించారు. అలాగే వర్సిటీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికై ఉద్యోగుల సంక్షేమం కోసం పోరాడి హక్కులను సాధించారు. యోన అంత్యక్రియలు భీమారంలో బుధవారం జరుగుతాయని ఆయన కుమారుడు వర్సిటీ ఉద్యోగి ఎఫ్రాయ్‌రాజ్ తెలిపారు. యోన మృతిపై రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, ఇతర అధికారులు సంతాపం ప్రకటించారు.

విద్యుత్తు శాఖలో ఖాళీల భర్తీకి త్వరలో భారీ నోటిఫికేషన్

- మెరుగైన విద్యుత్తు కోసం సంస్కరణలు
- శాఖలో సమస్యలుంటే 1912కు ఫోన్ చేయండి
- పేద విద్యార్థుల కోసం సమీకృత గురుకులాలు: భట్టి విక్రమార్క

ఖమ్మం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో విద్యుత్తు శాఖలో ఖాళీలను గుర్తించామని, త్వరలో ఆయా పోస్టుల భర్తీకి భారీ నోటిఫికేషన్ ఇస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో మంగళవారం ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల విద్యుత్‌శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్తు శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను గుర్తించామని చెప్పారు. మెరుగైన విద్యుత్తును అందించేందుకు, విద్యుత్తు ఉత్పత్తిని పెంచేందుకు అనేక సంస్కరణలు చేపట్టబోతున్నామన్నారు. అందులో భాగంగా శాఖలో ఖాళీ పోస్టులన్నింటినీ భర్తీ చేయబోతున్నామని పేర్కొన్నారు. విద్యుత్తు శాఖలో ఎక్కడైనా సమస్యలు ఉన్నా, ఎవరైనా డబ్బులు అడిగినా 1912కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఈ నెంబర్‌కు ఫోన్ చేసిన ప్రతి ఒక్కరి వివరాలు తీసుకుని పర్యవేక్షణ చేస్తామన్నారు. వరదల సమయంలో విద్యుత్తు అధికారులు, సిబ్బంది



కష్టపడి పనిచేశారని ప్రశంసించారు. రాష్ట్రంలో విద్యుత్తు శాఖ అధికారులు, సిబ్బందికి ఎప్పటికప్పుడు వృత్తిపరంగా మెళవకులు నేర్పేందుకు ఒక కాలేజీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్తు ఉత్పత్తికి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందన్నారు. థర్మల్ పవర్‌తో పాటు సౌర, జల విద్యుత్, పవన విద్యుత్.. మొత్తం 20వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రాష్ట్రంలో పేద విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్యనందించేందుకు అంతర్జాతీయ సమీకృత గురుకులాలను ఏర్పాటు చేస్తున్నామని, ఈనెల 11న పలుచోట్ల వీటికి శంకుస్థాపన చేయబోతున్నామని వెల్లడించారు.

విశ్వనగరం కోసమే మూసీ ప్రక్షాళన

హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకే మూసీ నదిని ప్రక్షాళన చేయాలని సంకల్పించామని భట్టి విక్రమార్క తెలిపారు. ఇది చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. మూసీని అభివృద్ధి చేస్తామని బీఆర్ఎస్ పదేళ్ల అబద్ధాలతో కాలం గడిపిందని విమర్శించారు. మూసీలోని మురికిని వేరు చేసి మంచినీటిని ప్రవహింపచేస్తే హైదరాబాద్ ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ నదికి పక్కన దుర్వాసనలో జీవిస్తున్న వారికి మెరుగైన పునరావాసం అందిస్తామని చెప్పారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మూసీ అభివృద్ధి విషయంలో సలహాలు, సూచనలు ఇవ్వాలి తప్ప విమర్శలు చేయడం సరికాదని అన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు లింగమయ్య మృతి



జోగిపేట, అక్టోబరు 8: మెదక్ జిల్లా జోగిపేటకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు గడిండ్ల లింగమయ్య గౌడ్(93) మృతిచెందారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రెండు వారాలుగా చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం తుదిశ్వాస విడిచారు. లింగమయ్య గౌడ్ యువకుడిగా ఉన్న సమయంలో రజాకార్ల దురాగతాలను ఎదిరిస్తూ తెలంగాణ విమోచనోద్యమంలో పాల్గొని జైలుపాలయ్యారు. సుమారు 10 నెలలపాటు జైలు శిక్షను అనుభవించారు. తెలంగాణను భారతదేశంలో విలీనం చేసిన అనంతరం విమోచనోద్యమంలో పాల్గొన్న వారందరినీ కేంద్ర ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించి గౌరవించింది. అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ చేతులమీదుగా లింగమయ్యగౌడ్ తామ్రపత్ర పురస్కారం పొందారు. కాగా లింగమయ్యగౌడ్ అంత్యక్రియలు బుధవారం జోగిపేటలో నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

మంత్రితో ముఖాముఖిలో నేడు పొన్నం వంతు

హైదరాబాద్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): గాంధీభవన్‌లో మంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్.. పార్టీ నేతలు, కార్యకర్తల నుంచి ఫిర్యాదులు తీసుకోనున్నారు. ఉదయం 9 గంటలకే ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి సంబంధించి ఇప్పటికే అన్ని డీసీసీల అధ్యక్షులకు మంత్రి పొన్నం లేఖలు రాశారు. పార్టీకి సంబంధించి ఏవైనా సమస్యలు, ఫిర్యాదులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆ లేఖల్లో సూచించారు.

బతుకమ్మకుంటను కాపాడాలి: వీహెచ్

హైదరాబాద్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట బతుకమ్మకుంట చెరువును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని కాంగ్రెస్ సీనియర్ నేత వి. హన్మంతరావు అన్నారు. చెరువును బీఆర్ఎస్ నేత సుధాకర్‌రెడ్డి కబ్జా చేశారని, దీనికి సంబంధించి తన దగ్గర పూర్తి ఆధారాలున్నాయని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని ఈ చెరువును కాపాడాలని, డిప్యూటీ సీఎం భట్టి వెళ్లి పరిశీలించాలని కోరారు. చెరువును కబ్జాచేసిన సుధాకర్‌రెడ్డిపైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు మహ్మద్ ఆజామ్ అనే వ్యక్తి బతుకమ్మ కుంట చెరువును ప్రభుత్వానికి అప్పజెప్పాడన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం ఈ మేరకు మాట్లాడారు.

నేడు కొత్త టీచర్లకు నియామక పత్రాలు

- సీఎం చేతుల మీదుగా ఎల్బీ స్టేడియంలో అందజేత
- మొత్తం 11,062 పోస్టులు.. ప్రస్తుతం 10,006 భర్తీ

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు బుధవారం నియామక పత్రాలను అందజేయనున్నారు. సాయంత్రం 4 గంటలకు ఎల్బీ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ పత్రాలను ఇస్తారు. రాష్ట్రంలో మొత్తం 11,062 టీచర్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో ప్రస్తుతం 10,006 పోస్టులను భర్తీ చేస్తున్నారు. కోర్టు కేసులు, ఇతర సాంకేతిక కారణాలతో 1,056 పోస్టులను పెండింగ్‌లో ఉంచారు. వీటి భర్తీపై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నారు. ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఇప్పటికే సమాచారాన్ని అందజేశారు. వారిని బుధవారం ఉదయం నుంచే ఆయా జిల్లాల నుంచి హైదరాబాద్‌కు రప్పిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక చర్యలను తీసుకుంటున్నారు. జిల్లాల నుంచి ప్రత్యేక ఉచిత బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ఎంపికైన అభ్యర్థులు ఉదయం కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటే.. అక్కడి నుంచి బస్సుల్లో ఎల్బీ స్టేడియానికి తీసుకువస్తారు. ఎల్బీ స్టేడియంలో జిల్లాల వారీగా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. అభ్యర్థులు తమ జిల్లా కౌంటర్‌లోనే నియామక పత్రాలను తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఉపాధ్యాయుల నియామకాల వివరాలు..

పోస్టు పేరు	మొత్తం పోస్టులు	ప్రస్తుతం భర్తీ	ఖాళీ
స్కూల్ అసిస్టెంట్లు	2,629	2,515	114
లాంగ్వేజ్ పండిట్లు	727	685	42
పీఈటీలు	182	145	37
ఎస్‌జీటీలు	6,508	6,277	231
ఎస్.ఏ (స్పెషల్ ఎడ్యుకేటర్స్)	220	103	117
ఎస్‌జీటీ (స్పెషల్ ఎడ్యుకేటర్స్)	796	281	515
మొత్తం	11,062	10,006	1,056

బెంబేలెత్తిస్తున్న డెంగీ!

(మొదటి పేజీ తరువాయి)



నమోదైన కేసుల వివరాలు

సంవత్సరం	డెంగీ	మలేరియా	చికున్‌గున్యా
2020	2173	872	183
2021	7135	881	76
2022	8972	611	104
2023	8016	420	51
2024	9254	229	379

నమోదయ్యాయి. చికున్‌గున్యా కేసులు కూడా భారీగా ఉన్నా వైద్యశాఖ లెక్కలో కేవలం 379గానే చూపారు. ఈ ఏడాది విపరీతంగా వర్షాలు కురవడంతోపాటు వాతావరణ మార్పులతో వైరల్ జ్వరాలు కూడా విజృంభించాయి. దోమలు పెరగడంతోనే డెంగీ కేసులు భారీగా నమోదయ్యాయి. సాధారణంగా డెంగీ, వైరల్ ఫీవర్స్ జూన్ నుంచి మొదలై ఆగస్టులో పెరిగి, సెప్టెంబరులో పతాక స్థాయికి చేరతాయి. అక్టోబరు మొదటి వారానికి కేసులు తగ్గుముఖం పడతాయి. ఈసారి మాత్రం తగ్గినట్లే తగ్గి మళ్లీ విజృంభిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగుల తాకిడి పెరుగుతోంది. కొన్నిచోట్ల పడకలు దొరకని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఈమారు మిక్స్‌డ్ వైరల్ ఫీవర్స్ దాడి చేస్తున్నాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. విష జ్వరాలు, డెంగీలతో మరణాలు సంభవిస్తున్నా అవి వైద్య ఆరోగ్యశాఖ లెక్కల్లోకి రావడం లేదు. అన్ని జిల్లాల్లోనూ వైరల్ జ్వరాలు, డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్, గ్యాస్ట్రోఎంటిరిటిస్ కేసులు వస్తున్నాయి. వీటికితోడు దగ్గు, జలుబు, ఫ్లూ కూడా ఉంటున్నాయి. ముఖ్యంగా చలి జ్వరం రోజుల తరబడి ఉంటోంది. దానికితోడు తీవ్రంగా దగ్గు వస్తోంది. రాత్రివేళ నిద్రపోకుండా దగ్గుతూనే ఉండే కేసులు ఎక్కువగా వస్తున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. ఇక జ్వర బారినపడితే... కనీసం వారం పది రోజుల పాటు ఉంటోంది. తగ్గిన తర్వాత విపరీతమైన నీరసం ఉంటోందని రోగులు చెబుతున్నారు. విష జ్వరాల కారణంగా సర్కారు దవాఖానాల్లో ఓపీ బాగా పెరుగుతోంది. అలాగే వార్డులు నిండుతున్నాయి. కాగా రాష్ట్రంలో మళ్లీ వైరల్ ఫీవర్స్, చికున్‌గున్యా తీవ్రత పెరగడంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. వైద్యశాఖ విభాగాధిపతులంతా క్షేత్రస్థాయి ఆస్పత్రులకు వెళ్లి పరిశీలించి నివేదికివ్వాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర ఆదేశించారు. దాంతో వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్వీ కర్ణన్, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండి హేమంత్, టీశాక్ ప్రాజెక్టు డైరెక్టర్ హైమవతి, వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ ఎన్.వాణి, వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ హైదరాబాద్‌లోని పెద్దాస్పత్రులను సందర్శించారు. అక్కడ వార్డుల్లో కలియదిరుగుతూ విషజ్వరాలు, డెంగీ, చికున్ గున్యా కేసుల గురించి ఆరా తీశారు. అలాగే ఒక్కొక్కరు మూడేసి జిల్లాల్లో పర్యటించి అక్కడి పరిస్థితిపై సర్కారుకు నివేదికిచ్చారు.

నిరుటికన్నా విష జ్వరాలు, డెంగీ కేసులెక్కువే

104 డిగ్రీలతో ఫీవర్ ఉండి, ట్యాబ్లెట్ వేసుకున్నా తగ్గకపోతే తక్షణమే వైద్యుడిని సంప్రదించాలి. అటువంటి రోగుల్లో డీహైడ్రేషన్ అయి బీపీ తగ్గి, కిడ్నీ ఫెయిల్యూర్‌కు దారి తీస్తుంది. జ్వరం ఉండి ట్యాబ్లెట్‌తో తగ్గిపోతూ...మూడు రోజుల తర్వాత కూడా అటువంటి పరిస్థితే ఉంటే అప్పుడు కూడా వైద్యుడిని స్పందించాలి. సొంత వైద్యం ఏమాత్రం పనికిరాదు. ప్రస్తుతం మా దగ్గరకు వచ్చే జ్వర కేసుల్లో సగం చికున్‌గున్యా లక్షణాలున్న రోగులే వస్తున్నారు. ఈ ఏడాది ఈ తరహా కేసులు ఎక్కువగా వస్తున్నాయి. కొందరికి ఓపీ చికిత్స సరిపోతోంది. మరికొందరు అడ్మిట్ అవుతున్నారు.

– డాక్టర్ గొంగూర వెంకటేశ్వర్లు,
క్రిటికల్ కేర్ మెడిసిన్ స్పెషలిస్టు,
ఎండీ శ్రీరక్ష ఆస్పత్రి, ఖమ్మం

కాటేసిన పాము, కరెంటు!

- పొలానికి వెళ్లి ఇద్దరు అన్నదాతల మృతి
- ములుగు, సూర్యాపేట జిల్లాల్లో ఘటనలు



భూతం కృష్ణ, సాంబయ్య (ఫైల్)

ములుగు, మద్దిరాల, అక్టోబరు 8: పొలంలో విద్యుదాఘాతం, పాము కాటుకు గురై ఇద్దరు రైతులు ప్రాణాలు కోల్పోయారు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండల కేంద్రానికి చెందిన భూతం వెంకన్న, సుభద్ర దంపతుల మూడో కుమారుడు భూతం కృష్ణ(25) డిగ్రీ పూర్తిచేసి జీవనోపాధి కోసం వ్యవసాయం చేస్తున్నాడు. సాగు చేసిన వరి కోతకు రావడంతో చూసుకునేందుకు మంగళవారం ఉదయం పొలానికి వెళ్లాడు. అయితే, బావి వద్ద మోటార్‌కు ఉన్న విద్యుత్ తీగలు నేలపై పడిపోవడంతో వాటిని పక్కన వేసేందుకు యత్నించగా విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఘటనలో... ములుగు జిల్లా కేంద్రం సమీపంలోని అబ్బాపురం గ్రామానికి చెందిన సాయబోయిన సాంబయ్య(55) మంగళవారం మిర్చితోటలో గుంటుక కొడుతుండగా పాము కాటేసింది. తీవ్ర అస్వస్థతకు సాంబయ్యను ములుగు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

అద్భుత ఫలితాలిస్తాయంటూ ఆయుర్వేద మందులపై ప్రచారం చట్టవిరుద్ధం

న్యూఢిల్లీ, అక్టోబరు 8: ఆయుర్వేద, సిద్ధ, యునాని, హోమియోపతి(ఏఎస్‌యూ& హెచ్) మందులు రోగాలను నయం చేయడంలో అద్భుత ఫలితాలిస్తాయని ప్రచారం చేయడం చట్టవిరుద్ధమని కేంద్ర ఆయుష్ శాఖ తెలిపింది. అలాంటి ప్రకటనలు ప్రమాదకమని వాటి వల్ల ప్రజారోగ్యం దెబ్బతింటుందని ఓ ప్రకటనలో పేర్కొంది. 'ద డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ యాక్ట్- 1954' ఇలాంటి ప్రచారాన్ని ఏ మాత్రం అనుమతించదని పేర్కొంది. ఇలా అద్భుతరీతిలో రోగాలను నయం చేస్తాయని మందుల గురించి తప్పుడు ప్రకటనలు చేసే వారిపై ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించింది.

దండకారణ్యంలో తెలుగు 'వార్'!

నక్సల్స్ ఉద్యమంలో తెలుగోళ్ల కీలక పాత్ర.. వివిధ రాష్ట్రాల్లో పార్టీని నడిపిస్తున్న నేతలు

- నేడు ఆపరేషన్ 'కగార్'లో తెలుగు పోలీసులు
- భారీ ఎన్‌కౌంటర్లలో వారిదే కీలక పాత్ర
- ఈ ఏడాది ఇప్పటి వరకు 200 మంది నక్సల్స్ మృతి
- నేతల మరణంతో ఉద్యమంపై నీలినీడలు



చర్ల, అక్టోబరు 8: మావోయిస్టు ఉద్యమాన్ని తెలుగు వారే నడిపిస్తే, అదే మావోయిస్టు పార్టీని దెబ్బకొట్టడంలోనూ తెలుగు పోలీసు అధికారులే కీలకపాత్ర పోషిస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లో 1967లో ప్రారంభమైన నక్సల్స్ ఉద్యమ ప్రస్థానం 11 రాష్ట్రాల మీదుగా దండకారణ్యానికి చేరుకోగా, ప్రస్తుతం ఆపరేషన్ కగార్‌తో కేంద్రబలగాలు మావోయిస్టులను ఎన్‌కౌంటర్లు చేస్తున్నాయి. ఈ ఎన్‌కౌంటర్లలోనూ తెలుగు పోలీసు అధికారులే కీలక పాత్ర పోషిస్తుండడం విశేషం. ఇలా వరుస ఎన్‌కౌంటర్లతో పార్టీ కుదేలవడంతో ఉద్యమంపై నీలి నీడలు అలుముకున్నాయి. ఈతరుణంలో మావోయిస్టు ఉద్యమం అంత్య దశకు చేరుకుందా? వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు పార్టీ కుదేలైందా? అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. నక్సల్బరిలో ప్రారంభమైన ఉద్యమం 2004లో మావోయిస్టు పార్టీగా మారింది. 1967 నుంచి 1980వరకు అటు ఉద్యమాన్ని నడిపించిన వారిలో తెలుగు వారే ఉన్నారు. అబూజ్‌మడ్ కేంద్రంగా 2004లో మావోయిస్టు పార్టీగా మారిన తరువాత కూడా తెలుగువారే పార్టీని నడిపించారు. అటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, దండకారణ్యం ఇలా అనేక చోట్ల పార్టీకి నాయకత్వం వహించారు. గతంలో మావోయిస్టు పార్టీ ఇండియా కార్యదర్శిగా గణపతి పని చేశారు. ఆయన తెలుగు వారే కావడం, పార్టీ నుంచి ఆయన బయటికి వచ్చిన తరువాత శ్రీకాకుళానికి చెందిన నంబాల కేశవరావు ఆ బాధ్యతలు చేపట్టడం విశేషం. అలాగే కొద్ది రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్లలోనూ తెలుగు వారు వివిధ రాష్ట్రాల్లో మావోయిస్టు పార్టీలో కీలక సభ్యులుగా పనిచేసి పార్టీని నడిపించిన అక్కిరాజు హరగోపాల్, హరిభూషణ్ శంకరావు, సాగర్, ఏసేబ్ మృతి చెందారు. వీరితో పాటు అనేక మంది తెలుగు వారు మావోయిస్టు పార్టీని నడిపించారు.

భారీ ఎన్‌కౌంటర్లలో..

గత ఏప్రిల్ 17న జరిగిన కాంకేర్ ఎన్‌కౌంటర్‌లో 29 మంది మావోయిస్టులు చనిపోయారు. ఈ ఆపరేషన్ నిర్వహించిన అధికారి తెలుగు అధికారే కావడం విశేషం. అలాగే గత ఐదు రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ, నారాయణపూర్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 31 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఘటనలోనూ తెలుగు అధికారే కీలక పాత్ర పోషించారు. ఈ రెండు ఎన్‌కౌంటర్లు దేశ చరిత్రలో అతిపెద్ద ఘటనలుగా నిలిచాయి. జనవరి నుంచి భారీ ఎన్‌కౌంటర్లలో సుమారు 200 మంది మావోయిస్టులు మృతి చెందారు. 500మందికి పైగా లొంగిపోయారు. 350 మందికి పైగా అరెస్టయినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు మృతి

దుమ్ముగూడెం అక్టోబరు 8: భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండల సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కిష్టారం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం పోలీసులు, మావోయిస్టుల మధ్య పామలూరు గుట్టల్లో జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక మావోయిస్టు మృతిచెందాడు. మృతి చెందిన మావోయిస్టును కిష్టారం ఏరియా కమిటీ సభ్యుడు లోకేష్‌గా పోలీసులు గుర్తించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో డీఆర్జీ, బస్తర్ ఫైటర్స్, 206, 208 కోబ్రా, 131బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ బలగాలు పాల్గొన్నాయి. ఎన్‌కౌంటర్ తరువాత పరిసరాల్లో పోలీసులు విస్తృతంగా కూంబింగ్ చేపట్టారు.

పంట నష్టపరిహారం విడుదల

- 28 జిల్లాల్లో బాధితులకు ఎకరాకు రూ. 10 వేలు
- రూ.79.57 కోట్లు విడుదల.. ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా పంటను కోల్పోయిన రైతులకు ప్రభుత్వం పరిహారాన్ని ప్రకటించింది. వరదల కారణంగా పంట తీవ్రంగా దెబ్బతిన్న, ఇసుక మేటలు వేసిన పొలాలకు ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం కేటాయించింది. ఈ మేరకు 28 జిల్లాల రైతులకు రూ.79.57 కోట్లు పెట్టుబడి రాయితీని మంజూరు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది. మొత్తం 79574.12 ఎకరాల్లో పంట నష్టపోగా 79,216 మంది రైతులు ప్రభావితం అయ్యారని ఉత్తర్వుల్లో పేర్కొంది. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 28 వేల ఎకరాల్లో నష్టం జరగ్గా, 27,242 మంది రైతులకు రూ.28.4 కోట్లు కేటాయించింది. మహబూబాబాద్‌లో 18,406 మంది రైతులకు రూ. 14.66 కోట్లు, సూర్యాపేట రూ.9.82 కోట్లు, సంగారెడ్డికి రూ.3.28 కోట్లు దక్కాయి. అలాగే ఆదిలాబాద్‌కు రూ.3.09 కోట్లు, అసిఫాబాద్‌కు రూ.2.69 కోట్లు, భద్రాద్రి కొత్తగూడెంకు రూ.2.65 కోట్లు, నాగర్‌కర్నూల్‌కు రూ.2.29కోట్లు చొప్పున కేటాయింపులు చేశారు. వనపర్తి జిల్లాకు రూ.1.98 కోట్లు, గద్వాల్‌కు రూ.1.80 కోట్లు, వికారాబాద్ రూ.1.51కోట్లు, నారాయణపేట్ రూ.1.23 కోట్లు, రంగారెడ్డి జిల్లాకు రూ.1.19 కోట్లు కేటాయింపులు జరిగాయి. కరీంనగర్ జిల్లాలో అతి తక్కువగా 19.23 ఎకరాలకు సంబంధించి 18 మంది రైతులు నష్టానికి గురవగా వారికి రూ.1.95 లక్షలు కేటాయించారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

- తెలంగాణ ఉద్యోగుల ఐకాస

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ ఉద్యోగుల ఐకాస ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. జూలై నుంచి 2024 జనవరి వరకు గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పింఛనుదారులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. నిత్యావసరాల ధరలు, ద్రవ్యోల్బణం పెరిగాయని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం ఉద్యోగులను ఆదుకోవాలని లేఖలో కోరారు.

హెలికాప్టర్‌లో వచ్చి ఫైల్స్ తీసుకెళ్లారు

- విచారించాలని డీజీపీకి స్నేహమయి కృష్ణ ఫిర్యాదు

బెంగళూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ముడా ఇంటి స్థలాల అవినీతికి సంబంధించిన ఫైల్స్‌ను నగర పాలకశాఖ మంత్రి భైరతి సురేశ్ బెంగళూరు నుంచి మైసూరుకు హెలికాప్టర్‌లో వచ్చి తీసుకెళ్లారని సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ ఆరోపించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని సోమవారం డీజీపీకి ఫిర్యాదు చేసినట్టు మైసూరులో మీడియాకు వివరించారు. జూలై 26న మంత్రి భైరతి సురేశ్ హెలి కాప్టర్‌లో వచ్చి ముడాకు సంబంధించిన ఫైళ్లను తీసుకెళ్లారని అన్నారు. వాటి ఆధారంగానే సీఎం సిద్దరామయ్య విధాన సౌధలో మీడియాతో మాట్లాడారని అన్నారు. అప్పట్లో లోకాయుక్త ఎస్పీగా వ్యవహరించిన సుజిత్ వీరికి సహకరించారని ఆరోపించారు. మంత్రితోపాటు ఎస్పీపైనా చర్యలు తీసుకోవాలని కోరానని తెలిపారు.

ఎమ్మెస్పీ.. ఆ తర్వాత బోనస్!

- సన్న ధాన్యానికి గంటల్లోనే చెల్లింపులు
- ధాన్యం సేకరణ విధివిధానాలపై మంత్రివర్గ ఉపసంఘం

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సన్నధాన్యంపై క్వింటాకు రూ. 500 బోనస్ ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆ మొత్తాన్ని రైతుల ఖాతాల్లో ఎలా జమ చేయాలి? అంశంపై ఓ నిర్ణయానికి వచ్చింది. రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ ద్వారా కనీస మద్దతు ధర (రూ. 2,300 - రూ. 2,320)ను రైతుల ఖాతాల్లో జమచేయాలని, ఆ తర్వాత కొన్ని గంటల వ్యవధిలో రాష్ట్ర పౌరసరఫరాలశాఖ నుంచి క్వింటాకు రూ. 500 చొప్పున బోనస్ జమచేయాలని నిర్ణయించారు. ఈ మేరకు వేర్వేరు సాఫ్ట్‌వేర్ విధానాలను రూపొందించారు. తొలుత కార్పొరేషన్ చెల్లింపులు చేసిన తర్వాత ఆ మేరకు ఇచ్చిన క్లియరెన్స్‌తో డిపార్ట్‌మెంట్ బోనస్ చెల్లింపులు చేస్తుంది. తద్వారా సన్నధాన్యం అమ్మిన రైతులకు క్వింటాకు బోనస్‌తో కలిపి రూ. 2,800 నుంచి రూ. 2,820 చొప్పున జమచేయనున్నారు. ఉదాహరణకు.. ఓ రైతు 25 క్వింటాళ్ల ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తే.. కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2,300 చొప్పున రూ.57,500 కార్పొరేషన్, రైతు ఖాతాలో వేస్తుంది. అనంతరం పౌరసరఫరాల శాఖ నుంచి క్వింటాకు రూ.500 చొప్పున మొత్తంగా రూ.12,500 బోనస్ సదరు రైతు ఖాతాలో జమవుతుంది. కాగా ధాన్యం సేకరణపై విధివిధానాలను అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేసింది. నలుగురు మంత్రులతో సబ్‌కమిటీ వేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులను ఉపసంఘంలో సభ్యులుగా వేశారు. క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు అధ్యయనం చేసే అంశాల్లో... రైస్‌మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారెంటీ తీసుకోవటం, గోదాములను అద్దెకు తీసుకోవటం, రైస్‌మిల్లర్లకు మిల్లింగ్ ఛార్జీలు, ధాన్యం నిల్వ తరుగు సమస్యలతోపాటు ఇతర అంశాలపై అధ్యయనం చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి, పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఈ సబ్‌కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు.

ముడా వివాదంతోనే హరియాణాలో కాంగ్రెస్ ఓటమి

- మాజీ స్పీకర్ కోళివాడ

బెంగళూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ముడా ఇంటి స్థలాల అవినీతి వ్యవహారంలో నేరుగా కర్ణాటక ముఖ్యమంత్రిపై ఆరోపణలు రావడం హరియాణా ఎన్నికల్లో ప్రభావం చూపిందని, కాంగ్రెస్ ఓటమికి ఇదే కారణమని మాజీ స్పీకర్ కేబీ కోళివాడ అన్నారు. బెంగళూరులోని తన నివాసంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. హరియాణా ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ కర్ణాటక ముడా అవినీతి అంశం పదే పదే ప్రస్తావించారని అన్నారు. ఆ ప్రభావం ఫలితాల్లో చూపిందని అన్నారు. తాను క్రియాశీలక రాజకీయాల్లో లేనని, అయితే కాంగ్రెస్ పార్టీ మనుగడకోసం పని చేస్తానని అన్నారు. ముడా వివాదంలో ముఖ్యమంత్రి రాజీనామా చేసి విచారణను ఎదుర్కోవాలనే డిమాండ్‌కు తాను కట్టుబడి ఉన్నానని అన్నారు.

వేడుక

నేడు వెన్న ముద్దల బతుకమ్మ

బతుకమ్మ వేడుకల్లో ఎనిమిదో రోజైన ఆశ్వయుజ శుద్ధ సప్తమి (బుధవారం) నాడు గులాబీ, చేమంతి, తంగేడు, గునుగు, గడ్డిపూలతో బతుమ్మను పేరుస్తారు. వెన్నతో చేసిన పదార్థాలను నివేదిస్తారు కాబట్టి 'వెన్నముద్దల బతుకమ్మ' అంటారు. .

నైవేద్యం:
నువ్వులు, బెల్లం, వెన్న లేదా నెయ్యి కలిపిన పదార్థాలు



ఈ నెలలోనే ...

స్కిల్ యూనివర్సిటీలో కోర్సులు !

మొదటి విడతలో నాలుగు కోర్సులు

రూ.7 కోట్లతో రెడింగ్టన్ లాజిస్టిక్ ల్యాబ్

దసరా సెలవుల తర్వాత తొలి నోటిఫికేషన్

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో ఈ నెల నుంచే కోర్సులను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన చర్యల్ని అధికారులు చేపట్టారు. హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో 57 ఎకరాల విస్తీర్ణంలో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే వర్సిటీ భవన నిర్మాణాలకు సీఎం రేవంత్‌రెడ్డి భూమిపూజ చేశారు. అయితే ఈ ఏడాది గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో తాత్కాలికంగా వర్సిటీ తరగతులను ప్రారంభించాలని ఇటీవల బోర్డ్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా సమక్షంలో జరిగిన సమావేశంలో నిర్ణయించారు. రవాణా(లాజిస్టిక్స్), మెడికల్ అండ్ హెల్త్, ఫార్మా రంగాల్లో అత్యధిక ఉద్యోగాల డిమాండ్ ఉన్న నాలుగు కోర్సులను మొదటి విడతలో ప్రారంభించనున్నారు. దసరా సెలవుల తర్వాత ఈ కోర్సులకు సంబంధించిన అడ్మిషన్లు, అర్హత వంటి పూర్తి వివరాలతో నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. త్వరలోనే మరిన్ని కోర్సులను ప్రారంభించేందుకు వివిధ కంపెనీలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వైస్ చాన్సలర్ వీఎల్వీఎస్ఎస్ సుబ్బారావు తెలిపారు. స్కిల్ వర్సిటీ తాత్కాలిక క్యాంపస్‌లో లాజిస్టిక్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రముఖ గ్లోబల్ లాజిస్టిక్స్ సొల్యూషన్స్ కంపెనీ రెడింగ్టన్ ముందుకు వచ్చింది. దీనికి దాదాపు రూ.7 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధపడింది. లాజిస్టిక్స్ రంగానికి సంబంధించి రెండు స్వల్పకాలిక కోర్సులను యూనివర్సిటీ ప్రారంభించనుంది. వేర్ హౌసింగ్ ఎగ్జిక్యూటివ్, కీ కన్‌సైనర్ ఎగ్జిక్యూటివ్ పేర్లతో ఈ కోర్సులను నిర్వహిస్తుంది. అదేవిధంగా నర్సులకు ఉన్నతమైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎఫ్ఐఎన్ఈ (ఫినిషింగ్ స్కిల్స్ ఇన్ నర్సింగ్ ఎక్సెలెన్స్) కోర్సును ఈ ఏడాది నుంచే ప్రారంభించనున్నారు. అపోలో మెడ్‌స్కిల్స్ లిమిటెడ్‌తో కలిసి ఈ కోర్సు నిర్వహిస్తారు. డాక్టర్ రెడ్డీస్ ఫార్మా అసోసియేట్ పేరుతో అప్రెంటీస్‌షిప్ ఇండక్షన్ కోర్సును సైతం ఆరంభిస్తారు. ఈ కోర్సు కాలవ్యవధి 6 నెలలుగా నిర్ణయించారు. కాగా, వర్సిటీలో ప్రారంభించనున్న స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులలో చేరే విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో భాగంగా ఉద్యోగం గ్యారెంటీగా వస్తుందని వీసీ అభిప్రాయపడ్డారు. నైపుణ్య శిక్షణను అందుకున్న నెలకు కనీసం రూ.20 వేల నుంచి రూ.25 వేల వేతనం ఉండే ఉద్యోగాల్లో చేరే అవకాశాలుంటాయని ఆయన తెలిపారు.

స్టాక్ బ్రోకింగ్ పేరుతో.. ఘరానా మోసం!

» అధిక లాభాలు అంటూ వందలకోట్లు కొల్లగొట్టిన ఘనుడు

» హైదరాబాద్‌లో ఆరు కోట్లు స్వాహా

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తమ స్టాక్ బ్రోకింగ్ సంస్థలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు ఇస్తామంటూ నమ్మించారు. సంవత్సరానికి 120% వడ్డీ.. అర్ధ సంవత్సరానికి 54%, నెలకు 7% వడ్డీతో కలిపి లాభాలు ఇస్తామంటూ స్కీములు పెట్టారు. ఇలా దేశవ్యాప్తంగా నాలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో వేలమందిని మోసం చేసి రూ. వందలకోట్లు కొల్లగొట్టారు. కొంతకాలంగా రిటర్న్స్ ఇవ్వడం మానేయడం, అడిగినా ఎవరూ స్పందించకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితులు సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించారు. సీపీ ఆదేశాలతో ఈవోడబ్ల్యూ(ఆర్థిక నేరాల విభాగం) పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ మోసం వివరాలు ఇలా ఉన్నాయి.. మణికొండ పుప్పాలగూడకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పంచాక్షర్.. గౌహతి కేంద్రంగా పనిచేస్తున్న డీబీ స్టాక్ బ్రోకింగ్ సంస్థలో పెట్టుబడులు పెట్టారు. వారు పెట్టిన స్కీములు నచ్చి రూ. 11 లక్షలు ఇన్వెస్ట్ చేశారు. కొద్ది రోజులు లాభదాయకమైన రిటర్న్స్ అందుకున్న పంచాక్షర్‌కు ఆ తర్వాత అసలు, వడ్డీ ఇవ్వడంలేదు. ఇదేంటని ప్రశ్నించినా ఎవరూ స్పందించలేదు. దాంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు ఈ ఏడాది సెప్టెంబరు 23న సైబరాబాద్ సీపీకి ఫిర్యాదు చేశారు. ఆయన కేసు తీవ్రతను గుర్తించి ఆర్థిక నేరాల విభాగానికి అప్పగించారు. డీసీపీ కె. ప్రసాద్ పర్యవేక్షణలో రంగంలోకి దిగిన ఈవోడబ్ల్యూ పోలీసులు ప్రాథమిక ఆధారాలు సేకరించగా 2018లో 39 ఏళ్ల దీపాంకర్ అనే వ్యక్తి ఈ డీబీ స్టాక్ బ్రోకింగ్ కంపెనీ ప్రారంభించినట్లు తేలింది. అసోం రాష్ట్రం గౌహతి సహా.. బెంగళూరు, ముంబై, హైదరాబాద్‌లలో అధిక వడ్డీ స్కీముల పేరుతో వేలాది మందిని ఆకట్టుకొని వందల కోట్లు సేకరించినట్లు అంచనా వేస్తున్నారు. పోలీసుల ప్రాథమిక వివరాల ప్రకారం.. హైదరాబాద్ నగరంలో 10 మంది ఈ సంస్థ బారినపడి రూ. 6 కోట్లు మోసపోయినట్లు గుర్తించారు. ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి గౌహతి పోలీసులతో సమన్వయం చేసుకొని సాంకేతిక ఆధారాలతో సైబరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రేహౌండ్స్, సీఐ సెల్ తరహాలో టీజీ న్యాబ్

» సర్కార్‌కు ప్రతిపాదనలు.. త్వరలో లభించనున్న ఆమోదం

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి ఇతర మత్తుపదార్థాల జాడ లేకుండా చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్) పనిచేస్తోంది. గ్రేహౌండ్స్, కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్(సీఐ సెల్) తరహాలో టీజీ న్యాబ్ పనితీరు ఉండేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఆయా విభాగాల తరహాలో తీర్చిదిద్దడమే కాదు, అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ డ్రగ్ ముఠాల ఆట కట్టించే టీజీ న్యాబ్ సిబ్బందికి అదనపు వేతనం, ఇతర సదుపాయాలు కల్పించడంపైన ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో భాగంగానే గ్రేహౌండ్స్, సీఐ సెల్ సిబ్బందికి అందిస్తున్న తరహాలోనే 60% అదనపు వేతనం, ఇతర సదుపాయాల కల్పనకు పోలీస్‌శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ప్రభుత్వం దీనికి ఆమోదం తెలుపుతూ త్వరలోనే అధికారిక ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు సమాచారం. ఇక టీజీ న్యాబ్ పనితీరు, కల్పించాల్సిన సదుపాయాలు, పోలీస్‌శాఖ పరంగా అందించాల్సిన సహకారం తదితర అంశాలకు సంబంధించి డీజీపీ జితేందర్ టీజీ న్యాబ్ అధికారులతో గురువారం కీలక సమావేశం నిర్వహిస్తున్నారు.

'అవినీతి ఐపీఎస్'లపై అంతటా చర్చ!

హైదరాబాద్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ఐపీఎస్‌లపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందంటూ 'అవినీతి ఐపీఎస్‌లపై కొరడా..!' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురించిన కథనంపై పోలీస్‌శాఖలో చర్చ జరుగుతోంది. రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏ ఇద్దరు ఐపీఎస్‌లు కలిసినా ఆంధ్రజ్యోతి కథనంపైనే మాట్లాడుకుంటున్నట్లు తెలిసింది. ఆ అవినీతి ఐపీఎస్‌లు ఎవరు, అలాంటి వారిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందని చర్చించుకుంటున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ

ఎస్సీ వర్గీకరణ చేయకుండానే.. టీచర్ ఉద్యోగాలు ఎలా ఇస్తారు..?

» నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలు: మంద కృష్ణ

బర్కత్‌పుర, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును ముందుగా తెలంగాణలోనే అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. వర్గీకరణ చేయకుండానే బుధవారం ఎల్బీ స్టేడియంలో 11 వేల మంది ఉపాధ్యాయులకు నియామక పత్రాలు ఎలా అందజేస్తున్నారని మంద కృష్ణ మాదిగ ప్రశ్నించారు. 11 వేల పోస్టుల్లో ఎస్సీలకు 1,650 ఉద్యోగాలు రావాలని.. ఇందులో 1,100 పోస్టులు మాదిగ, మాదిగ ఉప కులాలకు రావాల్సి ఉందన్నారు. వర్గీకరణ చట్టం అమలు కాకపోవడం వల్ల మాదిగలకు కనీసం 600 పోస్టులు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మంద కృష్ణ మీడియాతో మాట్లాడారు. సీఎం పదవిని కాపాడుకోవడానికి మాలలతో కుమ్మక్కై రేవంత్‌రెడ్డి మాదిగలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

పంటల డిజిటల్ సర్వేకు ఏఈవోల సమ్మతి

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పంటల డిజిటల్ సర్వేకు ఏఈవోలు అంగీకరించారని, నేటి నుంచి యాప్ డౌన్‌లోడ్ చేసుకొని డిజిటల్ సర్వే చేస్తారని తెలంగాణ వ్యవసాయ అధికారుల జేఏసీ ఒక ప్రకటనలో తెలిపింది. పది రోజులుగా ఏఈవోలు సర్వేకు దూరంగా ఉన్న అంశాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో.. తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ లచ్చిరెడ్డి, రామకృష్ణలు చర్చలు జరిపినట్లు తెలిపారు. సర్వే చేసే క్రమంలో ఏవైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని రఘునందన్‌రావు హామీ ఇచ్చినట్లు తెలిపారు. దీంతో బుధవారం నుంచి డిజిటల్ క్రాప్ సర్వేను ఏఈవోలు ప్రారంభిస్తారని తెలిపారు.

దేవీ నవరాత్రులు

నేటి అలంకారం
శ్రీ సరస్వతీ దేవి

ఆశ్వీయుజ శుద్ధ షష్ఠి/సప్తమి, బుధవారం (మూలా నక్షత్రం)

శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఏడో రోజున... విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మవారు శ్రీ సరస్వతీ దేవిగా దర్శనమిస్తారు. శరన్నవరాత్రుల్లో మూలా నక్షత్రానికి విశిష్ట ప్రాముఖ్యం ఉంది. మూలా నక్షత్రం అమ్మవారి జన్మ నక్షత్రం. బ్రహ్మ చైతన్య స్వరూపిణిగా సరస్వతీదేవిని పురాణాలు వర్ణించాయి. శ్వేతపద్మాన్ని అధిష్ఠించి, వీణ, దండ, కమండలాలు, జపమాల ధరించి, అభయముద్రతో భక్తుల అజ్ఞాన తిమిరాలను ఆమె దూరం చేస్తుందని విశ్వాసం. నవరాత్రుల్లో మూలా నక్షత్రం నుంచి విజయదశమి వరకు విశేష పుణ్యదినాలుగా అమ్మను ఆరాధిస్తారు. మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతిగా త్రిశక్తి స్వరూపిణి అయిన దుర్గాదేవి తన అంశలోని నిజస్వరూపాన్ని సాక్షాత్కరింప చేయడమే మూలా నక్షత్రం రోజున చేసే అలంకార ప్రత్యేకత. ఆమె సంగీత, సాహిత్యాలకు అధిష్ఠాన దేవత. ఈ తల్లిని ఆరాధించడం వల్ల బుద్ధి వికాసం, విద్యాలాభం కలుగుతాయి.



ఆమె చింతామణి సరస్వతి, జ్ఞాన సరస్వతి, నీల సరస్వతి, ఘట సరస్వతి, కిణి సరస్వతి, అంతరిక్ష సరస్వతి, మహా సరస్వతి అనే సప్తనామాలతో ప్రాణుల నాలుకలపై నర్తించే బుద్ధిప్రదాయిని. ఆమెను ఆరాధిస్తే విద్యను, జ్ఞానాన్ని, వాక్శుద్ధిని, మంచి బుద్ధిని ఇస్తుందనీ నమ్మిక.

నైవేద్యం:
దద్ధోజనం, పాయసం, ఇతర తీపి పదార్థాలు
అలంకరించే చీర రంగు: తెలుపు
అర్చించే పూలు: కలువ పూలు
పారాయణ చేయాల్సినవి: సరస్వతీ స్తోత్రాలు

సింగరేణికి బొగ్గు కష్టాలు!

ఏటేటా తరిగిపోతున్న బొగ్గు నిల్వలు.. పెద్ద సంఖ్యలో మూతపడనున్న బ్లాకులు

» రానున్న ఏడేళ్లలో 19 బ్లాకుల మూత

» ప్రస్తుతం 42 గనులోనే మైనింగ్

» 2042-43 నాటికి 19 గనులకే పరిమితం

» వేలంలో పాల్గొంటే గనులు దక్కే చాన్స్

» వేలానికి సుముఖత చూపని ప్రభుత్వం

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బొగ్గు ఉత్పత్తిలో 135 ఏళ్ల చరిత్ర కలిగి.. తెలంగాణ కొంగు బంగారంగా వెలుగొందుతున్న సింగరేణి సంస్థకు భవిష్యత్తులో బొగ్గు దొరకడమే కష్టంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. బొగ్గు నిల్వలు శరవేగంగా కరిగిపోతుండడం ఇందుకు ఒక కారణమైతే, గోదావరి-ప్రాణహిత లోయలో 600 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న బొగ్గు నిల్వలపై గుత్తాధిపత్యం రద్దు కావడం మరో కారణం. దీనికితోడు కళ్లముందే బొగ్గు నిల్వలు ఉన్నా వేలంలో పాల్గొననందున.. తప్పుకోలేని నిస్సహాయత ఇంకో కారణం. ప్రస్తుతం 22 భూగర్భ గనులు (యూజీలు), 20 ఓపెన్‌కాస్టులు(ఓసీలు) కలుపుకొని 42 గనుల్లో సింగరేణి మైనింగ్ చేస్తోంది. అయితే నిల్వలు తగ్గినందున 2024-25లో నాలుగు గనులను, 2025-26లో మరో నాలుగు గనులను మూసివేయనుంది. అనంతరం 2027-28 నుంచి 2031-32 మధ్యకాలంలో 11 గనులు మూతపడతాయని లెక్కలు చెబుతున్నాయి. ఆ తరువాత కూడా మరో నాలుగు గనులు మూతపడి 2042-43 నాటికి సింగరేణి 19 గనులకే పరిమితం కానుంది. వీటిలో 9 యూజీలు, 10 ఓసీలు ఉండనున్నాయి. ప్రస్తుతం 72.01 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేస్తున్న సింగరేణి సంస్థ 2042-43కు చేరేసరికి 39.03 మిలియన్ టన్నులకు పడిపోనుంది. ఈ నేపథ్యంలో సింగరేణి భవితవ్యానికి దారిచూపే బాధ్యతను సింగరేణి కార్మికులకే వదిలేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఈ నెల 11న ప్రతి బొగ్గుబావి వద్ద సమావేశం ఏర్పాటు చేసి.. వాస్తవాలను కార్మికులకు వివరించి, భవిష్యత్తు కార్యాచరణకు పునాది వేసుకోనుంది.

కేంద్రం కరుణిస్తేనే..

బొగ్గు కొరతను సింగరేణి అధిగమించాలంటే



గనుల కోసం కేంద్రం ముందు దేబిరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే బొగ్గు బావులు పొందాలంటే ప్రభుత్వ రంగసంస్థలు కూడా ప్రైవేటు సంస్థలతో పాటే బిడ్డింగ్‌లో పాల్గొనాలంటూ కేంద్ర ప్రభుత్వం మైన్స్ అండ్ మినరల్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్-2016 ప్రకారం వేలం పాటలు నిర్వహిస్తోంది. దేశంలో బొగ్గు గనుల వేలం 2020 నుంచి శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికి పదిసార్లు వేలం జరిగింది. ఇందులో బొగ్గు నిల్వలు ఉన్నట్లు సింగరేణి స్వయంగా అన్వేషించిన బ్లాకులూ ఉన్నాయి. పైగా ఇప్పటికే సింగరేణి మైనింగ్ చేస్తున్న బ్లాకులకు ముందు, వెనుకా ఉన్న బ్లాకులను కళ్లముందే వేలం వేసి ఎగరేసుకుపోతున్నా.. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకపోవడంతో వేలంలో ఆ సంస్థ పాల్గొనలేని పరిస్థితి నెలకొంది. అయితే ఎంఎండీఆర్ యాక్ట్-2016 లోని సెక్షన్ 17(2)ఏ ప్రకారం దక్కిన ప్రత్యేక అధికారాలతో బొగ్గు బ్లాకులను రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థకు కేటాయించే విచక్షణ కేంద్రానికి ఉంది. ఇదే సెక్షన్ కింద సింగరేణికి బ్లాకులు కేటాయించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. కేంద్రం మాత్రం బ్లాకులు కావాలంటే వేలంలో పాల్గొనాల్సిందేనని స్పష్టంచేస్తోంది. సింగరేణి అధికార యంత్రాంగం కూడా వేలంలో పాల్గొని బ్లాకులను దక్కించుకుంటేనే మేలని ప్రభుత్వానికి సూచిస్తోంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు సానుకూలత చూపడం లేదు.

19కి తగ్గనున్న గనులు..

కోల్‌బెల్ట్‌లో ప్రస్తుతం 42 బొగ్గు బ్లాకుల్లో సింగరేణి మైనింగ్ చేస్తోంది. వీటిలో భూగర్భ గనులు 22 ఉండగా, ఓపెన్‌కాస్టులు 20 ఉన్నాయి. 2025-26లో యూజీలు 18కి, ఓసీలు 19కి చేరనున్నాయి. అదే 2026-27 కల్లా యూజీలు 17కు, ఓసీలు 21కి(యూజీలను ఓసీలుగా మార్చే క్రమంలో)చేరనున్నాయి. 2027-28లో యూజీలు 18కి చేరి, ఓసీలు 21 దాకా ఉండనున్నాయి. రానున్న ఏడేళ్లలో 19 గనులు మూతపడతాయని గణాంకాలు చెబుతున్నాయి. భూగర్భ గనులన్నీ నష్టాల్లో ఉండగా.. ఓపెన్‌కాస్టులతో ఆ నష్టాలను భర్తీ చేస్తున్నారు. సింగరేణి ఉత్పత్తి చేసే బొగ్గులో 80% వాటా ఓపెన్‌కాస్టులది కాగా, 20% మాత్రమే భూగర్భ గనులది. భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తి చేసేందుకు ఒక టన్నుకు రూ.9 వేలకు పైగా ఖర్చవుతుండగా.. ఆ బొగ్గును అమ్మితే సింగరేణికి దక్కేది టన్నుకు రూ.4 వేలే. ఇక అదే ఓపెన్‌కాస్టుల్లో తీసే బొగ్గు టన్నుకు రూ.1700 లోపే ఖర్చవుతుండగా.. విక్రయించడం ద్వారా టన్ను కు రూ.4 వేలు వస్తున్నాయి. ప్రస్తుతం 72.01 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేస్తుండగా, 2042- 43 నాటికి అది 39.03 మిలియన్ టన్నులకు తగ్గనుంది. ఇందులో యూజీల వాటా 3.63 మిలియన్ టన్నులు కాగా, ఓసీల వాటా 35.40 మిలియన్ టన్నులు ఉండనుంది. ఇదిలా ఉండగా.. 2014 నాటికి సింగరేణిలో కార్మికుల సంఖ్య 60 వేలకు పైగా ఉండగా, ప్రస్తుతం 40,994కు చేరింది. 2042-43 నాటికి ఈ సంఖ్య 35,663కు తగ్గనుంది.

మూతపడే గనులు ఇవీ..

- 2024-25లో జేకే-5 ఓసీ, ఆర్జీ ఓసీ-1 ఎక్స్‌పెన్షన్, ఎస్ఆర్‌పీ-1 ఇంక్లైయిన్, ఆర్‌కేపీ ఓసీపీ-ఒకటో దశ.
- 2025-26లో కేటీకే-6అండ్6ఏ ఇంక్లైయిన్, ఆర్‌కే-5 ఇంక్లైయిన్, ఆర్‌కే-6 ఇంక్లైయిన్, ఆర్‌కే ఎన్‌టీ.
- 2027-28 నుంచి 2031-32 మధ్యకాలంలో కేకే-5 ఇంక్లైయిన్, కిష్టారం ఓసీ, కే హెచ్‌జీ ఓసీ, ఆర్‌కే-7 ఇంక్లైయిన్, పీకే ఓసీ, ఆర్జీ ఓసీ-3 ఎక్స్‌టెన్షన్, జీడీకే-11 ఇంక్లైయిన్, ఐకే1ఏ ఇంక్లైయిన్, కేవోసీ-2, వాకిపల్లిమైన్, పీవీకే 5 ఇంక్లైయిన్.

ఫీజుల చెల్లింపుల్లో సర్కారు నిర్లక్ష్యం

13 లక్షల విద్యార్థుల జీవితాలు అగమ్యగోచరం.. ఇప్పటికైనా ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించాలి

» కాంగ్రెస్ మోసాన్ని హరియాణ ప్రజలు గమనించారు: హరీశ్



హైదరాబాద్/సిద్దిపేట టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయి విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, 13 లక్షల మంది విద్యార్థుల జీవితాలను అగమ్యగోచరంగా మార్చిందని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. విద్యాసంస్థల యాజమాన్యాలు టీసీ, ఇతర సర్టిఫికెట్లు ఇవ్వని కారణంగా ఈ విద్యా సంవత్సరం చదువును కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు. మంగళవారం తెలంగాణ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు హైదరాబాద్‌లో హరీశ్ రావును కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా, సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.19 వేల కోట్లు ఫీజుల కోసం నిధులు విడుదల చేశామని తెలిపారు. ఏటా సగటున క్రమం తప్పకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్‌కోసం రూ.2వేల కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన పది నెలల్లో ఒక్కరూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే తెలంగాణ విద్యార్థులకు కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీట్లు రావడం సంతోషకరమని, మూడు లక్షల పైగా ర్యాంకులు వచ్చిన వారికి కూడా సీట్లు దక్కడం కేసీఆర్ ఘనతేనని హరీశ్ రావు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడేనాటికి కేవలం 5 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉండగా బీఆర్ఎస్ సర్కారు ప్రత్యేక కార్యాచరణ కారణంగా.. గడిచిన పదేళ్లలో 34కు పెరిగాయన్నారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్ చేసిన మోసాన్ని హరియాణ ప్రజలు నిశితంగా గమనించారని, ఆ ప్రభావం అక్కడి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా కనబడిందని పేర్కొన్నారు. కాగా.. కశ్మీర్‌లో బీజేపీని కూడా విశ్వసించలేదని, దీంతో రెండు జాతీయ పార్టీలపట్ల ప్రజల్లో ఉన్న విముఖత స్పష్టమైందని ఆయన అన్నారు.

పండుగపూట జీతాలివ్వని ప్రభుత్వం

రాష్ట్రంలో జీతాలు లేక ఆశాలు, అంగన్‌వాడీలు, పార్ట్‌టైం, గెస్ట్ లెక్చరర్లు పండుగ పూట పస్తులు ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని హరీశ్ రావు అన్నారు. ఒకటవ తేదీన జీతాలు ఇస్తున్నామన్న ప్రభుత్వం చెబుతున్నా.. ఆచరణలో జరగడం లేదని విమర్శించారు. కాగా, మంగళవారం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో హరీశ్‌రావును ఆశావర్కర్లు కలిసి తమకు ప్రభుత్వం జీతాలు చెల్లించడం లేదంటూ గోడు వెళ్లబోసుకున్నారు.

నీలా ఎంజాయ్ కోసం కాదు వరద సాయం కోసం ఢిల్లీ వెళ్లారు

కేటీఆర్‌పై ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్ లాగా సీఎం రేవంత్‌రెడ్డి దుబాయికి పోయి ఎంజాయ్ చేయట్లేదని, కేంద్రాన్ని వరదసాయం కోరేందుకు, కేంద్ర హోంశాఖ నిర్వహించిన సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి కోసం 23 సార్లు కాకుంటే.. 230 సార్లు హస్తినకు వెళ్తారన్నారు. సీఎం ఢిల్లీ పర్యటనపై విమర్శలు చేసేందుకు కేటీఆర్‌కు సిగ్గుండాలన్నారు. సీఎల్పీ మీడియా హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ప్రజల సొమ్మును జీతంగా తీసుకుంటూ ఫామ్‌హౌస్‌లో పడుకున్న కేసీఆర్.. పని చేస్తున్న సీఎం రేవంత్ పైన విమర్శలు చేయిస్తున్నాడని ఆరోపించారు. రేవంత్.. ఢిల్లీకి ముడుపులు పంపుతున్నారంటూ కేటీఆర్ మతిలేని మాటలు మాట్లాడుతున్నారని, ఆయన చెల్లెలు కవిత.. ఢిల్లీకి రూ. వంద కోట్ల ముడుపులు తీసుకెళ్లి దొరికిపోయిన సంగతి మరచిపోయారని ఎద్దేవా చేశారు. మరోమారు రేవంత్‌రెడ్డిని విమర్శిస్తే నాలుక చీరేస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు.


వేములవాడలో సద్దుల బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు

ఘనంగా బతుకమ్మ

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, సిరిసిల్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ ఉత్సవాలు మంగళవారం పలు చోట్ల ఘనంగా జరిగాయి. సచివాలయంలో, డీజీపీ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. సచివాలయంలో జరిగిన ఉత్సవాలకు సీఎస్ శాంతి కుమారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, దాండియా, బతుకమ్మ ఆట పాటల మధ్య సాగిన ఈ ఉత్సవాలలో సీనియర్ ఐఏఎస్ అధికారిణి వాణీ ప్రసాద్, సచివాలయ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. మరోవైపు డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో మహిళా అధికారులు, సిబ్బంది తాము రూపొందించిన బతుకమ్మల్ని ఒకచోట చేర్చి ఆట, పాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ బతుకమ్మ వేడుకల ప్రాముఖ్యతను వివరించారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలోనూ బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి.

టీజీవో భవన్‌లో వేడుకల్లో మంత్రి సీతక్క

నాంపల్లిలోని టీజీవో భవన్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మంత్రి సీతక్క సందడి చేశారు. చెరువులకు పూజలు చేసే పండుగగా బతుకమ్మను నిర్వహించుకునేవారిమని ఆమె తెలిపారు. తెలుగు మహిళల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భవన్‌లో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు.

వేములవాడలో సద్దులు..

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఎంగిలిపూల బతుకమ్మ నుంచి ఏడో రోజులకు ఇక్కడ సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తారు. బతుకమ్మ తెప్ప వద్ద నిర్వహించిన ఉత్సవాలకు కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. వేములవాడ మూలవాగులో నిర్వహించిన బతుక మ్మ వేడుకల్లో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురా లు విమలక్క పాల్గొన్నారు. కాగా, గురువారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై దాదాపు 10 వేల మహిళలతో సద్దుల బతుకమ్మ ఉత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు సీఎస్ శాంతికుమారి వెల్లడించారు. ఏర్పాట్లపై సచివాలయంలో సమీక్ష నిర్వహించారు.


సచివాలయంలో బతుకమ్మ ఆడుతున్న సీఎస్ శాంతి కుమారి

ఈడీ విచారణకు హాజరైన అజారుద్దీన్

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అజారుద్దీన్ మంగళవారం ఈడీ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. హెచ్‌సీఏలో రూ. 3.8 కోట్ల మేర అక్రమాలు జరిగినట్లు గతంలో ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మనీలాండరింగ్ కోణంలో విచారణ చేపట్టిన ఈడీ గత నవంబరులో సోదాలు జరిపింది. విచారణలో లభించిన సమాచారం, సోదాల్లో లభించిన పత్రాల మేరకు అజారుద్దీన్‌ను విచారించేందుకు తమ ఎదుట హాజరు కావాల్సిందిగా గతంలో ఈడీ నోటీసులు జారీ చేసింది. నోటీస్‌లు అందుకున్న అజారుద్దీన్ బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలో అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. పలు అంశాలపై అజారుద్దీన్‌ను ఈడీ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. అవసరమైతే మరోసారి తమ ఎదుట విచారణకు హాజరు కావాల్సి ఉంటుందని చెప్పినట్లు సమాచారం. ముగ్గురు అధికారుల బృందం దాదాపు తొమ్మిది గంటలపాటు విచారించినట్లు తెలిసింది. విచారణ అనంతరం అజారుద్దీన్ మీడియాతో మాట్లాడారు. తనపై తప్పుడు అభియోగాలు మోపారన్నారని వెల్లడించారు. కేసు విచారణ పూర్తి అయిన తర్వాత అన్ని వివరాలు వెల్లడిస్తానన్నారు. క్రికెట్ బంతుల కొనుగోలు, జిమ్ పరికరాలు, అగ్నిమాపక పరికరాలు, బకెట్ ఛైర్ల కొనుగోళ్లలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈ కేసుకు సంబంధించి అజారుద్దీన్ ముందస్తు బెయిల్ పొందారు. తాజాగా ఈడీ నోటీసులు అందడంతో విచారణకు హాజరయ్యారు.

అసత్యాలకు కేరాఫ్ 'సాక్షి'

- ట్యాగ్‌లైన్ అంశంలో వితండవాదం
- తప్పు ఒప్పుకుంటూనే 'ఆంధ్రజ్యోతి'పై బురద జల్లే యత్నం

హైదరాబాద్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వాస్తవాలతో సంబంధం లేకుండా అసత్యాలు వ్యాప్తి చేయడానికే 'సాక్షి' మీడియా సంస్థ ఉన్నట్టు మరోసారి స్పష్టమైంది. 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ట్యాగ్‌లైన్ అంశంలో ఆ సంస్థ వ్యవహరిస్తోన్న తీరు ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. పాత్రికేయ విలువలకు తిలోదకాలిచ్చిన సాక్షి. 'ఆంధ్రజ్యోతి' ట్యాగ్‌ను వాడి, తన వెబ్‌సైట్లో తమ సొంత వార్తలను ప్రచారం చేసుకున్న సంగతి తెలిసిందే. ట్యాగ్‌లైన్ విషయంలో తన అభ్యంతరాలు, అందుకు కారణాలను 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' స్పష్టంగా పేర్కొంది. పాత్రికేయ విలువలను పక్కనబెట్టి అనైతిక పద్ధతుల్లో విశేష జనాదరణ కలిగిన 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' పేరును వినియోగించడం సరికాదని 'సాక్షి'ని కోరింది. చేసిన పనికి క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో న్యాయపరంగా ముందుకెళ్తామని స్పష్టం చేసింది. అయితే, ఈ అంశంలో సాక్షి సంస్థ తన తప్పును అంగీకరిస్తూనే వితండవాదానికి దిగింది. ఒక వార్తా సంస్థకు సంబంధించిన ట్యాగ్‌లైన్‌ను మరో వార్తా సంస్థ ఉపయోగించకూడదనే విషయాన్ని ఆ పత్రిక ఎడిటర్ మంగళవారం తన ఎడిటోరియల్‌లో ప్రస్తావించారు. దీని ప్రకారం తాము చేసింది తప్పని ఆయన చెప్పకనే చెప్పారు. కానీ, 'ఆంధ్రజ్యోతి'కి సంబంధించిన కథనాలు రాసినప్పుడు అనుబంధ ట్యాగ్‌లైన్‌ను వాడాల్సి వస్తుందంటూ తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. తద్వారా ఏదైనా ఒక వార్తను రాస్తే దానికి సంబంధించిన కీ వర్డ్స్‌ను ఉపయోగిస్తారు కానీ ప్రతీ వార్తకు ట్యాగ్‌లను ఉపయోగించరనే కనీస అవగాహన సాక్షికి లేదని అర్థమైంది. అంతేకాక, కీ వర్డ్స్ ట్యాగ్‌ను ఎందుకు ఉపయోగిస్తారనే విషయంపై అసత్యాల సాక్షి మీడియా సంస్థకు కనీస అవగాహన లేదన్న విషయం తేలిపోయింది. తాము చేసిన తప్పును ఒప్పుకుంటూనే దమ్మున్న పత్రిక 'ఆంధ్రజ్యోతి'పై అసత్యాల 'సాక్షి' బురదజల్లేందుకు విఫలయత్నం చేసింది. నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ నిజాలను నిర్భయంగా చెప్పే మీడియా సంస్థ ఎవరిదో ప్రజలకు తెలియంది కాదు. ఇకనైనా అసత్యాలు ఆపి తప్పును ఒప్పుకుంటే అసత్యాల 'సాక్షి'కి కాస్త గౌరవమైనా దక్కుతుంది.



మహిళలకు పంపిణీ చేసే చీరలు పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

వ్యవసాయ అనుబంధ కార్పొరేషన్లకు పూర్వ వైభవం!

- అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చెయ్యండి
- వచ్చే ఆగస్టుకు సిద్దిపేట ఆయిల్ పామ్ పరిశ్రమ
- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా రాష్ట్రంలో నిర్వీర్యమైన వ్యవసాయ అనుబంధ కార్పొరేషన్లకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలా ఉపయోగపడాలి ? లాభదాయక వ్యాపారాలు ఎలా చేయాలి ? ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం కావాలి? అనే అంశాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ మేరకు టీజీ సీడ్ కార్పొరేషన్, మార్క్‌ఫెడ్, టెస్కో, హాకా, వేర్ హౌసింగ్, ఆయిల్‌ఫెడ్, సీడ్ సర్టిఫికేషన్‌తదితర కార్పొరేషన్ల ఛైర్మన్లు, ఉన్నతాధికారులతో సమావేశమైన తుమ్మల.. పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ..ఈ-కామర్స్ చేనేతలక్ష్మీ తదితర కార్యక్రమాల ద్వారా చేనేత వస్త్రాలకు ప్రచారం కల్పించాలని, టెస్కో అమ్మకాలు పెంచాలని సూచించారు. పోచంపల్లి టెక్స్‌టైల్ పార్కును అందుబాటులోకి తేవాలని, సిద్దిపేటలో నిర్మాణంలో ఉన్న ఆయిల్ పామ్ పరిశ్రమ ఆగస్టు నెలాఖరుకు వినియోగంలోకి రావాలని ఆదేశించారు. రాష్ట్రంలో మరిన్ని గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలను అందుబాటులోకి తేవాలని, ఇప్పటికే ఉన్నవాటిలో ఆధునికీకరణ పనులు చేపట్టాలని అన్నారు. అలాగే, గిడ్డంగుల సంస్థ కార్యక్రమాలకు సంబంధించిన 'క్విక్స్' సాఫ్ట్‌వేర్‌ను ఆవిష్కరించి కొన్ని సూచనలు చేశారు. కాగా, స్త్రీ శక్తి మహిళలు(స్వయం సహాయక సంఘాలకు చెందిన వారు) ఒక్కొక్కరికి ఏడాదికి రెండేసి నాణ్యమైన చీరలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తుమ్మల తెలిపారు. ఈ మేరకు మహిళలకు ఇచ్చేందుకు సిద్ధం చేసిన పీతాంబరి, గొల్లభామ, ఆర్మూర్, రామప్ప, టస్సార్ సిల్కు రకాల చీరలను పరిశీలించారు. ఆయా చీరలను ముఖ్యమంత్రికి చూపించి తుది నిర్ణయం తీసుకోవాలని చేనేత శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్‌కు సూచన చేశారు. కాగా, నారాయణపేటలో చేపట్టిన సెంటర్ ఆఫ్ హ్యాండ్లూమ్ ఎక్సలెన్స్ నిర్మాణం త్వరలో పూర్తికానుందని, అక్కడ సేల్స్ షోరూంలు, ఫుడ్ కోర్ట్, నేచురల్ డై యూనిట్, కెమికల్ డై యూనిట్, వీవింగ్ హబ్, ట్రైనింగ్ సెంటర్ అందుబాటులోకి రానున్నాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

తెలంగాణ ఆర్టీవోలో సారథి, వాహన్ పోర్టళ్లు

- కాలం చెల్లిన వాహనాల కోసం స్క్రాప్ పాలసీ: పొన్నం

రవాణా శాఖ కార్యకలాపాలను మరింత సులభతరం చేసేందుకు తెలంగాణ ఆర్టీవో(రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్)ల్లో సారథి, వాహన్ పోర్టళ్లు వినియోగించనున్నామని రవాణా శాఖ మంత్రి పొన్నంప్రభాకర్ తెలిపారు. దేశంలోని 28 రాష్ట్రాలు ఇప్పటికే ఈ పోర్టళ్లను వినియోగిస్తున్నాయని పేర్కొన్నారు. వాహన రిజిస్ట్రేషన్లు, పర్మిట్లు, పన్నులు, జరిమానాలు తదితర అంశాలు వాహన్ పోర్టల్‌లో ఉంటాయి. డ్రైవింగ్ లైసెన్సు, వాహన లైసెన్సులు తదితర సమాచారానికి సంబంధించిన డేటాబేస్ సారథి పోర్టల్‌లో ఉంటుంది. అంత రాష్ట్రాల మోటారు వాహనాలతో ఏర్పడుతున్న సమస్యలపై క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసి సారథి, వాహన్ పోర్టల్‌లో చేరాలని నిర్ణయించినట్టు మంత్రి పొన్నం తెలిపారు. ఏడాదిలోగా రాష్ట్రంలోని అన్ని ఆర్టీవో కార్యాలయాల్లో సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేస్తామన్నారు. వాహన కాలుష్య నివారణలో భాగంలో పాత వాహనాల స్క్రాపింగ్‌కు నూతన విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. పాత వాహనాలు స్క్రాప్ చేసిన వారికి కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ ఫీజులో రాయితీ ఇస్తున్నట్టు తెలిపారు. మోటారు వాహనాల ఫిట్‌నెస్ టెస్టింగ్‌కు రూ.296 కోట్ల వ్యయంతో రాష్ట్ర వ్యాప్తంగా 37 ఆటోమేటెడ్ టెస్టింగ్ కేంద్రాలను అందుబాటులోకి తెస్తున్నట్టు వెల్లడించారు. 15 ఏళ్ల దాటిన ప్రభుత్వ మోటారు వాహనాలన్నింటినీ ఉపసంహరించనున్నట్టు వివరించారు. కాగా, కొత్తగా రిజిస్టర్ అయ్యే వాహనాలకే టీజీతో నెంబరు వస్తుందని, ఇప్పటికే టీఎస్‌తో రిజిస్ట్రేషన్ సంఖ్య కలిగిన వాహనాలు టీజీలోకి మారాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు.

ఎస్‌హెచ్‌జీలకు బస్సులు ఎలా ఇద్దాం..?

- అధికారులతో మంత్రులు పొన్నం, సీతక్క చర్చ

మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇప్పించి, వారి ద్వారా బస్సులను ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేందుకు ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేస్తోంది. దీనిని ప్రయోగాత్మకంగా రెండు జిల్లాల్లో అమలు చేయాలని నిర్ణయించింది. మంగళవారం సచివాలయంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కలు ఆయా శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీకి అద్దె బస్సులు కేటాయించే అంశంలో విధి విధానాలపై చర్చలు జరిపారు. సీఎం సొంత జిల్లా మహబూబ్ నగర్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సొంత జిల్లా కరీంనగర్‌లో ప్రయోగాత్మకంగా ఈ బస్సులు నడపనున్నారు. మొదటి విడతలో 100-150 బస్సులను మహిళా సంఘాల ద్వారా కొనుగోలు చేయించాలని నిర్ణయించారు.

సంప్రదాయం, ఆధునికతల కలబోత తెలంగాణ

- రాష్ట్రానికి కొత్త పర్యాటక పాలసీని రూపొందిస్తున్నాం
- లాస్ ఏంజిలిస్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు

సంప్రదాయం, ఆధునికతల కలబోత తెలంగాణ అని మంత్రి జూపల్లి కృష్ణా రావు అన్నారు. తెలంగాణను పర్యాటకుల, ప్రపంచ పెట్టుబడిదారుల గమ్యస్థానంగా చేయాలనే లక్ష్యంతో అమెరికాలో పర్యటిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం లాస్‌ఏంజిలిస్‌లోని డబుల్ ట్రీ హోటల్‌లో నిర్వహించిన తెలంగాణ టూరిజం రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవాస భారతీయులు, విదేశీ ప్రతినిధులు, పర్యాటకులు, అక్కడి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ పర్యాటకులకు మంత్రి జూపల్లి ఆహ్వానం పలికారు. పర్యాటకంతో పాటు తెలంగాణలో పెరుగుతున్న పెట్టుబడుల అవకాశాలను వివరించారు. రాష్ట్రంలో అంతర్జాయతీయ ప్రమాణాలతో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు నూతన పర్యాటక విధానాన్ని రూపొందిస్తున్నామని జూపల్లి వెల్లడించారు.

ఐజీ, డీఎస్పీని అభినందించిన డీజీపీ

హైదరాబాద్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన పోలీస్ అధికారుల్ని డీజీపీ జితేందర్ అభినందించారు. ఇటీవల జరిగిన 50వ బెర్లిన్ మారథాన్‌లో పతకం సాధించిన ఐజీ ఎం. రమేష్‌ను, 73వ ఆల్ ఇండియా పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ 2024- 25లో కాంస్య పతకం సాధించిన డీఎస్పీ టి. లక్ష్మిని డీజీపీ అభినందించారు.

వర్గీకరణపై ఏక సభ్య కమిషన్!

(మొదటిపేజీ తరువాయి)



తెలిపారు. ఈ జ్యుడీషియల్ కమిషన్‌కు అవసరమైన ముసాయిదా నియమ నిబంధనలను అడ్వొకేట్ జనరల్ సిద్ధం చేశారని అధికారులు సమావేశం దృష్టికి తెచ్చారు. ఎస్సీల్లోని ఉప కులాలవారీగా ఉన్న ఉద్యోగుల వివరాలను ఇవ్వాలంటూ ఇప్పటికే టీజీపీఎస్సీ, టీజీఎల్‌పీఆర్‌బీ, ఎస్‌సీసీఎల్, ఎంహెచ్‌ఎస్‌ఆర్‌బీ, ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ వంటి సంస్థలను కోరినట్లు వివరించారు. ఇప్పటికే 30 శాతం వివరాలను ఆర్థిక శాఖ ద్వారా సేకరించినట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై మొత్తం 1,082 వినతులు క్యాబినెట్ సబ్ కమిటీకి అందాయి. వీటిని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో స్వీకరించినట్లు వివరించారు. పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలు అమలు చేస్తున్న ఎస్సీ వర్గీకరణను ఇప్పటికే రాష్ట్ర బృందాలు అధ్యయనం చేసి వచ్చాయి.

పంజాబ్, తమిళనాడులో వర్గీకరణ ఇలా..

పంజాబ్‌లో ఉద్యోగ నియామకాల కోసం ఎస్సీ వర్గీకరణను రెండు గ్రూపులుగా చేశారు. బాల్మీకి, మఝాబి సిక్కులను ఒక గ్రూపులో, మిగతా 37 సామాజిక వర్గాలను మరో గ్రూపులో ఉంచారు. 25 శాతం ఎస్సీ రిజర్వేషన్లను ఈ రెండు గ్రూపుల మధ్య విభజించి అమలు చేస్తున్నారు. అక్కడి ఎస్సీ జనాభాలో 40 శాతం వరకు ఉన్న బాల్మీకిలు, మఝాబి సిక్కులకు 12.5 శాతం రిజర్వేషన్లు, 60 శాతం వరకు ఉన్న మిగతా 37 సామాజిక వర్గాలకు 12.5 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తున్నారు. సెప్టెంబరు 23, 24 తేదీల్లో రాష్ట్ర బృందం తమిళనాడులో అధ్యయనం చేసింది. అక్కడి ప్రభుత్వం విద్య, ఉద్యోగ నియామకాల్లో ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తోంది. ఎస్సీల్లో 76 వరకు ఉప కులాలున్నాయి. ఎస్సీల వర్గీకరణ కోసం 2008 మార్చి 25న తమిళనాడు ప్రభుత్వం జస్టిస్ ఎంఎస్ జనార్దనం ఆధ్వర్యంలో ఏక సభ్య జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. కమిషన్ సిఫారసుల మేరకు 'తమిళనాడు అరుంధతీయర్స్ (ప్రత్యేక రిజర్వేషన్లు) చట్టాన్ని-2009'ను అమల్లోకి తెచ్చింది. ఆ చట్టం ప్రకారం.. మొత్తం 18 శాతం ఎస్సీ రిజర్వేషన్లలో అరుంధతీయర్లకు విద్య, ఉద్యోగ నియామకాల్లో 3 శాతం రిజర్వేషన్లను వర్తింపజేసింది. 2009 నుంచి ఆ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లు విజయవంతంగా అమలవుతున్నాయి.

వర్గీకరణ పూర్తికి నిర్దిష్ట గడువు ఉండాలి

ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను పూర్తి చేయడానికి నిర్దిష్ట గడువు ఉండాలని మంత్రి సీతక్క అన్నారు. క్యాబినెట్ సబ్ కమిటీ కొన్ని కీలక జిల్లాలను సందర్శించి, వర్గీకరణపై ప్రజాభిప్రాయాన్ని సేకరించాలని మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే జ్యుడీషియల్ కమిషన్ తప్పనిసరిగా సామాజిక న్యాయాన్ని ప్రతిబింబింపజేయాలని, నివేదికకు న్యాయబద్ధత ఉండాలని అన్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. క్యాబినెట్ సబ్ కమిటీ త్వరలోనే జిల్లాల పర్యటన చేపడుతుందని చెప్పారు. వివిధ మార్గాల ద్వారా సేకరించిన ఎస్సీ ఉప కులాల సమాచారాన్ని సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్(సెస్) సమీక్ష కోసం పంపిస్తామని తెలిపారు.

బీసీల సామాజిక, ఆర్థిక సర్వే చేయాలి

హైకోర్టు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలి ప్రభుత్వానికి మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వెనకబడిన తరగతుల (బీసీ) సామాజిక ఆర్థిక సర్వేను చేపట్టాలని ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. బీసీ ఓటర్ల గణనను డిసెంబరు 9లోపు పూర్తి చేయాలంటూ హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బీసీ ఓటర్ల లెక్కింపుతో పాటే బీసీల సామాజిక ఆర్థిక సర్వేను కూడా చేపట్టి గడువులోగా పూర్తి చేయాలని ఉపసంఘం రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఎస్సీ వర్గీకరణ అంశంపై చర్చించడానికి మంగళవారం సచివాలయంలో సమావేశమైన ఈ కమిటీ బీసీల సామాజిక ఆర్థిక సర్వేపై కూడా చర్చించింది. రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కమిటీ సమావేశంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, సీతక్క, పొన్నం ప్రభాకర్, డి.శ్రీధర్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు. బీసీల సామాజిక ఆర్థిక సర్వే, ఓటర్ల లెక్కింపు కూడా యుద్ధప్రాతిపదికన చేపట్టాలంటూ కమిటీ సిఫారసు చేసింది. అసెంబ్లీలో చేసిన తీర్మానం, క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు బీసీల సామాజిక ఆర్థిక సర్వేను చేపట్టాల్సి ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పునరుద్ఘాటించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం.. బీసీ ఓటర్ల సమాచారం కచ్చితత్వంతో ఉండాలని చెప్పారు. రాజకీయాల్లో బీసీల రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించడానికి ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సీనియర్ అధికారులు సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీసీ ఓటర్ల గణన, సామాజిక ఆర్థిక సర్వే సజావుగా సాగాలన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. బీసీ ఓటర్ల గణన ఎలాంటి తప్పులు లేకుండా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా సర్వేకు అవసరమైన ప్రొఫార్మా, న్యాయబద్ధత, నోడల్ ఏజెన్సీ బాధ్యతలు వంటి అంశాలను అధికారులు సమావేశం దృష్టికి తెచ్చారు. ఈ విషయాలన్నింటినీ తదుపరి క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో చర్చిద్దామని మంత్రులు తెలిపారు.

కుల గణనకు సర్కారు కసరత్తులు

అధికారులతో మంత్రి పొన్నం సమావేశం

షెడ్యూల్, విధివిధానాల రూపకల్పనపై చర్చ



హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కుల గణన చేపట్టడానికి కాంగ్రెస్ సర్కారు కసరత్తులు చేస్తోంది. ఈ మేరకు కుల గణనపై షెడ్యూల్ ఖరారు చేయడానికి రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో సచివాలయంలో మంగళవారం కీలక సమావేశం జరిగింది. బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, కమిషన్ సభ్యులు, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, సీఎం ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డితో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కర్ణాటక, బిహార్, ఆంధ్రప్రదేశ్‌లో చేసిన కుల గణనపై చర్చించారు. కర్ణాటకలో బీసీ కమిషన్ చేసిన సర్వే, బిహార్‌లో జీఏడీ ద్వారా చేసిన సర్వే, ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ రాజ్ ద్వారా సర్వే చేసిన అంశాలపై మాట్లాడారు. ఈ మూడు రాష్ట్రాల్లో అనుసరించిన పద్ధతులను పరిశీలించి, అందులో ఉత్తమ విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని నిర్ణయించారు. ఈ కుల గణన సర్వే నివేదిక ఎస్సీ వర్గీకరణకు సైతం ఉపయోగపడుతుందనే అంశమూ చర్చకు వచ్చింది. నివేదిక పారదర్శకంగా ఉండటానికి కుల గణనను జీఏడీ లేదా పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖ ద్వారా చేయించే విషయంపై రెండు మూడు రోజుల్లో సీనియర్ మంత్రులతో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోవాలని అనుకున్నారు. కుల గణనను సీనియర్ ఐఏఎస్ అధికారి నేతృత్వంలోని కమిటీ పర్యవేక్షించేలా చూడాలని అభిప్రాయపడ్డారు. కులగణన చేపడితే నెల రోజుల్లో పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ సెక్రటరీ లోకేశ్ కుమార్, కమిషనర్ అనితా రామచంద్రన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఏపీకి బుల్లెట్ ట్రైన్

(మొదటిపేజీ తరువాయి)

నడపాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన పనులు వేగంగా నడుస్తున్నాయి. దేశవ్యాప్తంగా మొత్తం ఏడు మార్గాల్లో ఈ హై స్పీడ్ రైళ్లను నడపాలని రైల్వే శాఖ గతంలో నిర్ణయించింది. ఇందులో దక్షిణాదిలో రెండు మార్గాలు ఉన్నాయి. చెన్నై నుంచి బెంగళూరు మీదుగా మైసూరు వరకూ ఒక ట్రైన్, ముంబాయి నుంచి హైదరాబాద్‌కు మరో ట్రైన్‌ను ఇందులో ప్రతిపాదించారు. మొదటి దశ ప్రతిపాదనల్లో ఆంధ్రప్రదేశ్ లేదు. కాని తాజాగా ఏపీని కూడా ఇందులో చేర్చినట్లు ముఖ్యమంత్రి... ఎంపీలకు తెలిపారు. దక్షిణాదిలో బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, అమరావతి నగరాలు కలిసేలా బుల్లెట్ రైళ్లు నడపడానికి ప్రతిపాదనలు తయారవుతున్నాయని ఆయన చెప్పారు. దీని కోసం ప్రత్యేకంగా రైల్వే ట్రాక్ వేయాల్సి ఉంటుందని, పూర్తి ప్రతిపాదనలు సిద్ధమైన తర్వాత రైల్వే శాఖ వివరాలు వెల్లడిస్తుందని ఆయన పేర్కొన్నారు.

రామాయపట్నంపై బీపీసీఎల్ మొగ్గు

రూ.అరవై వేల కోట్ల పెట్టుబడితో భారీ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉన్న భారత్ పెట్రోలియం కంపెనీ... రామాయపట్నంపై మొగ్గు చూపుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు...ఎంపీలకు తెలిపారు. ఈ కంపెనీ తన రిఫైనరీ ఏర్పాటుకు మూడు రాష్ట్రాలను పరిశీలించింది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేసుకొంది. ఏపీలో మూడు ప్రాంతాలను ఆ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. మచిలీపట్నం, రామాయపట్నం, మూలపాడు (శ్రీకాకుళం) పోర్టు ప్రాంతాలను ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ మూడు ప్రాంతాలను పరిశీలించిన తర్వాత ఆ కంపెనీ...రామాయపట్నం వైపు మొగ్గు చూపుతోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. రామాయపట్నం నెల్లూరు జిల్లాలో కందుకూరు ప్రాంతంలో ఉంది. వెయ్యి ఎకరాల్లో రూ. అరవై వేల కోట్ల పెట్టుబడితో వచ్చే ఈ రిఫైనరీ ఆ ప్రాంత స్వరూపాన్ని మార్చివేసే అవకాశాలు ఉన్నాయి. ఈ రిఫైనరీ ఏర్పాటుకు మచిలీపట్నం పోర్టు ప్రాంతాన్ని ఎంపిక చేసే అవకాశాలు పరిశీలించాలని బందరు ఎంపీ బాలశౌరి ఈ సమావేశంలో ముఖ్యమంత్రిని కోరారు. బీపీసీఎల్ తనకు నచ్చిన ప్రాంతాన్ని తాను ఎంపిక చేసుకొంటుందని, రాష్ట్రానికి రావాలని ప్రయత్నం చేస్తున్నాం తప్ప రాష్ట్రంలో ఎక్కడ పెట్టాలన్నది ఆ కంపెనీ ఇష్టమేనని ముఖ్యమంత్రి ఆయనకు చెప్పారు.

గ్రీన్ హైడ్రోజన్‌లో రూ.లక్ష కోట్ల పెట్టుబడి

విశాఖపట్నం ప్రాంతంలో రూ. లక్ష కోట్ల పెట్టుబడితో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు రాబోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టు వస్తోందని, దేశంలోనే ఇది అతి పెద్ద ప్రాజెక్టని ఆయన వెల్లడించారు. పునరుత్పాదక ఇంధనాల్లో ఇది కొత్త తరం టెక్నాలజీకి సంబంధించిందని, ఇక్కడ ఉత్పత్తి అయిన గ్రీన్ హైడ్రోజన్‌ను ఎగుమతి చేయడానికి కూడా అవకాశాలు ఉన్నాయని ఆయన ఎంపీలకు చెప్పారు.

కుటుంబ గౌరవానికి భంగం కలిగింది

మంత్రి వ్యాఖ్యలతో తీవ్ర అవమానం జరిగింది.. క్షమాపణ కోరలేదు, వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకోలేదు

- క్రిమినల్ పరువు నష్టం కేసులో నాగార్జున వాంగ్మూలం

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలతో తమ కుటుంబం తీవ్ర మనోవేదనకు లోనైందని హీరో నాగార్జున ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రిపై నాంపల్లిలోని ప్రత్యేక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఎక్సైజ్ కోర్టులో దాఖలు చేసిన క్రిమినల్ పరువు నష్టం దావాకు సంబంధించి నాగార్జున, అతడి మేనకోడలు సుప్రియ మంగళవారం కోర్టులో వాంగ్మూలం ఇచ్చారు. మరో సాక్షి మెట్ల వెంకటేశ్వర్ వాంగ్మూలాన్ని గురువారం నమోదు చేయాలని నిర్ణయించారు. ముగ్గురి వాంగ్మూలాలను పరిశీలించాక మంత్రికి సమన్లు ఇచ్చే విషయమై న్యాయమూర్తి ఒక నిర్ణయం తీసుకుంటారు. మంగళవారం మధ్యాహ్నం నాగార్జునతో పాటు భార్య అమల, సోదరి నాగసుశీల, కొడుకు నాగచైతన్య, మేనకోడలు సుప్రియ కోర్టుకు వచ్చారు. అసలు పరువు నష్టం దావా ఎందుకు దాఖలు చేశారని న్యాయమూర్తి శ్రీదేవి ప్రశ్నించారు. నాగార్జున వాంగ్మూలమిస్తూ, "దేశ వ్యాప్తంగా ఎందరో ప్రజల ఆదరాభిమానాలను పొందిన నాపై, నా కుటుంబంపై మంత్రి కొండా సురేఖ రాజకీయ దురుద్దేశంతో అమర్యాద పూర్వకంగా మాట్లాడారు. నా కొడుకు నాగ చైతన్య విడాకుల వ్యవహారం గురించి పూర్తి అవాస్తవమైన, అసత్యమైన వ్యాఖ్యలు చేశారు. "ఎన్ కన్వెన్షన్" కూల్చకుండా ఉండాలంటే మాజీ మంత్రి కేటీఆర్ దగ్గరకు వెళ్లాల్సిందిగా నేను సమంతను ఒత్తిడి చేసినట్టు ఎలాంటి ఆధారాలు లేకుండా మంత్రి అనుచిత వ్యాఖ్యలు చేశారు. సినీ రంగంలో, జాతీయ స్థాయిలో మా కుటుంబ సభ్యులు ఎన్నో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు సాధించారు. సమాజం పట్ల బాధ్యతతో మా కుటుంబం చాలా ఏళ్లగా అనేక సేవా కార్యక్రమాలను కూడా చేస్తోంది. అలా దశాబ్దాలుగా తన కుటుంబం నిర్మించుకున్న గౌరవ మర్యాదలకు మంత్రి చేసిన వ్యాఖ్యలతో భంగం కలిగింది. తీవ్ర మనోవేదనకు లోనయ్యాం. అవమానం ఎదుర్కొన్నాం. ఇప్పటి వరకు మంత్రి కనీసం మమ్మల్ని క్షమాపణలు కోరలేదు, ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోలేదు. బాధ్యతా యుతమైన మంత్రి పదవిలో ఉండి ఈ విధంగా మాట్లాడడం, సినీరంగంపై రాజకీయాలు చేయడం సబబు కాదు" అన్నారు. నాగార్జున మేనకోడలు సుప్రియ ప్రథమ సాక్షిగా సురేఖ చేసిన వ్యాఖ్యలను న్యాయమూర్తికి చదివి వినిపించారు. "మంత్రి సురేఖ వ్యాఖ్యలు షాక్‌కు గురి చేశాయి. ఆమె వ్యాఖ్యలతో మా కుటుంబానికి మనశ్శాంతి లేకుండా పోయింది. నాగ చైతన్య, సమంత విడాకులకు మాజీ మంత్రి కేటీఆరే కారణమని, ఎన్ కన్వెన్షన్ వ్యవహారం గురించి కేటీఆర్ దగ్గరకు సమంతను నాగార్జున వెళ్లమంటే ఆమె ఒప్పుకోలేదని, అందుకే విడాకులు తీసుకుందని సురేఖ చేసిన వ్యాఖ్యలను వార్త చానెళ్లు, పత్రికల్లో చూసి షాక్‌కు గురయ్యా. అసలు ఆమె మా కుటుంబం గురించి ఇలా ఎందుకు మాట్లాడారో అర్థం కావడం లేదు. సినీ పరిశ్రమను రాజకీయంగా లక్ష్యంగా చేసుకున్నట్లు కనిపిస్తోంది. అందుకే సురేఖ వ్యాఖ్యలను చిత్ర పరిశ్రమ మొత్తం ముక్తకంఠంతో ఖండించింది' అని సుప్రియ తన వాంగ్మూలంలో చెప్పింది.



నాంపల్లి కోర్టు నుండి బయటకు వస్తున్న నాగచైతన్య

ఆధారాలు సమర్పించాం: అశోక్‌రెడ్డి

ఈ కేసుకు సంబంధించి నాగార్జున తరపు న్యాయవాది అశోక్‌రెడ్డి మాట్లాడుతూ 'అక్కినేని నాగార్జున, ఆయన కుటుంబ సభ్యులపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యల వీడియోలను, టీవీ చానెళ్లు, పత్రికలు, వివిధ వెబ్‌సైట్లలో వచ్చిన వార్తలను కోర్టుకు ప్రాథమిక సాక్ష్యాలుగా సమర్పించాం. తదుపరి విచారణను న్యాయమూర్తి గురువారానికి వాయిదా వేశారు. భారత న్యాయ సంహితలోని సెక్షన్ 356 ప్రకారం కేసు నమోదు చేయాలని పిటిషన్‌లో కోరాం' అని చెప్పారు.

కేసు నిలబడదు: తిరుపతివర్మ

టీపీసీసీ లీగల్ సెల్ ఛైర్మన్ తిరుపతి వర్మ మాట్లాడుతూ, "నాగార్జున, సుప్రియ వాంగ్మూలాలు ఒకదానికొకటి పొంతన లేకుండా ఉన్నాయి. ఆ వాంగ్మూలాలను బట్టి చూస్తుంటే కేసు నిలబడదని అనిపిస్తోంది. మంత్రికి న్యాయస్థానం సమన్లు ఇస్తే న్యాయ పోరాటం చేస్తాం. ఎంతదూరమైన వెళ్తాం. సురేఖపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నాం" అని తెలిపారు.

కాంగ్రెస్ 7 గ్యారెంటీలను హరియాణ ప్రజలు తిరస్కరించారు

- ఇప్పటికైనా రాహుల్‌గాంధీ బుద్ధి తెచ్చుకోవాలి
- బీజేపీని నిలువరించే శక్తి ప్రాంతీయ పార్టీలకే ఉంది
- చిరుద్యోగులకు పండుగపూట పస్తులేనా?: కేటీఆర్



హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో ఐదు, తెలంగాణలో ఆరు గ్యారెంటీలంటూ అడ్డగోలు హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్.. హరియాణలో ఏడు గ్యారెంటీలని మభ్యపెట్టే ప్రయత్నాన్ని ఆ రాష్ట్ర ప్రజలు తిరస్కరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హామీల అమలులో కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలు చేస్తున్న మోసాన్ని దేశం మొత్తం గమనిస్తోందనడానికి ఈ ఎన్నికల ఫలితాలు నిదర్శనమని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్కో రాష్ట్ర ఎన్నికల్లో ఒక్కో గ్యారెంటీ పెంచుకుంటూ గారడీ చేద్దామని చూసిన కాంగ్రెస్ బొక్కబోర్లా పడిందని ఎద్దేవా చేశారు. హరియాణలో కాంగ్రెస్ ఓటమితోనైనా రాహుల్ గాంధీ బుద్ధి తెచ్చుకోవాలని, చెప్పేమాటలకు చేస్తున్న పనులకు పొంతన లేనప్పుడు ఇలాంటి చెంపపెట్టు లాంటి ఫలితాలు తప్పవన్నారు. బుల్డోజర్‌రాజ్, పార్టీ ఫిరాయింపులు, రాజ్యాంగ పరిరక్షణ పేరుతో ఆయన చేసిన డ్రామాలకు హరియాణ ప్రజలు తగిన బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. సోషల్ మీడియా విస్తృతి పెరిగిన ఈ రోజుల్లో రాష్ట్రాలు వేరైనా ప్రజల నుంచి వాస్తవాలు దాచడం సాధ్యంకాదన్నారు. కాంగ్రెస్‌తో హోరాహోరీ ఉన్న రాష్ట్రాల్లోనే బీజేపీ గెలుస్తోందని, ఆ పార్టీ ఓటమికి రాహుల్ గాంధీ బలహీన నాయకత్వంకూడా ఓ ప్రధాన కారణమన్నారు. బీజేపీని ఢీకొని నిలువరించే శక్తి కేవలం ప్రాంతీయ పార్టీలకు మాత్రమే ఉందన్న విషయం ఆయా రాష్ట్రాల్లో జరిగిన ఎన్నిక లను చూస్తే అర్థమైపోతుందని తెలిపారు. . మరోవైపు.. ప్రభుత్వ శాఖల్లో పనిచేసే చిరుద్యోగులు వేతనాలు రాక విలవిలలాడుతున్నారని, ఈ దండగమారి పాలనలో పండుగపూట వారంతా పస్తులు ఉండాల్సిందేనా? అని కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఐదారునెలలుగా జీతాల్లేవని, పంచాయతీ వర్కర్లు, మునిసిపాలిటీ కార్మికులు, ఆస్పత్రి సిబ్బంది, హాస్టల్ వర్కర్లు, గెస్ట్ లెక్చరర్లు.. ఇలా ప్రతీశాఖలో వేతనాల పెండింగ్ ఉందన్నారు. ఆయా ఉద్యోగులు తమ కుటుంబాలను నెట్టుకురావడానికి అప్పులుచేసి తిప్పలు పడుతున్నారని పేర్కొన్నారు. ఒకటో తేదీనే జీతాలిస్తామన్న మీ ప్రగల్భాలు ఏమయ్యాయని నిలదీశారు. ఉద్యోగుల అవస్థను గుర్తించి తక్షణం వేతనాలు చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.






Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director: Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి

హైదరాబాద్ ● బుధవారం 9 అక్టోబరు 2024
diksuchi@andhrajyothy.com

హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ (పీజేటీఎస్‌ఏయూ), పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ (పీవీఎన్‌ఆర్‌టీవీయూ), సిద్ధిపేట-ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీ (ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ) ఉమ్మడిగా వ్యవసాయ ఆధారిత డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్‌ను విడుదల చేశాయి. దీని ద్వారా బైపీసీ స్ట్రీమ్ కింద బీఎస్సీ ఆనర్స్, బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్‌ఎస్సీ, బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లలోని నాన్ రూరల్, రూరల్, నాన్ ఫార్మర్స్, ఫార్మర్స్ కోటా సీట్లు భర్తీ చేస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అగ్రికల్చరల్, వెటర్నరీ, హార్టికల్చర్ కాలేజీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఆగస్టు 28 నాటికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చు.

తెలంగాణ వ్యవసాయ కళాశాలల్లో డిగ్రీ కౌన్సెలింగ్



ప్రోగ్రామ్‌లు-సీట్లు

బీఎస్సీ ఆనర్స్: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. అగ్రికల్చర్, కమ్యూనిటీ సైన్స్, హార్టికల్చర్ విభాగాలు ఉన్నాయి. పీజేటీఎస్‌ఏయూ పరిధిలోని రాజేంద్రనగర్, అశ్వారావుపేట, పొలాస, పాలెం, వరంగల్ అర్బన్, సిరిసిల్లా, ఆదిలాబాద్ అగ్రికల్చరల్ కాలేజీల్లో మొత్తం 615 రెగ్యులర్ సీట్లు, 227 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు; సైఫాబాద్ కమ్యూనిటీ సైన్స్ కాలేజీలో 38 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు; ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ పరిధిలోని రాజేంద్రనగర్, మోజెర్ల, మల్యాల్ హార్టికల్చర్ కాలేజీల్లో మొత్తం 200 రెగ్యులర్ సీట్లు, 34 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి.

బీటెక్(ఫుడ్ టెక్నాలజీ): ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. స్పెషలైజేషన్ 'ఫుడ్ టెక్నాలజీ'. పీజేటీఎస్‌ఏయూ పరిధిలోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(నిజామాబాద్ జిల్లా-రుద్రూర్)లో 25 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి.

బీవీఎస్సీ & ఏహెచ్: ప్రోగ్రామ్ వ్యవధి అయిదున్నరేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లో వెటర్నరీ సైన్స్ ప్రధాన విభాగం. పీవీఎన్‌ఆర్‌టీవీయూ పరిదిలోని రాజేంద్రనగర్, కోరుట్ల, మామునూర్ వెటర్నరీ సైన్స్ కాలేజీల్లో మొత్తం 184 సీట్లు ఉన్నాయి.

బీఎఫ్‌ఎస్సీ: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లో ఫిషరీ సైన్స్ ప్రధాన విభాగం. పీవీఎన్‌ఆర్‌టీవీయూ పరిధిలోని పెబ్బైర్ ఫిషరీ సైన్స్ కాలేజీలో 28 సీట్లు, నెల్లూరు జిల్లా-ముత్తుకూరు ఫిషరీ సైన్స్ కాలేజీలో 11 సీట్లు ఉన్నాయి.

కౌన్సెలింగ్ వివరాలు

- తెలంగాణ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ప్రొఫెసర్ జయశంకర్, శ్రీ కొండా లక్ష్మణ్ వర్సిటీల పరిధిలో ఒక్కోదానిలో 40 శాతం సీట్లు; పీవీ నరసింహారావు వర్సిటీ పరిధిలో 25 శాతం సీట్లను గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థులకు ప్రత్యేకించారు. మొత్తమ్మీద 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. మిగిలిన 15 శాతం సీట్లకు తెలుగు రాష్ట్రాల అభ్యర్థులందరూ పోటీ పడవచ్చు.
- ఫార్మర్స్ కోటా కింద ప్రవేశం పొందాలంటే అభ్యర్థులు వ్యవసాయ కుటుంబానికి చెందినవారై ఉండాలి. తల్లిదండ్రులకు గానీ, అభ్యర్థి పేరు మీద గానీ కనీసం ఒక ఎకరం వ్యవసాయ భూమి ఉండాలి. గ్రాండ్‌ఫాదర్/గ్రాండ్‌మదర్/గార్డియన్ పేరు మీద భూమి ఉన్న పక్షంలో ఈ రిజర్వేషన్ వర్తించదు. అభ్యర్థులు కనీసం నాలుగేళ్లు గ్రామీణ ప్రాంతాల్లో చదివి ఉండాలి.

కౌన్సెలింగ్ షెడ్యూల్

- తెలంగాణ ఈఏపీసెట్ 2024లో 237-5295 మధ్య ర్యాంక్ సాధించినవారికి అక్టోబరు 14న; 5303-8788 మధ్య ర్యాంక్ సాధించినవారికి అక్టోబరు 15న; 8805-12996 మధ్య ర్యాంక్ సాధించినవారికి అక్టోబరు 16న; 1304-17800 మధ్య ర్యాంక్ సాధించినవారికి అక్టోబరు 17న; 17806-22997 మధ్య ర్యాంక్ సాధించినవారికి అక్టోబరు 18న; 23002-29999 మధ్య ర్యాంక్ సాధించినవారికి అక్టోబరు 19న కౌన్సెలింగ్ ఉంటుంది. అన్ని కేటగిరీల అభ్యర్థులకూ ఈ షెడ్యూల్ వర్తిస్తుంది.


ప్రోగ్రామ్ ఫీజు

- పీజేటీఎస్‌ఏయూ కళాశాలల్లో బీటెక్(ఫుడ్ టెక్నాలజీ), బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్) ప్రోగ్రామ్‌లకు ఒక్కో సెమిస్టర్‌కు రూ.46,550. పీవీఎన్‌ఆర్‌టీవీయూ కళాశాలల్లో బీవీఎస్సీ అండ్ ఏహెచ్ ప్రోగ్రామ్‌నకు ఏడాదికి రూ.63,260; బీఎఫ్‌ఎస్సీ ప్రోగ్రామ్‌నకు సెమిస్టర్‌కు రూ.48,130. ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ కళాశాలల్లో బీఎస్సీ ఆనర్స్ హార్టికల్చర్ ప్రోగ్రామ్‌నకు సెమిస్టర్‌కు రూ.46,710.

ముఖ్య సమాచారం

- **అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు తీసుకురావాల్సిన పత్రాలు:** ఆన్‌లైన్ అప్లికేషన్ కాపీ, పదో తరగతి సర్టిఫికెట్, ఇంటర్ మార్కుల పత్రాలు, టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ కార్డ్, ఆరు నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్‌లు, అగ్రికల్చరల్ ల్యాండ్ సర్టిఫికెట్‌లు, కులం-ఆదాయం-వైకల్యం ధ్రువీకరణ పత్రాలు.
- **కౌన్సెలింగ్ సెంటర్:** హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని పీజేటీఎస్‌ఏయూ ఆడిటోరియం
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

కాళోజీ అనుబంధ కళాశాలల్లో ఆయుష్ డిగ్రీలు



వరంగల్‌లోని కాళోజీ నారాయణ రావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(కేఎన్‌ఆర్‌యూహెచ్‌ఎస్)- తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ అనుబంధ కళాశాలల్లో ఆయుష్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా బీఏఎంఎస్, బీహెచ్‌ఎంఎస్, బీయూఎంఎస్, బీఎన్‌వైఎస్ కోర్సుల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా సీట్లు భర్తీ చేయనున్నారు. నీట్ యూజీ 2024 స్కోర్, కౌన్సెలింగ్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి అయిదున్నరేళ్లు.

నీట్ యూజీ 2024 కటాఫ్: మొత్తం 720 మార్కులకు గాను జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 162; జనరల్ కేటగిరీ దివ్యాంగులకు 144; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 127 మార్కులను కటాఫ్‌గా నిర్దేశించారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ(బోటనీ, జువాలజీ), ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. బీయూఎంఎస్ కోర్సులో ప్రవేశానికి పదోతరగతి/ఇంటర్ స్థాయిలో ఉర్దూ/అరబిక్/పర్షియన్ లాంగ్వేజ్‌ను ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. ఇంటర్ స్థాయిలో జనరల్, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థులకు 50 శాతం; జనరల్ కేటగిరీ దివ్యాంగులకు 45 శాతం; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి.

- **రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్ ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.2500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 13
- **వెబ్‌సైట్:** www.knruhs.telangana.gov.in

ఐఐఐటీడీఎంజేలో పీహెచ్‌డీ



జబల్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్(ఐఐఐటీడీఎంజే)- పీహెచ్‌డీ 2024 వింటర్ సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. నిర్దేశిత జాతీయ పరీక్ష స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రిటెన్ టెస్ట్/పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, డిజైన్, నేచురల్ సైన్సెస్-ఫిజిక్స్, నేచురల్ సైన్సెస్-మేథమెటిక్స్

అర్హత: స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఈ/ఎంటెక్/ఎండిజైన్/ఎమ్మెస్సీ/ఎంఫిల్ పూర్తిచేసి ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. గేట్/సీడ్/సీఎస్ఐఆర్ నెట్/యూజీసీ నెట్ స్కోర్ ఉండాలి. సీఎస్ఐఆర్/యూజీసీ/డీఏఈ/డీఎస్‌టీ/డీబీటీ/ఎన్‌బీహెచ్‌ఎం ఫెలోషిప్‌లను అనుమతిస్తారు.

ఫైనాన్షియల్ సపోర్ట్: ఫుల్ టైం అభ్యర్థులకు ఇన్‌స్టిట్యూట్ అసిస్టెంట్‌షిప్ కింద మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000; చివరి మూడేళ్లు నెలకు రూ.42,000ల ఫెలోషిప్ ఇస్తారు. ప్రాజెక్ట్ వర్క్ కోసం రూ.50,000 చెల్లిస్తారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లలో రీసెర్చ్ వర్క్ ప్రజంటేషన్ కోసం రూ.50,000 అదే నేషనల్ కాన్ఫరెన్స్‌లలో అయితే రూ.10,000 ఇస్తారు.

ముఖ్యసమాచారం

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 17
- **రాత పరీక్ష/ఇంటర్వ్యూ కోసం ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** అక్టోబరు 22
- **రాత పరీక్ష/ఇంటర్వ్యూలు:** అక్టోబరు 28
- **ప్రోగ్రామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** నవంబరు 5
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** నవంబరు 11 నుంచి
- **వెబ్‌సైట్:** admission.iiitdmj.ac.in

ఐఐటీ మండీలో

మండీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ మండీ)కి చెందిన స్కూల్ ఆఫ్ ఫిజికల్ సైన్సెస్(ఎస్‌పీఎస్)- రెగ్యులర్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

పరిశోధనాంశాలు: పెరోవ్‌స్కైట్ ఆప్టోఎలక్ట్రానిక్ డివైజెస్, ఎక్స్‌పరిమెంటల్ కండెన్స్‌డ్ మేటర్ ఫిజిక్స్, ఎక్స్‌పరిమెంటల్ హై ఎనర్జీ ఫిజిక్స్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఎమ్మెస్సీ(ఫిజికల్ సైన్సెస్) ఉత్తీర్ణతతోపాటు గేట్/జెస్ట్/నెట్ వ్యాలిడ్ స్కోర్ లేదా సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్/డీఎస్‌టీ-ఇన్‌స్పైర్ జేఆర్ఎఫ్ అర్హత పొంది ఉండాలి. సీఎఫ్‌టీఐ గుర్తింపు పొందిన కళాశాలలు/ఐఐటీలు/ఐసర్ సంస్థల నుంచి కనీసం 7.5 సీజీపీఏతో బీఈ/బీటెక్/బీఎస్ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వర్కింగ్ ప్రొఫెషనల్స్ అయితే పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.200; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 30
- **వెబ్‌సైట్:** iitmandi.ac.in

'LIFE'S GOOD' Scholarship Program

Description: LG Electronics India Private Limited invites applications from students pursuing undergraduate and postgraduate courses at select colleges/institutes across India.


Eligibility: Students must be pursuing undergraduate/postgraduate courses (any academic year) from select colleges/institutes across India. First-year students must have scored a minimum of 60% marks in their class 12th examinations, while students in the 2nd, 3rd, and 4th years must have achieved a minimum of 60% marks in the previous academic year. Preference will be given to meritorious students, female students and students with an annual family income of not more than INR 8 lakh. Selections are made on a first-come, first-served basis.

Prizes & Rewards: For UG students - 50% of tuition fees or up to INR 1 lakh (whichever is lesser)

- For PG students - 50% of tuition fees or up to INR 2 lakh (whichever is lesser)
- For meritorious candidates with zero tuition fees and a family income of less than INR 8 lakh:
- UG students will receive INR 50,000
- PG students will receive INR 1 lakh

Last Date to Apply: 31-10-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/LGIGS2

SCHOLARSHIP ALERT



Louis Dreyfus Agri-Scholars Program

Description: An initiative by Louis Dreyfus Company India Private Limited aimed at providing financial assistance to underprivileged students pursuing undergraduate courses in agriculture.

Eligibility: Open to students in their first or second year of undergraduate courses in agriculture at select institutions. Applicants must have secured at least 60% marks in their Classes 10 and 12, with a combined annual family income of less than INR 8 lakh.

Prizes & Rewards: Up to INR 50,000
Last Date to Apply: 31-10-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/DASPL1

Colgate Keep India Smiling Scholarship



Description: An initiative of Colgate-Palmolive (India) Limited to provide financial assistance and support to individuals who are deserving and meritorious but may lack the resources to pursue their dreams.

Eligibility: Indian students who are currently enrolled in Bachelor of Dental Surgery (BDS) (any year) or Master of Dental Surgery (MDS) courses in a recognised government or private institute. Applicants must have scored at least 65% marks in Class 12. Students must have an overall score of above 60% in their BDS to apply for MDS scholarship. The annual family income of the applicants from all sources must not exceed INR 8 lakh.

Prizes & Rewards: Scholarship of INR 75,000
Last Date to Apply: 31-10-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/CKISSP3

buddy4study.com

లిటిల్స్


సోమరి సుబ్బయ్య

అనంత వరం అనే ఊరికి కూతవేటు దూరంలో ఒక అడవి ఉంది. ఈ గ్రామ ప్రజలు పళ్లు కాయలు అవసరమైన వంట చెరకు కోసం హాయిగా అడవికి నడిచి పోయి అన్నీ తెచ్చుకునే వారు. ముఖ్యంగా చిన్న పిల్లలు అడవికి వెళ్లి, అక్కడే చెట్ల నీడలో ఆడుకొని, ఆ చెట్ల తియ్యనిపండ్లను కోసుకుని వచ్చేవారు. ఒక రోజు చందుఅనే పిల్లవాడు రేగు పండ్ల కోసం అడవికి వెళ్లి, కాసేపు పండ్లు కోసుకున్న తర్వాత ఆ ఎండకు తట్టుకోలేక ఆ చెట్టు నీడలో సొమ్మసిల్లిపడి పోయి అలాగే నిద్ర పోయాడు. పక్కనున్న చెట్ల మీద కూర్చున్న కొన్ని కోతులు చందు ఇబ్బంది చూసి సాయం చేయాలి అనుకున్నాయి. ఆ కోతుల్లో పెద్ద కోతులు చెట్ల కొమ్మలను బలంగా ఊపితే, చిన్న కోతులు పండ్లను కోసి, చందు సంచీలో వేసాయి.



మెలకువ వచ్చాక చుట్టూ చూసుకున్న చందూకి, తన చుట్టూ రాలిపడిన చాలాపండ్లు, ఇంకా తన సంచీ నిండా తియ్యని మంచి పండ్లు కనిపించాయి, చెట్టు కొమ్మలమీద చూస్తే, కనిపించిన కోతులను చూసి అవే తనకు సాయం చేసి ఉంటాయని గ్రహించాడు చందు. సంతోషంగా ఆ పండ్ల సంచీని తీసుకుని ఇంటికి వెళ్లి, జరిగినదంతా ఇంట్లో వారితో చెప్పాడు. అందరూ అది విని ఆశ్చర్య పోతే, చందు మేనమామ సుబ్బయ్య మాత్రం తాను కూడా అడవికి వెళ్లి అలాగే పండ్లు సంపాదించాలి అని పథకం వేసుకున్నాడు, ఆ మర్నాడు సుబ్బయ్య మధ్యాహ్నం పూట ఎండగా ఉన్నపుడు అడవికి బయలుదేరి, ఆ చెట్టు దగ్గరికి వెళ్లి, సంచీ పక్కన పడేసి,ఆ నీడలో పడి నిద్రపోయాడు కోతులు వచ్చితనకు సాయం చేస్తాయో లేదో అని నిద్ర నటిస్తూ, గమనిస్తూ ఉన్నాడు. కాసేపటికి, చెట్టుకింద ఎవరో పడుకొని ఉన్న విషయం గమనించిన కోతులు సుబ్బయ్య దగ్గరికి వచ్చి చూసి, అతను నిద్ర నటిస్తున్న విషయం అర్థం చేసుకుని పండ్లు కోసి సాయం చేయడం మానేసి, అతని మీద దూకి, తమ గోర్లతో రక్కి గాయ పరిచాయి. ఆ గాయాలతో ఇంటికి వెళ్లిన సుబ్బయ్య 'అనవసరంగా దురాశ కి పోయి సోమరితనంతో శ్రమ లేకుండా పండ్లు సంపాదించాలని పోయి, గాయాల పాలయ్యాను కదా' అని విచారించాడు.


సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి



ఏవి ఏన్ని?



డైలీ సుడోకు - 430

3		9						5
			3				1	6
		8		9	4			
			4	6				
1	9						4	7
				5	7			
			5	7		2		
6	2				3			
8						3		1

సుడోకు - 429 సమాధానం

5	2	6	9	1	3	7	4	8
9	1	7	8	6	4	5	3	2
3	4	8	2	5	7	9	6	1
4	9	3	6	7	8	2	1	5
1	8	5	4	2	9	3	7	6
6	7	2	1	3	5	8	9	4
2	3	4	7	8	1	6	5	9
8	5	1	3	9	6	4	2	7
7	6	9	5	4	2	1	8	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.